మాబులు
గత వారంరోజుల్లో వార్తల్లో
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 359 పేజీలు: 12 వెల: 6.50

అజిత్ అంత్యక్రియలకు మంత్రి లోకేష్ హాజరు 2లో
ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ 9లో

# వడివడిగా రోడ్ల విస్తరణ

## రూ.1.40 లక్షల కోట్ల జాతీయ రహదార్ల ప్రాజెక్టులు 2029కి పూర్తి

## 2027కు బెంగలూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్

## రవాణా వ్యయం తగ్గించేలా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు: సిఎం చంద్రబాబు



గురువారం జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి శాఖపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల సంస్థ, కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నెట్వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ పెంపు, ప్రస్తుతం ఏపీలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం ఓడరేవులను ఈ జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచనలు జారీ చేశారు. ఈ పోర్టులకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరుకు రవాణా చేసేలా హింటర్ ల్యాండ్‌ను కనెక్టు చేసేలా రోడ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో దేశంలోనే ఏపీ బెంచ్ మార్క్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4లేన్లుగా, 6 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రూ.42,194 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం పురోగతిలో >>2

## ఎపిలో తగ్గుతున్న ద్రవ్యోల్బణం



### కేంద్ర ఆర్థిక సర్వేలో పేర్కొన్న మంత్రి సీతారామన్

### రెండు తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన ధాన్యం దిగుబడి

**విజయవాడ,జనవరి 29, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ద్రవ్యోల్బణం గుర్తించ తగిన స్థాయిలో తగ్గుతుంది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని వెల్లడించారు.,ఆంధ్రప్రదేశ్‌లో 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చినట్లు తెలిపారు.. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు 1.72 శాతం కంటే తక్కువ నమోదైనట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఏపీలో ధాన్యం దిగుబడి తక్కువగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. అకాల వర్షాలే ఇందుకు కారణమని చెప్పింది. కొత్త నగరాల విస్తరణలో అమరావతి గురించి ఆర్థిక సర్వేలో కేంద్రం ప్రస్తావించింది. లోక్‌సభలో ఆర్థికసర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు. 2026- 27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ 2026 2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవుతుందని సర్వే అంచనా వేసింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 202526 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2022- 23 నుంచి 2025- 26 వరకు ద్రవ్యోల్బణం భారీగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. ముఖ్యం గా తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 నుంచి 0.20 శాతానికి పడిపోయినట్లు పేర్కొంది.

## కొండెక్కిన వెండి

### ఒకే రోజు రూ.21వేలు పైగా పెరుగుదల

### మరో రూ.12వేలు పెరిగిన బంగారం

**ముంబయి, జనవరి 29:** బంగారం, వెండి ధరలు ర్యాలీ మరింత వేగంగా దూసుకుపోతున్నాయి. గురువారం, బంగారం వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో వెండి తొలిసారిగా కిలోకు 4 లక్షల రూపాయలు దాటింది. బంగారం సైతం 10 గ్రాములకు 1.8 లక్షల రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న భయాలు, రాజకీయ ఒత్తిడుల కారణంగా ధరలు కొండెక్కుతున్నాయి. ఎంసిఎక్స్‌లో ఫిబ్రవరి 5, 2026కి ముగిసేబంగారం కాంట్రాక్టు ధర 6శాతంపెరిగింది. 10 గ్రాములకు గానూ 1,75,869 రూపాయలకు చేరింది. మార్చ్ 5, 2026కి ముగిసే వెండి ధర5శాతం పెరిగి 4,00,780 రూపాయలకు వచ్చింది. ప్రధాన కారణం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచకూడదని నిర్ణయించడమని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ పరిణామాలు కూడా ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై హెచ్చరికలు చేశారు. న్యూక్లియర్ చర్చలు నిలిచిపోయాయని, సమయం ముగుస్తోంది అని చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో భారీ సైనిక నియామకాలు చేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి రికార్డ్ స్థాయిలకు చేరాయి. స్పాట్ బంగారం ఒక్కరోజులో 3 పెరిగి 5,591.61 ఒకౌన్స్‌కి చేరింది. వెండి ఒక్కసారిగా 119.34 ఒకౌన్స్‌కి చేరి, తర్వాత 118.061 వద్ద స్థిరపడింది. మార్కెట్ విశ్లేషకుల వివరాల ప్రకారం వెండి బంగారం కంటే తక్కువకు లభిస్తుంది. దీంతో కొందరు పెట్టుబడిదారులు ట్రెండ్‌ను అనుసరించి వెండిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ అంశంపై మరికొన్ని రోజులలో బంగారం, వెండి




ధరల్లో మార్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. డాలర్ ఇండెక్స్, అమెరికా ఉద్యోగ గణాంకాలు,రాజకీయ ఉద్రిక్తతలతో ఇది ప్రభావితమవుతుంది. దేశీయంగా బంగారం రూ.1,61,600- 1,64,000 మద్దతు వద్ద నిలుస్తుందన్న అంచనాలున్నాయి. వెండిధరల్లో కూడా రూ. 3,64,800-3,74,000 మద్దతురావచ్చని అంచనా. ఒక్కరోజులోనే 24 క్యారెట్ల బంగారంధరలు కొన్నిగంటలకే రూ.12వేలు పెరిగింది. కిలో వెండి కూడా ఏకంగా రూ.21 వేలు పెరిగినట్లు అంచనా. ఫ్యూచర్స్‌లోకూడా ఇదే తీరు కొనసాగింది. గ్లోబల్‌స్పాట్‌మార్కెట్లలోకూడా బంగారం వెండిధరలు పెరుగుతున్నాయి.



గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

## ఏప్రిల్ 1నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్

### రాష్ట్ర చేనేత మంత్రి సవిత

**సచివాలయం,జనవరి 29,ప్రభాతవార్త:** నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలక హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందని ఏప్రిల్ 1వ తేది నుండి ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నామని రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.ఏప్రిల్ 1వ తేది నుండి మగ్గాలకు 200యూనిట్లు, మర మగ్గాలకు 500యూనిట్లు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ పథకం అమల్లో భాగంగా ఏడాదికి రూ.85 కోట్ల మేర ప్రభుత్వ ఖజనాపై భారం పడనున్నట్లు తెలిపారు.తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సుప్రీంకోర్టు సిట్ తేల్చిందని,ఆ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి జగన్ బ్యాచ్ బుకాయిస్తుందని మం డిపడ్డారు. అమరావతిలోని >>2

## కేన్సర్ నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

### 'పద్మభూషణ్' నోరి దత్తాత్రేయుడుతో కలిసి ఎపి కేన్సర్ అట్లాస్ విడుదల చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వివిధ రకాల క్యాన్సర్లను నియంత్రించేలా కార్యాచరణ చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశంలో కేన్సర్ వ్యాధిని నోటిఫై చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించిందని అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో కలిసి కాన్సర్ స్క్రీనింగ్ అట్లాస్ ను సీఎం విడుదల చేశారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి రూపొందించిన ఈ అట్లాస్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 2.9కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్



నోరికి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

పరీక్షలు నిర్వహించి నమోదు చేసిన వివరాలతో ఈ అట్లాస్‌ను రూపొందించారు. విజన్ స్టేట్మెంట్ ద్వారా 2030 నాటికి అడ్వాన్స్ క్యాన్సర్ ట్రీట్మెంట్, మిషన్ స్టేట్మెంట్ >>2



## మేడారం.. మహాజనసంద్రం

### గద్దెపైకి చేరిన సమ్మక్క

### అమ్మవార్లను దర్శించిన కేంద్రమంత్రులు జోయల్ ఓరం, కిషన్ రెడ్డి, పలువురు తెలంగాణ మంత్రులు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త:** దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారంలో ఇప్పటికే గద్దెపై సారలమ్మ, గోవిందరాజులు,పగిడిద్దరాజు కొలువుదీరగా గురువారం అర్ధరాత్రి వరాల తల్లి సమ్మక్క ఆగమనం జరిగింది. చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరణి రూపంలో ఉన్న అమ్మవారిని గద్దెపై తీసుకొచ్చి సిద్ధబోయిన వంశీయులు,చందా వంశీయులు ప్రతిష్టించారు.సమ్మక్క రాకతో మేడారం జాతరలో పరిపూర్ణమైన కీలక ఘట్టం పూర్తయింది.భారీ బందోబస్తు మధ్య గద్దెల ప్రాంగణానికి పూజారులు ప్రయాణించారు. రోడ్డుకు ఇరువైపులా లక్షలాది మంది భక్తజనసందోహం.. ఇసుకేస్తే రాలనంత జనంతో.. ఈ ఘట్టం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు.

**మాఘ శుద్ధ పౌర్ణమి వేళ గద్దెపై కొలువుతీరిన సమ్మక్క తల్లి:** రూపమే లేని వనదేవతల కుంభ మేళాలో గురువారం సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్టతో మేడారంలో మహోన్నత ఘట్టానికి వేదుకగా నిలిచింది.కోరిన వరాలు ఇచ్చే వరాల తల్లిసమ్మక్క రాక సందర్భంగా మేడారంలోని ఆమె గుడిని శుద్ధి చేశారు.మామిడి తోరణాలు కట్టారు. ఆవరణ మొత్తం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో నృత్యాలు చేస్తూ రంగు రంగుల ముగ్గులు పెట్టారు.సమ్మక్క రాక సందర్భంగా ముందుగా వనం (వెదురు కర్రలను) గద్దె పై ప్రతిష్టించారు. జాతరలో వనం ( వెదురు) కు విశిష్ఠత ఉంది.వనం అంటే ఆదివాసీ భాషలో అడవి అని అర్థం ఈ వనం నుండి తల్లులు గద్దెల పైకి వస్తారు కాబట్టి ముందుగా ఏపుగా ఎరిగిన వెదురు కర్రలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క గద్దె వద్దకు తీసుకు వచ్చి ప్రతి ష్టించారు. కాకతీయ రాజులను ఎదిరించి నిలిచిన ధీశాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా >>2



## చెవిరెడ్డికి బెయిల్ మంజూరు

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కామ్ కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బెయిల్ మంజూరు అయ్యింది. చెవిరెడ్డితో పాటు సజ్జల శ్రీధర్ >>2



### పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

### నదులు, జలాశయాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

## 8 ప్రాంతాల్లో హౌస్‌బోట్లు

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో టూరిజం శాఖ పర్యాటకుల కోసం రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో త్వరలో హౌస్ బోట్లు అందుబాటులోకి రానున్నాయి. పలు ప్రైవేట్ ఆపరేటర్లు ప్రధాన నదులు, జలాశయాల్లో వీటిని నిర్వహించేందుకు ముందుకొచ్చారు. గతంలో పలుచోట్ల రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హౌస్ బోట్లు ప్రారంభించినా నిర్వహణపరంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిలో కొన్ని బోట్లు మూలకు చేరాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రైవేట్ ఆపరేటర్ల ఆధ్వర్యంలో వీటి నిర్వహణకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. రాష్ట్రంలో 8 చోట్ల సింగిల్, డబుల్ బెడ్‌రూం హౌస్ బోట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. సూర్యలంక, భవానీ ద్వీపం, రాజమహేంద్రవరంలోని >>2




## ఎమ్మెల్యే స్టిక్కర్‌తో రౌడీషీటర్ హల్ చల్

### గంజాయి సేవిస్తూ యాడికిలో నడి రోడ్డుపై హంగామా

### కేసు నమోదు చేసిన పోలీసులు

### ఎమ్మెల్యే గుమ్మనూరు పై అధిష్ఠానం గుర్రు

**అనంతపురం,జనవరి 29,ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్టిక్కర్ తో ఉన్న కారులో ఓ రౌడీ షీటర్ హల్చల్ చేయడం, పోలీసులతో గొడవ పెట్టుకోవడం వివాదాస్పదంగా మారింది. గురువారం జరిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తెలుగుదేశం అధిష్టాన వర్గం సీరియస్ అయింది. వివరాలకు వెళ్తే యాడికి మండలంలో నడి రోడ్డుపై గంజాయి సేవిస్తూ ఓ రౌడీ షీటర్ హంగామ సృష్టించారూ. అతని దురుసు ప్రవర్తనను అడ్డుకోబోయిన ఓ కానిస్టేబుల్ పై సైతం బెదిరింపులకు దిగాడు.దీంతో పోలీసు బృందం రంగ ప్రవేశం చేసి రౌడీ షీటర్ ను అదుపులోకి తీసుకొని అతని వద్ద >>2

30-01Pg2exHNWMJQE 2_30-01Pg2exHNWMJQE.qxd 30/Jan/26 12:17 AM Page 1





గురువారం మేడారంలో సమ్మక్క సారలమ్మను దర్శించిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, ఓరం తదితరులు

# మేడారం.. మహాజనసంద్రం

>> పోరాటం సాగించిన అడవి బిడ్డ శౌర్యపరాక్రమాలకు నిలువెత్తు రూపం అయిన ఆ తల్లి సమ్మక్క ప్రతిరూపంగా భావించే కుంకుమభరిణెను చిలకలగుట్ట నుండి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు తీసుకువచ్చారు. కాకతీయ రాజులతో పోరాడి వీరమరణం పొందినప్పటికీ తన వాళ్లను ఆశీర్వదించేందుకు రెండేళ్లకోమారు జనబాహుళ్యంలోకి వచ్చే సమ్మక్క తన బిడ్డలను చల్లగా దీవించి శుభ ఘడియ ఇదే.. సమ్మక్క ఆగమనం సందర్భంగా తల్లి గౌరవార్థం జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాలిలో మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆదివాసీలు ప్రత్యేక పూజలు, ఆటల పాటలతో స్వాగతం పలికారు అమ్మవారికి మంత్రులు, ఉన్నతాధికారులు కూడా స్వాగతం పలికారు. ఆదివాసీ పూజారులు కొమ్మ బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో గద్దెపై ప్రతిష్ఠించారు. సమక్క తల్లి గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య ఒక్కసారిగా భారీగా పెరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వన దేవతల దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు. ఇప్పటికే గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో నిండుకున్నాయి. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున రావడంతో కిలోమీటర్ల కొద్ది వాహనాలు బారులు తీరాయి.

**పున్నమి నాడు నిండు జాబిలిగా సమ్మక్క తల్లి దర్శనం:** అడవి బిడ్డల అపురూపమైన జాతర .. కొండా కోనా పరవశించే జాతర ... మేడారం మహా జాతర. సారలమ్మ గద్దెలపై కొలువుతీరటంతో ఊపందుకున్న జాతరలో చిలకలగుట్ట నుండి డోలు, కొమ్ము వాయిద్యాల చప్పుళ్ళతో , అధికార యంత్రాంగ హడావిడితో , గాలిలోకి కాల్పులు జరిపి ఆ తల్లికి స్వాగతం పలుకగా సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో గద్దెలపై కొలువు తీరింది.

**పతాక స్థాయికి చేరుకున్న మేడారం మహా జాతర:** సమ్మక్క తల్లి ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరుకుంది. ఆ తల్లి ఆగమనం చూసేందుకు మేడారంలో భక్తజనకోటి ఆత్రుతగా ఎదురు చూశారు. సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గిరిజన పూజారులు ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం గద్దెపైకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. సమ్మక్క కోరి కొలిచిన వారి కొంగు బంగారం ఆ తల్లి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు సమ్మక్క

**వన దేవతలు నామస్మరణతో ప్రతిధ్వనిస్తున్న వనాలు:** శతాబ్దాలుగా తనను నమ్మిన భక్తులకు వరాలిచ్చే తల్లిగా భాసిల్లుతున్న సమ్మక్క ఆశీర్వాదం కోసం భక్తులు బారులు తీరారు. తల్లీ బిడ్డలు ఒకచోట చేరి కనికరించే శుభ ఘడియ కోసం నిరీక్షి ంచిన వారికి సమ్మక్క గద్దెపైకి వచ్చిన ఆ మధుర క్షణాలను మనసులో పదిలపరుచుకున్నారు. వనదేవతల నామస్మరణతో కొండలు, గుట్టలు, వాగులు వంకలు ప్రతిధ్వనించాయి. సమ్మక్క పూజారులు చందా బాబురావు, సిద్ధబోయిన మునిందర్, మహేశ్, లక్ష్మణ్‌రావు, కొక్కెర కృష్ణయ్య ఆధ్వర్యంలో వడ్డెలు నేడు ఉదయం వేకువజామునే మేడారంలోని సమ్మక్క ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అందరూ కలిసి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి కంకవనాన్ని డప్పు చప్పుళ్లతో తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. గద్దెను శుభ్రం చేసి ముగ్గులు వేస్తారు. ఆ తర్వాత వారు చిలకలగుట్టకు వెళ్తారు.

**గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి అధికారుల స్వాగతం:** సమ్మక్క రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సైతం అంతా చిలకలగుట్ట వద్దనే వేచి ఉన్నారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్క పూజారులు కుంకుమ భరిణెను తీసుకొని కిందకు వస్తున్న సమయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తుపాకీ శబ్దాలే సమ్మక్క ఆగమనానికి సంకేతం. ఇక ఆ క్షణం నుంచి ప్రతి ఘడియా అద్భుతంగా తోచింది. దారికి ఇరువైపులా రంగు రంగుల ముగ్గులు వేసి తల్లికి స్వాగతం పలికారు. నిండు పున్నమి వేళ జాబిలమ్మగా సమ్మక్క దర్శనం ఇస్తుంది. ఆ మరుక్షణం నుంచి మొక్కుల చెల్లింపులు ప్రారంభమవుతాయి. తల్లి మనసారా ఇచ్చే ఆశీర్వాదాల కోసం భక్త జనం పోటెత్తుతుంది. వన దేవతలకి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం, టీపిసిసి మహేష్ కుమార్ గౌడ్, సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుజాటోత్ హుస్సేన్ నాయక్, మంత్రి సీతక్క , మంత్రి కొండా సురేఖ, నిరుపమ సుకర్ష, డిజిపి విక్రమ్ సింగ్ మన్, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఇతర శాఖల ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఎదురుకోళ్లు , శివసత్తుల చిందులు, పూనకాలతో మేడారంలో ఆ తల్లిని ఆహ్వానిస్తూ ఆవాహనం చేసుకున్న మనోహరదృశ్యాలు ఎప్పటికీ మదిలో పదిలమే.

# వడివడిగా రోడ్ల విస్తరణ

>> ఉన్నాయని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగుళూరుకడప విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు 2027 కల్లా పూర్తి కావాలని సూచించారు. ఖరగ్‌పూర్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్‌వే కూడా త్వరలోనే డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి అయితే ప్రజలకు తక్షణం ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు కూడా అనుమతులు తీసుకుని వేగంగా పనులు చేపట్టాలని సూచించారు. కేంద్రానికి ఇవ్వాల్సిన ప్రతిపాదనల్ని కూడా తక్షణమే సమర్పించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, రాయపూర్ అమరావతి, మూలపేట పోర్టు జగదల్ పూర్, రాయపూర్‌లను కూడా అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని సీఎం నిర్దేశించారు. **రాష్ట్రంలో రహదారి నెట్వర్క్ విస్తరణ:** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రహదారి నెట్వర్క్ ను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి రహదారులు భవనాల శాఖను ఆదేశించారు. రూ.2500 కోట్లతో 6,054 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామని అధికారులు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ ద్వారా రహదారుల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. డేనిష్ ఫైబర్, వేస్ట్ ప్లాస్టిక్ బిటుమిన్, తిరుపతి ఐఐటీ రూపొందించిన నానో కాంక్రీట్ టెక్నాలజీ ద్వారా ప్రయోగాత్మకంగా రోడ్లను వేస్తున్నామని తెలిపారు. 45 వేల కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారుల్లో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రహదారుల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. రామ్స్ టెక్నాలజీ ద్వారా రోడ్ల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు. పీపీపీ కింద 709 కిలోమీటర్ల మేర 12 రహదారులను కూడా చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పటిష్టంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ (విబీతి)కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్

>> రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మగ్గం కల్గిన 93వేల కుటుంబాలు, మర మగ్గాలు వాడుతున్న 10,534కుటుంబాలు మొత్తం 1,03,534కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకంతో లబ్ది కలుగనుందన్నారు.

**నేతన్నలకు ఆర్థిక భరోసా:** చేనేత రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, ఆర్థిక భరోసా కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే 50ఏళ్ళు నిండిన నేతన్నలకు రూ.4వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఇలా రాష్ట్రంలో 87,280మందికి నేతన్నలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రూ.3వేల నుండి రూ.4వేలకు పెన్షన్లు పెంచడం వల్ల నేతన్నకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12వేలు ఆర్థిక లబ్ది కలుగుతోందన్నారు.

**నేతన్నలకు గౌరవప్రదమైన జీవనమే లక్ష్యం :** నేతన్నలకు 365రోజులు పాటు ఉపాధి కల్పనలో భాగంగా కీలక ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కోఆప్టెక్స్, టాటా తనేరియా, బిర్లా ఆధ్యం సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఆప్కోలో రెడీమేడ్ దుస్తుల అమ్మకాలతో నేతన్నలకు ఉపాధి పెరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ప్రకటించిన ఓడి ఓపి అవార్డుల్లో రాష్ట్రానికి 9అవార్డు లొస్తే, వాటిలో 4చేనేత ఉత్పత్తులకే వచ్చాయన్నారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు గాను జాతీయ స్థాయిలో ఒక బంగారు పతకం లభించిందన్నారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్సీసి సోడియా పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే స్టిక్కర్‌తో రౌడీషీటర్ హల్ చల్

>>నుండి గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గుంతకల్ నియోజకవర్గం గుత్తి పట్టణానికి చెందిన అజయ్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అతని పై గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్, పీడీ యాక్ట్ కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొలెరో జీప్ కి పోలీస్ స్టికర్ వేసుకుని అర్ధరాత్రి లారీ డ్రైవర్స్ ను కొట్టి డబ్బులు వసూలు చేస్తూ పట్టుబడి జైలుకి కూడా వెళ్లాడని తెలియ వచ్చింది.

ఈ నేపథ్యంలో పోలీసులు వివిధ రూపాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకొని కారులో వెళ్తూ హంగామా సృష్టించిన సంఘటన వివాదం కావడంతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఒక వీడియో రిలీజ్ చేస్తూ తన వివరణ తెలియజేశారూ. గుత్తికి చెందిన అజయ్ కు తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. యాడికి లో గంజాయి సేవిస్తూ హంగామ సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే తనకు సంబంధించిన స్టిక్కర్ ను కారుకు అతికించుకొని ఇలా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సహించబోనన్నారు. అక్టోబర్ 2025 నాటికి కాలం చెల్లిన స్టిక్కర్ ను కలర్ జిరాక్స్ చేయించుకుని కారుకు అతికించికున్నట్లు తెలిసిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ఇలాంటి వ్యక్తులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తిపై విచారణ జరిపి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై గత కొంతకాలంగా పలు వివాదాలు, ఆరోపణలు రావడంతో అధిష్టానం ఆయనపై గుర్రు గా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రైల్వే టెండర్ల విషయం లో సొంత పార్టీ ఎంపీ అయిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తో గొడవ, భూ వివాదాలు, పలు ఆరోపణల నేపథ్యంలో టిడిపి అధిష్టానం వాటిపై ఆరాతీస్తున్నట్లు సమాచారం.



గురువారం బారామతిలో అజిత్ పవార్ భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి నారా లోకేష్

# అజిత్ పవార్ అంత్యక్రియలకు లోకేష్

## హాజరైన మంత్రి అనగాని, ఎంపిలు కృష్ణదేవరాయలు, మాగుంట

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. అజిత్ పవార్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ హాజరయ్యారు. మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కీలక నేతలు కూడా హాజరయ్యారు.

## ప్రభుత్వ లాంఛనాలతో అజిత్ అంత్యక్రియలు

**బారామతి, జనవరి 29:** విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయిన మహారాష్ట్ర డిప్యూటి సిఎం అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో ముగిసాయి. ఎన్సీపి సీనియర్ నాయకుడికి విద్యాప్రతిష్టాన్ మైదానంలో పెద్దకుమారుడు పార్థ్‌పవార్ అజిత్ చితికి నిప్పంటించి అంత్యక్రియలు ముగించారు. అంతకుముందు సాయుధ పోలీసులు మూడు పర్యాయాలు గాలిలోకి కాల్పులుజరిపి గౌరవ వందనం చేసారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలాదిమంది కార్యకర్తలు, సీనియర్ నాయకులు పలు పార్టీల నాయకులు మంత్రులు హాజరు అయ్యారు. అజిత్‌దాదా అమర్‌రహే అంటూ మైదానంలో అభిమానుల నినాదాలు మిన్నంటాయి. ఎకచ్‌వాదాఅజిత్ దాదా అంటూ డిప్యూటి సీఎంకు తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు ఉదయం నుంచి కాటేవాడిలోని అజిత్‌నివాసంలో సందర్శకుల కోసం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. రాష్ట్రం నలుమూలలనుంచి ఇతర రాష్ట్రాలనుంచి పలువురు నాయకులు అభిమానులు తమ నాయకుడిని కడసారి చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. మాజీ సీఎం ఉద్ధవ్‌థాకరే, ఎంఎన్ఎస్ చీఫ్ రాజథాకరేలు కుటుంబ సభ్యులను పరామర్శించి భార్య సునేత్రపవార్‌ను ఓదార్చారు. ఎన్సీపీ వృద్ధనేత శరద్‌పవార్‌తోపాటు కేంద్రహోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, గోవా సీఎం ప్రమోద్‌సావంత్ తదితరులు ఉన్నారు. పరిపాలనపై ఎంతో పట్టు ఉన్న నాయకుడుగాను, నిర్మొహమాటంగా మాట్లాడే నేతగాను ఆయనకు ఎంతో పేరుంది. విద్యాప్రిష్టాన్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడిన అంత్యక్రియల జ్వాలల్లో అజిత్ ప్రస్థానం ముగిసిపోగా మరోవైపు పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై చర్చలు ఊపందుకోవడం గమనార్హం.

# చెవిరెడ్డికి బెయిల్ మంజూరు

>> రెడ్డి, వెంకటేష్ నాయుడులకు ఎపి హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇదే కేసులో ఏ1 రాజ్ కేసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. చెవిరెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా విజయవాడ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన తరచు అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఛర్య సంబంధమైన సమస్యలతో పాటు ఆయన అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయన ఈ పరిస్థితుల దృష్ట్యా తనకు బెయిల్ ఇవ్వాలని విజయవాడ ఏసీబీ కోర్టులో పలు పర్యాయాలు బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు. అయితే కోర్టు బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. న్యాయస్థానం ఆదేశాలను అనుసరించి ఆయనకు పోలీసులు మంగళగిరి ఎయిమ్స్ చికిత్స ఇప్పిస్తున్నారు. తాజాగా ఏపీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇక చెవిరెడ్డితో పాటు సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు కూడా బెయిల్ ఇచ్చింది. పాస్ పోర్టులను కోర్టుకు అప్పగించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, విచారణకు సహకరించాలని వీరికి హైకోర్టు షరతులు విధించింది.

# కేన్సర్ నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

>> ద్వారా ముందస్తు స్క్రీనింగ్ టెస్టులతో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను తగ్గించేలా అట్లాస్ ద్వారా కార్యాచరణ చేపట్టనున్నారు. హెల్త్ ఎడ్యుకేషన్, క్యాన్సర్ పట్ల ప్రజల్లో అవగాహన, ప్రివెన్షన్, స్కీనింగ్, ఎర్లీ డిటెక్షన్ వంటివి క్యాన్సర్ కేర్ స్ట్రాటజీలో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పురుషులు, మహిళల నుంచి నమోదు చేసిన సమాచారం ఆధారంగా చికిత్సలు, సర్జికల్, రేడియేషన్, మెడికల్ ట్రీట్మెంట్ వారీగా అట్లాస్ లో వివరాలు పొందుపరిచారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ప్రాంతంలో ఎంతమంది, ఏ రకమైన క్యాన్సర్ రోగులు ఉన్నారో గుర్తించేందుకు, స్థానికంగా చికిత్సలు అందించేందుకు వీలుగా సమాచారం తెలిసేలా ఈ అట్లాస్ కు రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఏపీలో 32,657 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని... ఐసీఎంఆర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి 20 శాతం కేసులు పెరుగుదల ఉంటుందని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వివరించారు. దేశంలోనే తొలి సారిగా ఏపీలో క్యాన్సర్ అట్లాస్ రూపకల్పన జరిగిందని స్పష్టం చేశారు. రోగులను మ్యాపింగ్ చేసి 23 బోధనాసుపత్రులు, జిల్లా ఆస్పత్రుల ద్వారా రోగులకు డే కేర్ కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ చికిత్స అందించే అవకాశం ఉందని అన్నారు. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ అందించేందుకు వివిధ సంస్థలు, ఎన్ఆర్ఐల నుంచి కూడా సహకారం తీసుకోవాలని ముఖ్య మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన పెరిగిందని ముందస్తు పరీక్షలు చేయించుకు నేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు.

## వారం - వర్జ్యం

30-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
ద్వాదశి ఉ.11.10
ఆరుద్ర రా.3.27
వర్జ్యం : మ.2.31-4.00
దు.ఉ.8.57-9.43, 2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

**మిథునం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తుకొనుగోలు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చా గోష్టులలో పాల్గొంటారు.

**సింహం:** బ్యూటీ పార్లర్‌లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**కన్య :** పనులలో ఆటంకాలు ఎదురైనా, అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతూరు. వ్యవసాయాలలో స్వల్ప మార్పులు ఉంటాయి.

**వృశ్చికం:** పారిశ్రామిక, రాజకీయ రంగాల లోని వారికి కొంత వరకు అనుకూల కాలం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** ముద్రణ, ప్రచురణ రంగాల్లోని వారికి అనుకూలంగా వుంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలం.

**మకరం:** అధికారులతో, సహోద్యోగులతో స్నేహభావంతో మెలుగుతారు. ఓర్పును కలిగి వుంటారు.

**కుంభం:** గతంలో మీరు చేసిన కృషి ఇప్పుడు అక్కరకు వస్తుంది. విలాసవంతమైన వస్తువులు కొనుగోలు.

**మీనం:** గ్రూపు రాజకీయాలను తగినంత దూరంగా ఉండటం శ్రేయస్కరం. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపిపై రుణభారం రూ.4.33 లక్షల కోట్లు

## ఈ మొత్తం 2064 వరకు కట్టాల్సిందేనని ఆర్‌బీఐ నివేదిక



**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే అంటున్నారు సంబంధిత నిపుణులు. అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్ల పడుతుందన్నమాట. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3శాతం వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది. ఈ అనుమతులు రెండు విడతలుగా అంటే ముందు అర్థ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా లభిస్తాయి. ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029- 30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6 , ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1 , 510 ఏళ్ల గడువులో చెల్లించేది 27 . 1020 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది.

ఇది కేవలం సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన అప్పులకు సంబంధించింది మాత్రమే. ప్రావిడెంట్ ఫండ్, నాబార్డ్, ఇతర బాండ్లు, విద్యుత్ సంస్థల బకాయిలు, కార్పొరేషన్ల రుణాలు వంటివి కూడా భారంగా పరిణమిస్తున్నాయి. బడ్జెట్‌లో సింహభాగం సెక్యూరిటీ వేలం ద్వారా తీసుకున్న అప్పులు, వాటికి వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే సరిపోతుంది. వీటికితోడు గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఆర్థిక ప్రయోజనాలు సహా గుత్తేదార్ల బిల్లులు భారీగా బకాయిలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత లెక్కల ప్రకారం 2040 నుంచి 2064 మధ్య దాదాపు రూ.లక్ష కోట్ల సెక్యూరిటీ రుణాల భారం మోయాల్సి ఉంటుంది. ఆ 24 ఏళ్లలో రూ.99,293 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ప్రస్తుతం ఈ భారం.. మొత్తం అప్పులో 4.5 గా ఉంది. 2030 వరకూ దాదాపు ఇదే లెక్కన అప్పులు కడుతూ పోవాల్సిందే. ఆ తర్వాత అది ఏటా 5.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

# ఫిబ్రవరి1న విజయవాడలో రాష్ట్ర రెవెన్యూ జెఎసి సమావేశం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్‌ఏ, వీఆర్వో, సర్వేర్లు, రెవిన్యూశాఖ ఉద్యోగులందరూ ఫిబ్రవరి1వ తేదీన విజయవాడ గాంధీనగర్ ఫిల్మ్ చాంబర్లో ఉదయం 10గంటలకు జరిగే సమావేశంలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు. భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రస్తుతం రెవిన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమే అజెండాగా రాష్ట్ర రెవిన్యూజేఏసీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ రాష్ట్ర జేఏసీ లో ప్రతి రెవిన్యూ ఉద్యోగి సభ్యులుగా వుంటారని, జేఏసీలో నాయకులుగా పనిచేయడానికి, వీఆర్ఏల.విఆర్వోలు నుండి, అటెండర్లు నుండి, జూనియర్ అసిస్టెం ట్లు, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తాహసిల్దార్లు, తాహసిల్దార్లు భాగస్వాములు కావాలన్నారు.

# మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా?

## యూజిసి 'సమానత్వ' నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ, జనవరి 29:** కుల వివక్షను రూపుమాపి, ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రం, యుజిసికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారి చేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. స్వాతంత్ర్య వచ్చిన ఇచ్చి దశాబ్దాల తర్వాత కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం? ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా? అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటి వారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండడం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోను అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్యభారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ, సమ్మిళిత వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రతి ఉన్న విద్యాసంస్థల్లోనూ సమానత్వ కమిటీల ఏర్పాటును యుజిసి ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబిసి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిథ్యం కల్పించాలని స్పష్టం చేసింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యుజిసి నిబంధనలు - 2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఓబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

# 8 ప్రాంతాల్లో హౌస్‌బోట్లు

>> సరస్వతీ ఘాట్, పుష్కర ఘాట్, వైఎస్సార్ కడప జిల్లా గండికోట, అనకాపల్లి జిల్లా కొండకాకర్ల సరస్సు, విశాఖపట్నం జిల్లా గంభీరం, అల్లూరి జిల్లా తాజంగి జలాశయాలు వీటిలో ఉన్నాయి. బోట్ల నిర్వహణకు వివిధ ప్రైవేట్ సంస్థలు ఎనిమిది చోట్లా కలిపి రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. విజయవాడలో కృష్ణా నది మధ్యలోని భవానీ ద్వీపంలో హౌస్ బోట్లను సీఎం చంద్రబాబు ఇటీవల ప్రారంభించారు. టికెట్ బుకింగ్ ఇంకా ప్రారంభించాల్సి ఉంది. ద్వీపంలో రెండు హౌస్ బోట్లు, మరో రొమాంటిక్ ఫ్లోట్, డైన్ బోటు సిద్ధం చేశారు. తాజంగి, కొండకాకర్ల సరస్సు, గంభీరం జలాశయంలో బోట్ల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్ల ద్వారా పర్యావరణ, జలవనరుల పరిశీలనకు వెళ్లాయి. త్వరలో అనుమతులు రానున్నాయి. స్వర్ణాల చెరువు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), గార్గేయపురం (కర్నూలు) ఎదుర్లంక (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ)లోనూ బోట్ల నిర్వహణకు తాత్కాలిక అనుమతులివ్వనున్నారు. ఒక్కో బోటులో ఆరుగురికి సరిపడా సదుపాయాలు కల్పిస్తున్నారు. వీటిలో రాత్రులు బస చేయవచ్చు. నది ఒడ్డున జెట్టీ వద్ద వీటిని నిలిపి ఉంచుతారు. బోట్ల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జెట్టీల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయిస్తున్నారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. బోట్లలో ప్రయాణించే పర్యాటకుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. బోట్లు నడిపే ప్రతిచోటా కంట్రోల్ రూం విధిగా ఉండాలని ప్రభుత్వం పర్యాటకశాఖను ఆదేశించింది. రెవెన్యూ, పోలీస్, జలవనరులశాఖ ఉద్యోగులు కంట్రోల్ రూంలో ఉంటారు. బోట్లలో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా? బోట్లు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారో లేదో పరిశీలిస్తారు. నదులు, జలాశయాల్లో వరద ఉధృతి ఉంటే బోట్ల నిర్వహణను నిలిపివేస్తారు.

3RD VJA_30-01Pg3exHMNWJQETC.qxd 30/Jan/26 12:10 AM Page 1



# చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందే

## - రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందేనని ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్‌ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.. సచివాలయంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సోషల్ మీడియా నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మిగిలిన 30 శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్ లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్ పోర్టు వివరాలతో ఈకేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు సూచించింది. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్ ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈగల్ యాప్ ను లీప్ యాప్ కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ (ఎలైట్ యాంటీనార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు మంత్రులకు వివరించారు. ఎన్ కార్డ్ ప్రణాళికతో పూర్తిగా అనుసంధానం చేసినట్లు తెలిపారు.



## ఫిబ్రవరి 17నుండి జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానంకు అనుబంధంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17నుండి 25వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఫిబ్రవరి 10న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8గంటలనుండి 9గంటలవరకు ,రాత్రి 7నుండి 8గంటల వరకు స్వామివారి వాహనసేవలు ఉంటాయి. శ్రీవేంకటేశ్వరునికి జరిపించే తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కోవాహనసేవకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఈ వాహనాలపై పలు రకాల అలంకారాల్లో కొలువుదీరే స్వామివారు తనచెంతకు వచ్చిన భక్తులను కటాక్షించి వారి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల విశ్వాసం. **-'17నుండి బ్రహ్మోత్సవాలు':** తేదీఉదయం రాత్రిఫిబ్రవరి 17 మంగళవారం ధ్వజారోహణం పెద్దశేషవాహనం18బుధవారం చిన్నశేషవాహనంహంస వాహనం 19 గురు వారం సింహవాహనం ముత్యపు పందిరి వాహనం20శుక్రవారం కల్పవృక్షవాహనం సర్వభూ పాలవాహనం 21 శనివారం మోహినీ అవతారం గరుడ వాహనం22 ఆదివారం హనుమంత వాహనం గజ వాహనం 23 సోమవారం సూర్యప్రభవాహనం చంద్రప్రభ వాహనం 24 మంగళవారం రథోత్సవం అశ్వవాహనం 25 బుధవారం చక్రస్నానం ధ్వజావరోహణం కాగా ఫిబ్రవరి 26వతేదీ సాయంత్రం 3గంటలకు పుష్పయాగ మహోత్సవం జరుగుతుంది.

## నేటినుంచి గుంటూరు, కుప్పంలో సిఎం చంద్రబాబు పర్యటన..

### - పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు, కుప్పంలో పర్యటించనున్నారు. శుక్రవారం గుంటూరులో పర్యటించిన అనంతరం మూడు రోజుల కుప్పం పర్యటనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. గుంటూరు, కుప్పంలో చేపట్టే మూడు రోజుల పర్యటనలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. నార్త్ అమెరికాలో స్థిరపడిన గుంటూరు మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థులు గుంటూరు మెడికల్ కాలేజీ అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా - జింకానా పేరుతో ఏర్పాటు చేసుకున్న సంస్థ ద్వారా రూ. 100 కోట్ల విరాళాన్ని భవన నిర్మాణం కోసం అందచేశారు. 2018లో ఈ భవనానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆయనే ఈ మాతా శిశు కేంద్ర భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ మాతా శిశు కేంద్రంలో అవసరమైన మెడికల్ ఎక్విప్మెంట్, ఫర్నిచర్ సహ ఇతర సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 27 కోట్లను కేటాయించింది. ఈ కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం వెళ్లనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా సుమారు రూ. 690 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. శుక్రవారం మధ్యాహ్నం 02:35 గంటలకు కుప్పం చేరుకోనున్న ముఖ్యమంత్రి... తన తొలి రోజు పర్యటనలో భాగంగా రూ. 3 కోట్లతో నిర్మించిన అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రారంభించనున్నారు. అనంతరం రూ. 10 కోట్లతో నిర్మించనున్న ఖిలెర్నర్స్ అకామిడేషన్‌ఖి ఫెసిలిటి సెంటర్... రూ. 2 కోట్లతో చేపట్టే ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కుప్పంలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో లైబ్రరీ, కోవర్కింగ్ స్పేస్, ఆదిత్య బిర్లా మల్టీస్కిల్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఏటా 350 మంది యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చేలా ఈ సెంటర్ తీర్చిదిద్దారు. దీంతో పాటు... పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కాంగుంది హెరిటేజ్ విలేజ్, బౌల్డరింగ్ పార్క్, పున్నమి రిసార్ట్‌లను ప్రారంభించనున్నారు. దీంట్లో భాగంగా కుప్పంలో రూ. 4 కోట్ల విలువైన సీఎస్ఆర్ నిధుల పర్యాటకాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయ నున్నారు. ఇక రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సీఎం వరుస సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బెగ్గులపల్లె పంచాయితీలో వివిధ వర్గాలకు సామాజిక భద్రత పెన్షన్లను స్వయంగా సీఎం పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత 5,555 ఈసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

## మహా పాపం - నిజం పేరుతో తిరుపతిలో టిడిపి నేతల ర్యాలీ




**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం , భారీ కుంభకోణంపై సిట్ నిర్ధారణతో మహా పాపం నిజం.. అది నెయ్యి కాదు! పామాయిల్ కెమికల్ కలిపిన ద్రవం" అనే నినాదంతో గురువారం తిరుపతిలో టిడిపి నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం తిరుపతిలోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుండి గాంధీరోడ్డు మీదుగా నాలుగుకాళ్ళ మండపం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడు, టిడిపి తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సి.దివాకర్ రెడ్డి తిరుపతి పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ .."నెయ్యి సరఫరా చేసిన కంపెనీల ఎంపికలో నిబంధనలు ఉల్లంఘించారని, తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసే క్రమంలో నాణ్యతను విస్మరించారని గుర్తించారన్నారు. కోట్లాది మంది భక్తుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారంపై సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రసాదం తయారీలో వాడే వస్తువుల విషయంలో ఆగమ శాస్త్రం చెప్పిన నియమాలను పాటించకపోవడం వల్లే ఇలాంటి అపచారాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో (20192024) లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యి కాదని, అది జంతువుల కొవ్వు ,రసాయనాలతో కలిపిన "సింథటిక్ ద్రవం" అని సిట్ దర్యాప్తులో నిర్ధారణ అయ్యిందన్నారు. సుమారు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించినట్లు సిట్ తేల్చిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో దాదాపు 20 కోట్ల లడ్డూ ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేసినట్లు గుర్తించారన్నారు. ఈ కల్తీ నెయ్యి సరఫరా ద్వారా వైకాపా పెద్దలు దాదాపు 251 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. అంతకుముందు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించిన తెదేపా నాయకులు, ర్యాలీగా బయలు దేరి నాలుగు కాళ్ళ మండపం వద్దకు చేరుకొని, మానవ హారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, జోన్ 4 మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర కార్యదర్శి దంపూరు భాస్కర్ యాదవ్, గంగమ్మ గుడి ఛైర్మన్ నైనారు మహేశ్‌యాదవ్, కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మానవహారంగా నిరసన వ్యక్తం చేశారు.

## కత్తిపూడి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### వ్యక్తి సజీవ దహనం

**శంఖవరం జనవరి 29 ప్రభాతవార్త** మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు సజీవ దహనం కాగా.. మరోకి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి మూలపేటకు ఆక్వా మేతతో వెళుతున్న ఓ కంటైనర్ రావికంపాడు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా కోల్కతా నుంచి చెన్నై కాటన్ వేస్ట్ బండిల్స్ లోడుతో వస్తున్న మరో కంటైనర్ ఢీకొంది. రెండు కంటైనర్లు కావడం కావడంతో ఢీకొన్న వెంటనే మంటలు చెలరేగి రెండు కంటైనర్ల ముందు భాగాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కాటన్ లారీ డ్రైవర్ కమల్ షేక్(43) సజీవ దహనమయ్యాడు. మరోకి గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## సమాచార శాఖ ఉద్యోగులకు ఉత్తమ సేవకు ప్రతిభ పురస్కారం



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సమాచార శాఖ ఉద్యోగిని గంగా భవాని

ప్రశంసా పత్రాలు అందుకున్న డీఐపీఆర్వో కార్యాలయం అధికారులు, సిబ్బంది

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి :**ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందించిన ఉత్తమ సేవలకుగాను జిల్లా కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. డీపీఆర్వో రమణమూర్తి గురువారం తెలిపిన సమాచారాన్ని అనుస77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలలో సమాచార పౌర సంబంధాధికారి కేవీ. రమణారావు, అదనపు పీఆర్వో కె. రవి, ఏవీ సూపర్వైజర్ వివి. ప్రసాద్, అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ధనుంజయరాజు, టైపిస్ట్ కె. గంగా భవాని లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ మ్రశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉత్తమ సేవ పురస్కారాలందుకున్న వారికి సమాచార శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## తిరుపతి సంగీత కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

### - ప్రధాని మోడీ సమక్షంలో వందేమాతరంగీతంకు ఎంపిక

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జాతీయస్థాయి కార్యక్రమంలో తిరుపతి ఎస్వీసంగీతనృత్యకళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. గాత్రం విభాగంలో డాక్టర్ పి.శైలజ శిష్యురాళ్ళు మూడవసంవత్సరం బిపిఎ ,విశారధ విద్యార్థులు మ్యూజికాలజీ విభాగంకు చెందిన డాక్టర్ ఎం.సురేంద్ర రచించి స్వరపరిచిన జానపదగేయాన్ని సెట్విన్ తరపున పాడారు. జాతీయస్థాయిలో మన్ననలు అందుకుని రాష్ట్రస్థాయిలో బహుమతి పొందారు. ప్రధాని మోదీ వద్ద వందేమాతరం గేయం పాడటానికి ఈ బృందం నుండి కె.చంద్రలేఖ అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల తెలిపారు.



## వైద్య,ఆరోగ్యశాఖకు ఎన్‌హెచ్‌ఎం ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులు విడుదల

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం ) ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను చివరి విడత బడ్జెట్ కింద ఈ నిధులను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్ గురువారం జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడుదలైన నిధులను నిర్ణీత గడువులోగా అంటే వచ్చే నెల (ఫిబ్రవరి) 20వ తేదీ నాటికి ఖర్చు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖర్చు చేసిన వివరాలను వెంటనే నివేదికల రూపంలో సమర్పించాలని కోరారు.

ఈ విడత నిధుల్లో కొన్ని జిల్లాలకు ప్రాధాన్యత క్రమంలో భారీగా కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 2,061 కోట్లు కేటాయించారు. నెల్లూరు జిల్లాకు రూ.8.60 కోట్లు విడుదలయ్యాయి. కృష్ణా జిల్లాకు రూ. 6.21 కోట్లు కేటాయించారు. మిగిలిన జిల్లాలకు వాటి అవసరాలను బట్టి గరిష్టంగా రూ. 5.20 కోట్ల నుండి కనిష్టంగా రూ. 2 కోట్ల వరకు నిధులను పంపినట్లు కమిషనర్ తెలిపారు. ఈ నిధులను ఎలా ఖర్చు చేయాలనే దానిపై కమిషనర్ వీరపాండియన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి పైసా ఖర్చు చేయాలని సూచించారు. నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పారదర్శకత పాటించాలని హెచ్చరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (శిబిది) బలోపేతం, మందుల కొనుగోలు, కుటుంబ సంక్షేమ పథకాల అమలుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున, ఈ నిధులను సకాలంలో ఖర్చు చేయడం ద్వారా వచ్చే ఏడాదికి మరిన్ని నిధులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

### - స్వామివారి సేవలో ఇండోనేషియా రాజు జోకోవిడోడో



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఇండోనేషియా రాజు జోకోవిడోడో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో ఆనందం కలిగిందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వామివారిసేవలో పాల్గోనడం జన్మధన్యమైందన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఇండోనేషియా రాజు జోకోవిడోడో ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయంగా దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం గూగుల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తోట,ప్రభుత్వ విఫ్ గణబాబు,ఢిల్లీ ఎన్‌ఫోర్స్ మెంట్ అదనపు డైరెక్టర్ బి.నవీన్‌కుమార్, సీనీనటుడు క్రాంతి, బిగ్‌బాస్ కంటెస్టెంట్ అమర్‌దీప్, తేజ,మహేశ్‌విట్ట, హైదరాబాద్ అంబర్‌పేట శంకరన్న కుటుంబంతో కలసి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆలయం చెంత కొత్త దంపతులు అపచార పనులు!

### - ఫోటోషూట్ పేరుతో నిబంధనలు ఉల్లంఘన

**తిరుమల, జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఓ నూతన జంట అత్యుత్సాహంతో ఏకంగా దేవుని ఆలయం ముందు అపచారపనులు చేశారు. ఆలయం ముందు గురువారం ఉదయం ఆ జంట ఫోటోషూట్ పేరుతో ముద్దులు పెట్టుకుంటూ...ఒకరినొకరు మనుషులు తగులుతూ కొత్త జంట చేసిన నీచపుపనులను భక్తులు తప్పుపడతున్నారు. ఫోటోషూట్ పేరుతో చేసిన ఈ అపచారంపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. తిరుమల ఆలయ పవిత్రతను, పుణ్యక్షేత్రం విలువలను కాపాడేలా టిటిడి తిరుమలలో కఠిన నిబంధనలు అమలుచేస్తోంది. ఆలయం ముందు రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా కఠినచర్యలు తీసుకుంది. అదేగాక తిరుమలలో గోవింద నామం తప్ప మరెలాంటి పదం వినిపించరాదని ప్రభుత్వం ఆదేశించింది. డ్రోన్‌లు ఎగురవేయడం, ఫోటోషూట్‌లు వంటివి సహజంగా చేసేస్తున్నారు. అలాంటిది గురువారం ఉదయం ఆలయం ముందు కొత్తజంట నుదుటిపై ముద్దులు పెట్టుకుంటూ గొల్లమండపం నుండి అఖిలాండం వరకు ఫోటోషూట్ చేయడం వివాదంగా మారింది. ఈ వీడియోపై నెటిజన్లు, భక్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. తిరుమల ఆద్యాత్మిక ప్రాంతమని, పర్యాటకప్రాంతం కాదని, దేవదేవుని చెంత భక్తితో పవిత్రంగా ఉండాలని భక్తులు చెబుతున్నారు. ఆలయం నిబంధనలకు విరుద్ధంగా సాంప్రదాయాలను ఉల్లంఘించి చేసిన ఈ వికృత చేష్టలపై తిరుమల పోలీసులు సీరియస్ అయ్యారు.

## ఎపి సచివాలయం సిబ్బందిపై ఒడిశా పోలీస్ జులుం

### - రేషన్ కార్డుల సర్వే బృందాన్ని అడ్డుకున్న పోలీసులు



**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 29 ప్రభాతవార్త :** వివాదాస్పద కోటియా గ్రూప్ గ్రామమైన గంజాయి భద్ర ఆంధ్ర సచివాలయ సిబ్బందిపై గురువారం ఉదయం ఒడిశా పోలీసులు దౌర్జన్యం చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువసెంబిలో విధులలో భాగంగా సచివాలయ సిబ్బంది అక్కడ ఉన్న గిరిజనుల రేషన్ కార్డులు సర్వే నిమిత్తం వెళ్లారు. దీంతో ఒడిశా పోలీసులు అక్కడికి చేరుకుని వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ మేరకు అక్కడ ఉన్న గిరిజనులు ఒడిశా పోలీసులపై తిరగబడి నిలదీయగా వెనక్కి తగ్గి వెళ్లిపోయారని సమాచారం. అలాగే ఆంధ్ర అధికారులు, ఉద్యోగులుపై ఒడిశా అధికారులు, పోలీసులు చేస్తున్న దౌర్జన్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఈ సందర్భంగా అక్కడ గిరిజనులు కోరారు.

## భక్తుల నిరీక్షణ లేకుండా.. మూడోఅన్నప్రసాద భవనం ప్రతిపాదనలు కార్యరూపందాల్చేదెప్పుడో?

### - వెంగమాంబ భవనంలో నిరీక్షణ లేకుండా ప్రత్యామ్నాయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా తిరుమల తిరుపతి దేవస్థానంఅన్నప్రసాదాలు అందిస్తోంది. రోజువారీగా 1.60లక్షలమంది నుండి 2లక్షలమందివరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. భక్తుల రద్దీ తో ఇప్పుడు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక పిఎసి 4,5లో అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఇప్పటికీ వెంగమాంబ భవనంలో మధ్యాహ్నం వేళ భక్తులు నిరీక్షణ సమయం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మూడో అన్నప్రసాద భవనం కోసం టిటిడి అధికారులు వెదుకులాట ప్రారంభించారు. ఈ భవనాన్ని భక్తులకు సౌకర్యంగా, రద్దీవుండే ప్రాంతంలో ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. ఏకధాటిగా ఇటీవల రథసప్తమి పర్వదినాన 9లక్షలమందికి భక్తులుపైగా 14రకాల అన్నప్రసాదాలు స్వీకరించడం రికార్డునమోదైంది. మరీ రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న వేళ మరో అన్నప్రసాద భవనం ఏర్పాటుపై భక్తులకు సౌలభ్యంగా ప్రాంతాన్ని ఎంపికచేయాలని టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని, మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు.

## ఎపిపిఎస్సీ గ్రూప్2 ఎంపిక జాబితా విడుదల - రెండేళ్ల నిరీక్షణకు తెర

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్2 అభ్యర్థుల రెండేళ్ల నిరీక్షణ ముగిసింది. అర్ధరాత్రి గ్రూప్2 తుది ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ఆనందానికి అవధుల్లేవు. 2023వ సంవత్సరంలో 905 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. నాటి నుంచి ఎంపిక జాబితా విడుదలకు దాదాపు 25 నెలలకు పైగా సమయం పట్టింది. కోర్టు కేసులతో ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి కొంతకాలం, స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో కేసుల కారణంగా మరికొంత కాలం ఈ నోటిఫికేషన్ లో జాప్యం జరిగింది. క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలనకు శాప్ మరింత ఎక్కువ సమయం తీసుకుంది. పరీక్షలు పూర్తయినప్పటి నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు ఏపీపీఎస్సీ కార్యాలయం చుట్టూ ఎంతగానో తిరగాల్సి వచ్చింది. 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగా, దానిలో 891 పోస్టులకు మాత్రమే అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ ప్రకటించింది. గతంలో క్రీడా కోటాకు రెండు పోస్టులను రిజర్వు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను ఏపీపీఎస్సీ పక్కన పెట్టింది.

pnb Housing Finance Limited
Ghar Ki Baat
నమోదిత కార్యాలయం : 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22, K.G. మార్గ్, న్యూఢిల్లీ-110001
ఫోన్: 011-23445200. వెబ్‌సైట్: www.pnbhousing.com CIN No.: L65922DL1988PLC033856
కార్యాలయ ప్రాంగణాం యొక్క మార్పుట కొరకు ప్రకటన
ఇది ఎవరికైనా సంబంధించవచ్చు
ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రకటించునది ఏమనగా మేము క్రింది కార్యాలయ ప్రాంగణాలను 06వ మే 2026న లేదా ముందు, మార్చుతున్నాము.
ప్రస్తుత చిరునామా
PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, D-39-3-1, 2వ అంతస్తు, ఆంజనేయులు జ్యూయలర్స్ బిల్డింగ్, MG రోడ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010
చిరునామా (మార్చిన తర్వాత)
PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, నం.40-1-53, MG రోడ్, బెంజ్ సర్కిల్ దగ్గర, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-500010.
సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

మనుషులందరూ వృద్ధులుగా మారతారు.
కానీ మంచివారుగా మారటం అరుదు.

-స్వీడెన్ బర్గ్

# మృత్యుపాశాలుగా మూఢనమ్మకాలు

అన్ని తెలిసిన వారు అమావాస్యనాడు చని పోతే ఏమీ తెలియనివారు ఏకాదశి రోజు చని పోయినట్లుగా ఉంది. ఒకపక్క సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతో అభివృద్ధి చెందుతున్నా మరొక పక్క సైన్స్ విజ్ఞానం రోజురోజుకు పురోగాభివృద్ధివైపు పరుగు లీడుతున్నా, మరొకపక్క మూఢనమ్మకాలు సమాజాన్ని అతలాకుతలం చేస్తుండడం అత్యంత దురదృష్టకరం. అందులోనూ ఏమీ తెలియని అమాయకులు మూఢనమ్మకాలలో మునిగిపోతున్నారంటే కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కానీ అంతోఇంతో చదువుకున్నవారు లోకజ్ఞానం ఉన్నవారు పట్టణాలకు, నగరాలకు చేరువలో నివాసాలు ఉంటున్నవారు సైతం ఈ మూఢనమ్మకాలతో బజారు పాలవుతున్నారు. ఒకరుకాదు ఇద్దరు కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఎన్నోయేళ్లుగా కూడబెట్టుకున్న బంగారం, డబ్బులే కాదు, చివరకు ప్రాణాలుకూడా పోగొట్టుకుంటున్నారు. ఎంతోమంది తమ కుటుంబ సభ్యులను తమ కళ్లముందే భూత వైద్యుల, మంత్రాల పేరుతో పెట్టే చిత్రహింసలనుచూస్తూ మనస్సును చంపుకొని ఏదో ఆశతో ఎదురుచూసి చివరకు కళ్లముందే ప్రాణాలు వదిలిన తర్వాత కానీ వారికి అసలు విషయం బోధపడడం లేదు. కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోతున్నది. ఆ మధ్య నెల్లూరు జిల్లాలోఇరవైరెండేళ్ల యువకుడు మతిస్థిమితం కోల్పోవడంతో దెయ్యం పట్టిందని ప్రచారం చేశారు. దానికి సలహా ఎవరు ఇచ్చారో ఏమోకానీ స్వామిజీ వద్దకు తీసుకువెళ్లారు. దెయ్యం పట్టిన మాట వాస్తవమేనని దాన్ని పూర్తిగా వదిలిస్తామని నమ్మబలికి పసుపు, కుంకుమ వంటివి అన్నీ చల్లి చుట్టు పక్కల వారిని పిలిచి అందరు చూస్తుండగానే నోట్లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు పెట్టారు. కొంతసేపటికి ఆ యువకుడిలో చలనం లేకుండాపోయింది. దీంతో దెయ్యం పోయిందంటూ ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత కొందరు గ్రామపెద్దలు వచ్చి యువకుడు చనిపోయాడని చెప్తేకానీ వారికి అసలు విషయం తెలియదు. భూతవైద్యం పేరుతో నిండుప్రాణం గాలిలో కలిసిపోయింది. అలా ఎన్నో ప్రాణాలు ఈ మూఢనమ్మకాలకు బలైపోతున్నాయి. ఆ మధ్య రాయలసీమలో ఒక జిల్లాలో నరబలి ఇచ్చిన సంఘటన కూడా వెలుగులోకి వచ్చింది. తమ వ్యతిరేకులను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టేందుకు కొందరు చేతబడి, బాణామతి, చిల్లంగి అంటూ అనేక పేర్లతో క్షుద్రపూజలు చేస్తూ భయపెడుతున్నారు. గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించినప్పుడు ఇలాంటి క్షుద్ర పూజలు, జంతుబలులు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు కొందరు చేతబడులు చేయడంవల్లనే తమ కుటుంబాలకు, గ్రామాలకు నష్టం జరుగుతున్నదని అపోహతో ఆరోపణలు చేసి దాడులకు పాల్పడి ప్రాణాలు తీసిన సంఘటనలు కూడా కోకొల్లలు. కొన్నిసార్లు క్షుద్ర పూజలు చేశారనే అనుమానంతో వారి కుటుంబాలను సజీవంగా దగ్ధం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు బంగారం భూమిలో ఉందంటూ క్షుద్రపూజలు చేసి నర బలులు ఇస్తేనిధులు దక్కించుకోవచ్చునన్న భ్రమతోఅన్నం పున్నెం ఎరుగని చిన్న పిల్లలను బలిచ్చిన సంఘటనలు హైదరాబాద్ నగరపరిసరాల్లో గతంలో జరిగాయి. ఉభయ రాష్ట్రాలతోపాటు, బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర పదిహేను రాష్ట్రాల్లో క్షుద్రపూజలు దశాబ్దాల తరబడి వేళ్లూనుకుపోయాయి. దేశవ్యాప్తంగా వీటి కారణంగా గతదశాబ్దకాలంలో రెండు వేల మందికిపైగా హత్యలకు గురైనట్లు సమాచారం. అధిక శాతం మహిళలే బలైపోతున్నారని జాతీయ గణాంకాల శాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి. జార్ఖండ్‌లో చేతబడులు చేశారన్న అనుమానంతో 2013లోనే దాదాపుఅరవైమందికిపైగా చంపారు. ఇక మహారాష్ట్రలోని విదర్భప్రాంతంలో పదకొండు మంది చిన్నారులను బలిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఒక స్వామిజీ ఇచ్చిన సలహా మేరకు ఒక జంట అత్యంత కిరాతకంగా మారి అభంశుభం తెలియని ఐదుగురు పసికందులను పొట్టనపెట్టుకున్నారు. ఆతర్వాత పోలీసు దృష్టికి వెళ్లడంతో వారికి సంకెళ్లు వేయడంతో అవి ఆగిపోయాయి. దేశవ్యాప్తంగా వెలుగుచూడనిపోలీసుల దృష్టికి రాని కేసులెన్నోఉన్నాయి. జరగాల్సిన నష్టం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, కోర్టుల చుట్టూ తిరగలేక కొత్త ఇబ్బం దులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో పోలీసుస్టేషన్ మెట్లెక్కడానికి భయపడుతున్నారు. అన్నిటి కంటే ముఖ్యంగా కొన్నిసందర్భాల్లో ప్రత్యర్థులను మట్టుపెట్టడానికి బాణామతి లాంటి క్షుద్రపూజలు చేశారనిముద్ర వేసి చంపుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. 2022లోనే దేశవ్యాప్తంగా ఎనభై ఐదుకుపైగా బాణామతి హత్యలు జరిగాయి. గత దశాబ్దకాలంలో పదకొండువందల ఎనభైనాలుగు మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ప్రతి సంవత్సరం వెయ్యో రెండువేల మందో హతులవుతున్నట్లు సమాచారం. బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలతో జరిగే దాడులను నిలువరించాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో తీర్మానాన్ని ఆమోదించింది. ఇకదాడుల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మంత్రగాళ్లు, మంత్రగత్తెలంటూ విచక్షణారహితంగా కొట్టి హింసిస్తున్నసంఘటనలు కోకొల్లలు. బీహార్‌లో 1999లోనే బాణామతి కార్యకలాపాల నిరోధక చట్టం వచ్చినా ఆశించిన ఫలితాలు చేకూరడంలేదు. ప్రభుత్వమేకాదు సమాజం, మేధావులు అందరూ ఈ సమస్యపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి.

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలు అన్వేషించాలి.



రాబర్ట్ ఆంథోని

బుద్ధిహీనులూ, మృతులూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోకుండా ఉంటారు.



లోవెల్

# ప్రజావాక్కు



### ఆపద్ధర్మ ఒప్పందం అయినా ఉభయతారకం

**భారత్**, యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం అన్ని విధాలా ఘనం ఉభయ తారకం. మనప్రధాని వర్ణించినట్టుఇది అన్ని ఒప్పందాలకు తల్లిలాంటిదే. అంతకుమించి ఇరువురకు అత్యవసరమైనది. రెండు దశాబ్దాలుగా పడిఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరువైపులా జరిగిన కృషి అభినందనీయం. అమెరికామిత్ర, శత్రు బేధం చూపించకుండా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపుకి లోనైంది. అందుకు భారత్ గానీ యూరోప్ గానీ మినహాయింపు కాదు. ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చెయ్యడం అవసరంగా మారింది. నేడు తుది రూపుతోఖరారైంది. 27దేశాల యూరోప్ సమాఖ్య భారత్ ఎగుమతులకు మంచి మార్కెట్‌నిచూపెడుతోంది. అలాగే మనదేశానికిఅవసరమైనవస్తుసేవల్నిచవకగా అందిస్తుంది.

- డా.డి.వి.జి.శంకర రావు, పార్వతీపురం

### టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మనదేశంలో దాదాపు 30 రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటివిమాన రంగం. పూర్వం బేగంపేట విమానాశ్రయంలో వచ్చేపోయే విమానాలను చూడటానికి పల్లెటూర్లనుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారు టికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మిద్దెమీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్నితక్కువ ధర అంటే 50రూపాయల లోపు ప్రవేశ రుసుమును నిర్ణయంచాలి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కిలోమీటర్ల పొడవున్న సముద్ర తీరాన్ని టూరిజంపేరిట అభివృద్ధి చేస్తే ఆహ్లాదం ప్రజల ఆదాయం ప్రభుత్వానిది అవుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### పదోన్నతులు, నియామకాలు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతులు 30:70 నిష్పత్తి ప్రకారం అంటే ఒక 100 ఉపాధ్యాయ ఖాళీలను (లాంగ్వేజ్ నాన్ లాంగ్వేజ్ తో సంబంధం లేకుండా) 30 శాతం నియామకం, 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. ఇది దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిబంధన. కానీ ప్రస్తుత ప్రభుత్వం నాన్‌లాంగ్వేజ్, ఇంగ్లీష్ పదోన్నతులు, నియామకాలు మాత్రం70:30 నిష్పత్తిలో, తెలుగు, హిందీలలో మాత్రం 30:70నిష్పత్తిలో జరపాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చాలామంది ఎస్జీటీ ఉపాధ్యాయులు సుదీర్ఘ కాలంగా పదోన్నతులులేకుండా పదోన్నతి అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతుల్లో ఎస్జీటీలకు 70 శాతంగానే జరపాలి. దాన్ని తగ్గించి 30 శాతం మాత్రమేపదోన్నతులుకల్పించాలని ప్రభుత్వం చూడటం సమంజసం కాదు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఉన్న పదోన్నత అవకాశాలు తగ్గించడం సరైన విధానం కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### నిధుల కొరత

**వాతావరణ** మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్‌ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమే కాదు, అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. ఈ లక్ష్యసాధనలో నిధుల కొరత సమస్యను అన్ని దేశాలూ కలిసి పరిష్కరించాలి.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

### నిబంధనలను పాటించాలి

**వైద్యుల** ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లోఫార్మాసిస్ట్‌లేడు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హతపొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగాఉండాలి. హెచ్1 రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# నేటి బాలలే రేపటి బానిసలా!

**ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగా చేయకపోవడం వల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటం లేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థం చేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచనపరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి.**

డా.బోరుగడ్డ సుబ్బయ్య

భారతదేశ భవిష్యత్తు నేటిబాలలపై ఆధారపడి ఉన్నదని, నేటిబాలలే రేపటిపౌరులు అంటూ నినాదించి స్వాతంత్ర్యనాంతరం భారతదేశపునర్నిర్మాణానికి స్వాతంత్ర్య సమరయోధులు నాందిపలికారు. అదే క్రమంలో 1947 తరువాత దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు, సమానగౌరవం, సమానవిలువ ఉండేవిధంగా భారతదేశ ప్రజలు భారత రాజ్యాంగాన్ని రచించుకుని దేశనిర్మాణానికి అంకురార్పణచేశారు. కొద్దిమేర అభివృద్ధి సాధించగలిగాము. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితులను పరిశీలిస్తే దేశనిర్మాణం కాస్త విభజన విధ్వంసం కూల్చివేతలవైపుకు మనుషుల మధ్య ద్వేషం పెరుగుతున్నట్లు ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడజిల్లా పిఠాపురం మండలం జడ్పీ పాఠశాలలో 01డిసెంబర్ 2025న ముగ్గురు ఉపాధ్యాయులు అదే పాఠశాలలో చదువుతున్న బాలలను వారి కులాలపేరుతో నీచంగా అవమానకరంగా వేధించటం, ఎస్సీలు, ఎస్టీలు ఏమీ చేయలేరు అంటూ నిరంతరం అవహేళన చేస్తూ విద్యపై ఆసక్తి తగ్గేవిధంగా నిరుత్సాహపరుస్తూ ఆడపిల్లలను చెడ్డపేరుతో వంకరగా పిలుస్తున్నారని ఆ పసిహృదయాలు తల్లడిల్లిపోయి మీడియా ముందుకు వచ్చి చెప్పేవరకు ఆ విషయాలు బయటకురాలేదు అంటే అమాయక పసిపిల్లలను కీచక ఉపాధ్యాయులు ఎప్పటి నుండో మానసికంగా, శారీరకంగా ఏడిపిస్తున్నారని అర్థమవుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్ మండల విద్యాధికారిచే విచారించి నిజనిర్ధారణ అయిన తర్వాత కులవివక్ష చూపిన ఉపాధ్యాయులను సాధారణ బదిలీ చేసి వదిలివేశారు. మరల ఆ పసిహృదయాలు అడుగుతున్నాయి. ఈ విలువలులేని (కీచక) ఉపాధ్యాయులు ఎక్కడకువెళ్లారో అక్కడ కూడా ఎస్సి విద్యార్థులను అవహేళన చేస్తూ అవమానిస్తూ కులవివక్షను చూపుతారుకదా అప్పుడు బదిలీ అనేది ఏరకంగా శిక్షఅవుతుంది అని ప్రశ్నిస్తున్నారు. కుల వివక్షకు అంతంలేదు అన్నట్లుగా ఆప్రశ్నలకు కూడా సమాధానం లేదు. అదే నియోజకవర్గంలో ఏప్రిల్ 2025న మల్లాం గ్రామంలో కులంపేరుతో కొన్ని కుటుంబాలను గ్రామ బహిష్కరించినప్పుడు నిందితులను శిక్షించినట్లయితే ఇది జరిగి ఉండకపోయేది అంటే తప్పు చేసిన వాడిని చట్టప్రకారం శిక్షించకపోతే నిందితులను మరల తప్పుచేయమని ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయని అర్థం చేసుకోవాల్సివస్తుంది. ఈవిషయాలు ప్రజలు అర్థం చేసుకున్న రోజు ప్రజలే తిరుగుబాటు చేసి శిక్షిస్తారు. ఆంధ్రప్రదేశ్లోని శ్రీకాకుళం జిల్లాలో పొందూరులోని ఒక విద్యాలయంలో మహిళాప్రిన్సిపల్ ఒకషెడ్యూల్డ్ తెగకు చెందిన విద్యార్థినిని, వాళ్ళఅమ్మను కులంపేరుతో పదేపదే తిట్టుతూ అవమానపరుస్తూ, కించపరుస్తూ, ఉంటే ఫిర్యాదు చేయటానికి వీలులేదు అని సమగ్రశిక్ష ఏపీసి సైతం బెదిరించటం దేనికి సంకేతం. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలోని మెలియపుట్టి మండలం బండపల్లి బాలికలట్రైబల్ ఆశ్రమం పాఠశాలలోని ఉపాధ్యాయునిగా ఉన్న ఉపాధ్యాయునిరాలు కుర్చీలో కాళ్లుచాపుకొని మొబైల్ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులచే బలవంతంగా కాళ్లకు మసాజ్ చేయించుకుంటుంది.

ఆ ఉపాధ్యాయురాలు ఆ విద్యార్థినీలను ఎలాచూస్తుంది అని ఆలోచిస్తే తన ఇంట్లోపని చేసే పనివారివలె లేదా బానిసల వలె వీరిని ఆమెభావించి వీరిచేత ఆవిధంగాచేస్తుంది. తర్వాత ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీతంపేటవారు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. ఇదే విధంగా మనరాష్ట్రంలో గుంటూరు జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికలచే ప్రిన్సిపల్ క్వాటర్స్‌లో ఉండేఉపాధ్యాయులకు నీళ్ల బకెట్లను బలవంతంగా మోయించటం ఈమధ్యకాలంలో పేపర్లో చూసాం. అమలాపురం దగ్గర ఐ.పోలవరం మండలంలోని ఆరో తరగతి చదివే బాలికకు చాక్లెట్లుఇస్తూ మాయమాటలు చెప్పి ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డఉదాంతం,



అదే విధంగా కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాలలోని విద్యార్థిని తాతనుఅంటూ తీసుకువెళ్లి బాలికపై అత్యాచారం చేయటం, తిరుపతి సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అత్యాచారం చేయటం, సత్యసాయి జిల్లాలో 15 సంవత్సరాల ఎస్సీ బాలికను రెండు సంవత్సరాలుగా 17 మంది అత్యాచారం చేసిన సంఘటన, మొబైల్ దొంగతనం చేసిందని ఆరోపణలు 17సంవత్సరాల ఆదివాసీ బాలికను బట్టలిప్పి దారుణంగా దాడిచేసి వేడికర్రతో కాల్చిన సంఘటనలు ఇవన్నీ కూడా ఆంధ్రప్రదేశ్లోనేజరిగాయి. ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్ పాఠశాలల్లోని బాలబాలికలపై జరిగిన దాడులు ఎన్నో చూస్తూనే ఉన్నాం. హర్యానాలో మంచినీళ్ల కుండలో నీళ్లుతాగాడని ఒకఎస్సీ బాలుడును ఉపాధ్యాయుడు కొట్టిచంపాడు. మధ్యప్రదేశ్లో బాగా చదివే ఒక ఆదివాసీ బాలిక మొదటి బెంచీలో కూర్చున్నదని కొట్టటం, పిల్లలకు ఫలహారాన్ని నేలపై న్యూస్పేపర్లో పెట్టడం. ఈ విధంగా భారతదేశవ్యాప్తంగా బాలబాలి కలను కులంపేరుతో చిత్రహింసలకు గురిచేయటం అమాన వీయం. ఇది దేశానికే ప్రమాదం. దేశంలోకానీ, రాష్ట్రంలోకానీ ఒక ఉపాధ్యాయుడు అవ్వాలంటే ఇంటర్ లేదాడిగ్రీపూర్తి చేసి విద్యాబోధనలో డిప్లమోలేదా బ్యాచిలర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి టీచర్ అర్హతపరీక్ష క్వాలిఫై అయిన తర్వాత డీఎస్సీ రాసిన వారిలో ముందువరుసలో ఉన్నవారిని ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయుడు సమాజానికి మూలస్తంభం వంటి వారు. చాలా హేతుబద్ధతతో, శాస్త్రీయంగా కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, లింగ, భాషభేదాలను అధిగమించి మను షులందరూ సమానమే అనే మానవత్వాన్ని బోధిస్తూ మాన వత్వంగల సమసమాజాన్ని నిర్మిస్తారు. కానీపైన పేర్కొన్న సంఘటనలో ఉన్నదోషులందరూ ఉపాధ్యాయులేననిగ్రహిస్తే సమాజం ఎటుపోతుందనని మనం అర్థంచేసుకోవాలి. సామాజిక సమస్యలపై స్పందించే ఉపాధ్యాయసంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళాసంఘాలు, ప్రజాసంఘాలు సభ్యసమాజం బాధితుల కులాలను బట్టి స్పందించటం కూడా ఇటువంటి నీచులను వెనకేసుకుని రావటమే అవుతుంది. అభంశుభం తెలియని అమాయక పసిపిల్లలపట్ల క్రూరమృగాల వలెప్రవర్తిస్తున్న వీరివలన భారతదేశానికి ఏమీలాభంలేదు సరికదా, స్వాతంత్ర్యపూర్వపు రోజులను గుర్తుచేస్తున్నాయి. ఇది మనిషిమనసులో ఉన్నవిషతుల్యమైన ఆలోచనలు మనిషిని మనిషిగా చూడలేని మనస్తత్వం ఉన్న అశాస్త్రీయమైన మూఢనమ్మకాల సిద్ధాంతాలను నమ్మడంవల్ల మానసికరోగులుగా ప్రవర్తిస్తారు. వీటిని ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలి. మనుషులందరూ సమానమే అనే సోదరభావాన్ని ప్రచారం చేయాలి. సాటి మనిషిని మనిషిగా చూడలేనివాడు మానసిక రోగి అవుతాడు, వాడు మనిషిగా అప్పుడే చనిపోయినట్లు వాడు ఉండవలసినది పిచ్చి ఆసుపత్రిలో అంతేకానీ పాఠశాలల్లో ఉండే అర్హతలేదు. ప్రభుత్వపాఠశాలలో ఎవరైతే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారో వారిపిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి. లేకపోతే ప్రభుత్వపాఠశాలల్లో చదివే నిరుపేద తక్కువ కులాల పిల్లలు బాగా చదువుకుని ప్రైవేటు పాఠశాలలో చదివే ఉపాధ్యాయుల పిల్లలకు పోటీ వస్తారేమోనన్నా సంకుచిత భావంతో ఈపిల్లల పట్లనీచంగానూ, హేయంగాను వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుంది. అదే విధంగా ఈనిరుపేద కులాల పిల్లలు తరతరాలుగా వాళ్ల తల్లిదండ్రులవలె భూస్వాములకు, పెత్తందారులకు బానిసలుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఒక కుట్రపూరితమైన పథకం ప్రకారం చేస్తున్నారేమో అనేవిధంగా భావించాల్సి వస్తుంది. బాలబాలికలపట్ల కుల, మత, ప్రాంత, భాష, లింగ భేదాలతో వివక్షచూపుతూ మానసికంగా శారీరకంగా హింసిస్తున్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించి చట్టప్రకారం శిక్షించి వారి ఆస్తులను ప్రభుత్వం వారు జప్తుచేసుకుని రాష్ట్రంలో కులనిర్మూలన ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో కులనిర్మూలన వైపుకు సమానత్వంవైపుకు బాటలువేయాలి. ఈ రోజుప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగాచేయకపోవడంవల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటంలేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థంచేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచన పరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి. ●

# కోకో గింజలకూ ధరల విధానం అవసరం

కె. శ్రీనివాస్

రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు ఉన్నది. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్ పామ్‌అంతర పంటగా రైతులు కోకో సాగు చేస్తున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్లు ఆశించడం, ఈసంవత్సరం మినహా గత అనేక సంవత్సరాలుగా కొబ్బరికి ధరలేకపోవడం ప్రధానంగా కొబ్బరి రైతులు సంక్షోభం ఎదుర్కోవడంవలన రైతులకు కోకోపంట మీదనే ఆధారపడ్డారు. కోకో అంతరపంట కాస్త ప్రధాన పంటగామారింది. ప్రపంచంలో 20 దేశాలలో కోకో పంట సాగు ఉంటే 20వ దేశంగా భారతదేశం ఉంది. మనదేశంలో కూడా కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోనే కోకో పంట సాగు ఉంది. చాలాకాలంగా కోకో గింజలు ధరలుతక్కువగా ఉండటం వలన గతం కంటే కేరళలో సాగు విస్తీర్ణం తగ్గించుకుని సుగంధ ద్రవ్యాల పంటల వైపు రైతులు మరలారు. మన రాష్ట్రంలో మాత్రం కోకో పంట విస్తీర్ణం రోజు రోజుకి పెరుగుతోంది. మనదేశ అవసరాలకు కావలసిన కోకో గింజలు 20శాతం మాత్రమే దేశంలో ఉత్పత్తి జరుగుతున్నదని, 80శాతం కోకో గింజలు, కోకో పౌడర్, బట్టర్, ఇతర ఉత్పత్తులను దిగుమతులు చేసుకుంటున్నాము. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాలు నామమాత్రంగా ఉండడం వలన విదేశీ కోకో ఉత్పత్తులను దిగుమతులు చేసుకుని దేశీయంగా రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలను చెల్లించడంలేదు. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కోకో రైతులకునష్టం కలిగిస్తున్నాయి. భారత్ యూరోప్ యూనియన్ మధ్య జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా చాక్లెట్ ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా ఎత్తివేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. కోకో ఉత్పత్తులపై నామమాత్రపు దిగుమతి సుంకాలు ఉండడం వలన కంపెనీలు విదేశీ కోకో ఉత్పత్తులను చేసుకొని దేశీయంగా రైతులను నష్టపరుస్తున్నాయి. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాల పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి పోయి జీరో శాతం దిగుమతి సుంకాలకు ఒప్పందాలు చేసుకోవడం వలన కోకో రైతులు మరింతగా నష్టపోయే పరిస్థితి దాపురిస్తుంది. విదేశీ కోకో ఉత్పత్తుల దిగుమతులను నిలుపుదల చేయాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పామాయిల్ పై దిగుమతి సుంకాలు ఎత్తి వేయడంతో దేశీయంగా పామాయిల్ రైతులు నష్టపోయారు. ఎన్నికల అనంతరం దిగుమతి సుంకాలు పెంచడంతో ఆయిల్ పామ్ గెలల ధర పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే వాటి కొనుగోలుకు, మార్కెటింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేయడం అన్యాయం. 30 ఏళ్లకు పైగా నుండి రాష్ట్రంలో కోకో పంట సాగు అవుతుంటే ఇంతవరకు కోకో గింజలకు ధర నిర్ణయం పాలసీ లేకపోవడం మరీ దారుణం. రాష్ట్రంలో పామాయిల్ రైతులు ఆయిల్ పామ్ గెలలకు ధర నిర్ణయ సూత్రాన్ని సాధించుకున్నారు. ఆయిల్ పామ్ గెలలకు క్రషింగ్ ద్వారా వచ్చే ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఇఆర్) ఆధారంగా అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రూపొందించిన ఫార్ములా ప్రకారం ప్రతినెల ధర నిర్ణయం జరుగుతుంది. అదేవిధంగా కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించాలని కోకో రైతాంగం కోరుతున్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడతామని గత సంవత్సరం హామీ ఇచ్చారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం కోకోగింజల ధరల పాలసీ ప్రకటించలేదు. మరలా కంపెనీల ఇష్టారాజ్యంగా మారింది. కోకో గింజలకు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసం చేసిన ఫలితంగా గత ఏడాది రూ.500 కోట్లకు పైగా రాష్ట్ర కోకో రైతులు నష్టపోయారు. 2025 ఫిబ్రవరి నుండి మే వరకు నాలుగు నెలల పాటు సుదీర్ఘ పోరాటాన్ని రాష్ట్రంలో కోకో రైతులు సాగించారు. ఫలితంగా రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని రూ.50ప్రోత్సాహం అందించి కిలో కోకోగింజలకు రూ.500 ధర కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కోకోరైతులకు ప్రోత్సాహం పేరుతో రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. అయితే రైతుల నష్టపోయింది రూ.500 కోట్లు పైనే. ఈ సంవత్సరం జనవరి నుండి కోకో గింజల సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం కిలో కోకో గింజలను కంపెనీలు రూ.350లకు కొనుగోలు ప్రారంభించి రైతుల ఆందోళనలతో రూ.400 లకు పెంచి కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రంలో కోకో విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర కోకో పరిశోధనా ఏర్పాటు అత్యవసరం. ●

# రాజకీయ అవినీతికి అంతం లేదా?



ఎం. నారాయణ స్వామి

మా సహాని కన్నా మరణించడమే మేలనుకునే రోజులు చూశాం! పరువు పోయాక ప్రాణాలతో బతికుండటంకన్నానుయ్యో, గొయ్యో చూసుకుంటే పోలేదా అని అసహ్యించుకొన్న కాలం ఎరుగుదు! కానీ ఇవాళ అవినీతిపైన చాకిరేవు పెట్టటానికి సిగ్గుపడని దౌర్భాగ్యం దాపురించింది. చెడు అంటే భరించలేని రోతతో నేడు స్పందించడం మానేశాం. మరింకా అధ్యయనాలు చేయాలా? ఇంతకన్నా నిర్లజ్జ ఎక్కడుంటుంది? మరి ఇంత బహిరంగ చర్చలతో పాపం ప్రక్షాళనమైపోతుందా? బహిరంగ చర్చ అనగానే ఏది మంచి, ఏది చెడు, ఏది నీతి, ఏది అవినీతి, ఏది అక్రమార్జన, ఏది సక్రమార్జన అంటూ ప్రశ్నోపనిషత్తు వల్లే వేయడమేగా. అవినీతికి ఎందుకు పాల్పడాల్సి వచ్చింది? నీతికి తిలోదకాలు ఎందుకు వదలాల్సి వచ్చింది? అంటూ సాగదీయడం ఫాలో అవుతుంది. విలువలు విలుప్తం కావడానికిదారితీసిన పరిస్థితులపై చర్చ, సదరు పరిస్థితులు ఉత్పన్నమైన కారణాలపై సంవాదం. అందుకు సమాజమా, వ్యక్తులా? ఎవరు బాధ్యులని తర్జన, భర్జనలు. దీనికి ముగింపు ఉండదు. అవినీతి అనండీ, అక్రమార్జన అనండి, పెరగనిచ్చినన్నాళ్లు పెరగనిచ్చాం!. మొక్కయి ఎదిగి వస్తుండగానే నిర్దాక్షిణ్యంగా పంచాల్సిన కర్తవ్యం మర్చిపోయింది సమాజం. మొక్కయి వంగనిది మానైవంగుతుందా? వంగలేదు. రాజకీయాలు పుచ్చిపోయాయి. 'అవినీతి వృక్షానికి తల్లివేరు రాజకీయం' అంటారు ప్రముఖులు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకున్నాం. ప్రజాస్వామ్యానికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎన్నికలు. ఎంత ఖర్చు పెట్టి అయినా గెలవటమే ఎన్నికల ధ్యేయం. ఖర్చు పెట్టడానికి డబ్బెక్కడనుండి వస్తుంది? అనంతకోటి మార్గాలున్న సంగతి అందరికీ తెలిసిందే. వెనక్కి తిరిగి చూడకుండా డబ్బు వెద జల్లుతూ పోవాలంటే ఏ రంగాన్ని వదలకుండా ఎడాపెడా పిండి దండుకోవాలి. కబ్జాలు, కుంభకోణాలు, లంచాలు, అధికార దుర్వినియోగం, అధికార పరమపద సోపానం స్వాయత్తం చేసుకోవటానికి ఎన్ని నిచ్చెనలుంటే అన్నిటి మీదుగా ఎగబాకాలి. ప్రాజెక్టులు తగలబడిపోయినా సరే టెండర్ల దశలోనే చిచ్చు రాజేయాలి! కాంట్రాక్టర్లతో కరచాలనాలు చేయాలి. రాజకీయాలు, అధికారులు, కాంట్రాక్టర్లు ముప్పేట గొలుసుగా పెనవడాలి. కమిషన్లు అందినంత బొక్కాలి. ఊళ్లకు ఊళ్లు పంచుకోవటానికి దొరల



వేషం కట్టిన దొంగలు సంఘటితమవ్వాలి. సంక్షేమం పేరిట ప్రవహించే నిధుల్నీ స్వాహా చేయాలి. కాగితం మీదలెక్కలు బొక్కలు కానరావు, లక్షలు, కోట్లు ఖర్చవుతున్నాయి. లక్ష్యాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే, కాకుల లెక్కలకు కొదవలేదు! పైవాళ్లంతా అంటే మంత్రులు, రాజకీయనాయకులు మూడక్షరాల హోదా, బిరుదులు తగిలించుకొన్న బ్యూరోక్రాట్లు తెగబడి తినేస్తోంటే పదికి పరక్కి కక్కుర్తిపడేమూడో, నాలుగో తరగతి సిబ్బందంటే అందరికీ ఎందుకింత అక్కసు అని ఎన్జీవో సంఘాల నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. తాము పీక్కుతింటున్నవాళ్లు తమకనా బక్కవాళ్లే అన్న సంగతి వారికి జ్ఞాపకం రాదు. 'ఉద్యోగులపై చిన్న ఆరోపణ వచ్చినా సరే తక్షణమే సస్పెండ్ చేయడమో, మరొకరమైన చర్య తీసుకొంటున్నారు. అదే గనుక మంత్రులపై అభియోగాలు వస్తే ఏ విధమైన చర్యలు ఉండటం లేదు. అన్నిశాఖలలో నియామకాలు, ప్రమో షన్లు, బదిలీలలో మంత్రులు తలదూర్చి అవినీతికి పాల్పడుతున్నారు. వారికి సంబంధించిన వారికి మేలు చేసి లక్షలు మింగేస్తున్నారు. నీతినిజాయితీ అధికారులు, సిబ్బందికి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. తెలుగు రాష్ట్రాలలోని నీటిపారుదల శాఖకు సంబంధించిన కీలకపదవుల్లో ఉన్న వారికి ఆ శాఖకు సంబంధించిన కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులు టెండర్లు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ల దగ్గర నుండి కోట్లాది రూపాయలను వసూలు చేసి ముట్ట చెప్తున్న ఆరోపణలు వస్తున్నా దర్యాప్తులు లేవు, చర్యలు లేవు. బహిరంగంగా జరుగుతున్న ఈ అవినీతి తతంగం గురించి తెలిసి కూడా ఆయా మంత్రులపైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటే జవాబు లేదు, దొరకదు! అదేవిధంగా పోలీసు శాఖ మంత్రులే కాకుండా, సంబంధిత మంత్రులు, నియోజక వర్గం శాసనసభ్యులకు తెలియకుండా పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించే సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ డివిజన్ డిఎసీపీల బదిలీలను జిల్లా, రేంజి రాష్ట్ర ఉన్నతాధికారులు చేయలేకపోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు శాసనసభ్యులకు లక్షల రూపాయలను ముట్టచెప్పిన సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, డిఎస్పీలకు వారు కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. లేదంటే దబిడి. ఇక రెవిన్యూతో పాటు ఇతర శాఖలపై మంత్రుల పెత్తనాలతో పాటు అవినీతి తారాస్థాయికి చేరుకుంటున్నా శిక్షించే నాథుడే లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాల కు మరింత పదును పెట్టి నీతి నిజాయితీ వీటన్నిటిని మించిన సమర్థత కలిగిన అధికారులను నియమించి, ముఖ్యంగా అవినీతి నిరోధక శాఖలో మితిమీరిపోతున్న రాజకీయ జోక్యానికి ఫుల్స్టాప్ పెట్టకపోతే. పాలకుల మాటలు, చట్టాలు అన్నీ నిరర్థకమే. ●

# మహాత్మాగాంధీ నేషనల్ సర్వీస్ అవార్డు
## బాధ్యతను పెంచింది : ఎస్ఎం ఫైజాన్

**ఎ కొండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** విజయవాడ భవానీపురంలోని సూఫీ సేవా సదన్ ట్రస్ట్ చైర్మన్ సోషల్ వర్కర్ టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ తెదేపా పరిశీలకుడు ఎస్ఎం ఫైజాన్‌కు




మహాత్మాగాంధీ నేషనల్ సర్వీస్ అవార్డు 2026కు ఎంపికైనట్లు ఎ కొండూరు మండలంలో గురువారం ఫైజాన్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఫైజాన్ మాట్లాడుతూ సూఫీ సేవా సదన్ ట్రస్ట్ ద్వారా గత ఎన్నో ఏళ్ళుగా సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అలాగే పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారికి అన్నదానం వస్త్రదానం వృద్ధులకు వితంతువులకు పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం లాంటి సేవా కార్యక్రమాలు, తుఫాన్ వరద ముంపుల సమయంలో నిరాశ్రితులకు ఆశ్రమం బాధితులకు ఆహారం మంచినీరు పాలు ఇంకా ఇతర నిత్యవసరాలు అందించడం లాంటి సంఘ సేవా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ద్వారా సేవామార్గం ద్వారా అభాగ్యులను ఆదుకోవడం ద్వారా పేద ప్రజల జీవితాల్లో ఒక భరోసా నింపుతూ ముందుకు సాగుతున్నామని ఫైజాన్ తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ పేదల జీవితాల్లో వెలుగు నింపుతామని ఫైజాన్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ నేషనల్ సర్వీస్ అవార్డుకు ఎంపిక కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈ అవార్డు తనకు మరింత సామాజిక బాధ్యతను పెంచిందని ఈ అవార్డు ప్రధానం చేసిన మహాత్మాగాంధీ నేషనల్ సర్వీస్ 2026 వారికి ఫైజాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఫైజాన్ అవార్డు ప్రకటించడం ప్రధానం పట్ల యజ్దాని, సూఫీ సేవా సదన్ నిర్వాహకులు సల్మాన్, లుక్మాన్, జావీద్, నోమాన్, గుఫ్రాన్ ఏజాజ్ తదితరులు అభినందించారు.

## మహిళల భద్రత, పరిరక్షణలో శక్తి యాప్ పై అవగాహన

**తిరువూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని రాజుపేట ఎస్సీ హాస్టల్‌లోని కళాశాల విద్యార్థినులకు తిరువూరు ఏఎస్సై లక్ష్మీ, మహిళ కానిస్టేబుల్ శిరీష ఆధ్వర్యంలో మహిళల భద్రత, పరి రక్షణలో భాగంగా శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ సంపూర్ణ పాల్గొన్నారు.



## పౌష్టికాహార పదార్థాలను ప్రధానోపాధ్యాయునికి అందజేస్తున్న హాస్పిటల్ డైరెక్టర్ ఆకుల దుర్గా ప్రసాద్

**తిరువూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టౌన్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకుఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తిరువూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ ఆకుల దుర్గా ప్రసాద్ రెండు నెలలు పాటు పౌష్టికాహార పదార్థాలను ప్రధానోపాధ్యాయుడుకి అందజేశారు. కార్యక్రమంలో భూమా సురేష్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా ఆంధ్రప్రదేశ్లో కీలక కేసుల్లో నైపుణ్యంతో విజయాలు సాధించారు

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** రాజ్యాంగ, క్రిమినల్, కమర్షియల్ చట్టాలలో నైపుణ్యం కలిగిన సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, ఆంధ్రప్రదేశ్లో హైప్రొఫైల్ వివాదాల్లో అపూర్వమైన న్యాయ ప్రయోజనాలను అందిస్తున్నారు. ఆయన వ్యూహాత్మక జోక్యాలు కేసుల ముగింపులు, తీర్పుల్లో మరియు బలమైన రక్షణలు సాధించాయి. రాష్ట్ర ప్రభుత్వాల తరఫున సంస్థలను ప్రాతినిధ్యం వహించిన దశాబ్దాల అనుభవాన్ని ఆధారంగా చేసుకుని ఈ విజయాలను సాధించారు. ప్రస్తుతం కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర (ముంబై బ్లాస్ట్స్)లో చురుకుగా ఉన్న లూథ్రా పంజాబ్, రాజస్థాన్ పశ్చిమ బెంగాల్లోని ప్రముఖ కేసుల్లో గత విజయాలను మరింతగా విస్తరించారు.

## ఎల్ వీపీఈఐలో ఐ ట్రామా వర్క్‌షాప్

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** విద్య, శిక్షణ, కంటి సంరక్షణలో భాగంగా ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో ఐ ట్రామా వర్క్‌షాప్ ను నిర్వహించారు. విజయవాడలోని కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లో జరిగిన ఈ సమగ్ర కంటి ట్రామా వర్క్‌షాప్‌కి జర్మనీలోని హాలీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఆర్నే విస్టింగ్, సింగపూర్‌లోని నేషనల్ హెల్త్‌కేర్ గ్రూప్ ఐ ఇన్స్టిట్యూట్ నుండి డాక్టర్ రూపేష్ అగర్వాల్, యూఎస్ఏ విల్మర్ ఐ ఇన్స్టిట్యూట్ డాక్టర్ ఫాసికా ఎ వోరెటా హాజరై ప్రసంగించారు. దృష్టికి హాని కలిగించే జాప్యాలను తగ్గించడానికి వర్క్‌షాప్ నిర్వహించామని నిర్వాహకులు చెప్పారు.



## భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు

**గుంటూరు కల్చరల్,జనవరి 29,ప్రభాతవార్త :** స్థానిక ఆర్ అగ్రహారంలోని శ్రీ రామనామ క్షేత్రం ట్రస్టీ రాగం వెంకట లీలాసుందరి,మస్తానారావు దంపతుల ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు నిర్వహణలో లక్ష్మణ సహిత శ్రీసీతారామచంద్రులకు పంచామృతాలతో అభిషేకం,తిరుమంజన సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.విశేషంగా పాల్గొన్న సువాసినులచే విష్ణు సహస్ర నామ పారాయణంతో పాటు భక్తుల హరేరామ,హరేకృష్ణ సంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభతో మునిగిపోయింది.గీతామందిరం లో భగవద్ గీతా పారాయణ విశిష్ట పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లీలాసుందరి మాట్లాడుతూ 2026శ్రీరామనామక్షేత్ర శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటామని ఇందులోభాగంగా శ్రీ రామనామ సంకీర్తన,శ్రీరామకోటి రాయడం,నామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

## ఘనంగా తెదేపా రాష్ట్ర మైనార్టీ నేత ఎస్ఎం ఫైజాన్ జన్మదిన వేడుకలు

**ఎ కొండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** విజయవాడ గొల్లపూడి రూరల్‌లోని సూఫీ సేవాసదన్, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ట్రస్ట్ చైర్మన్ తిరువూరు టౌన్ టిడిపి పరిశీలకుడు ఎస్ఎం ఫైజాన్ జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తల మధ్య గురువారం ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైజాన్ టిడిపి రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఇంకా ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు అబిద్ హుస్సేన్, ఎండి రహిమాన్, ఎండి ఖలీల్, ఎండి అఫ్సర్, ఎండి మాబూద్, ఎండి ఫర్హాన్, ఎండి ముజాహిద్, ఎస్‌కె బాషా, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి ఫైజాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా సూఫీ సేవా సదన్ నిర్వాహకులు ఎస్ఎం సల్మాన్ పాల్గొన్నారు.

## మాంట్రా ఎలక్ట్రిక్ నుంచి మొట్టమొదటి పిఎం ఈడ్రైవ్ సర్టిఫైడ్ ఎలక్ట్రిక్ ట్రక్

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** మురుగప్ప గ్రూప్‌లో భాగమైన మాంట్రా ఎలక్ట్రిక్, భారత ప్రభుత్వ పిఎం ఈడ్రైవ్ పథకం సర్టిఫికేట్ పొంది దేశంలో మొదటి హెవీడ్యూటీ ఎలక్ట్రిక్ ట్రక్ తయారీదారుగా నిలిచామని మాంట్రా ఎలక్ట్రిక్ (టిఐ క్లీన్ మొబిలిటీ) చైర్మన్ అరుణ్ మురుగప్పన్ తెలిపారు. రైనో 5538 ఈవీ ట్రాక్టర్ ట్రైలర్‌ను, సిమెంట్, రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ ఎండి




జలజ్ గుప్తా, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ చీఫ్ ప్రొక్యూర్మెంట్ ఆఫీసర్ సత్య రాజ్‌కు అందించారు.

# విజయవాడ వార్త

## డ్రగ్స్ రహిత సమాజం కోసం సైకిల్‌యాత్ర

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 29,ప్రభాతవార్త:** సిపి రాజశేఖరబాబు,జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 35 రోజుల పాటు డ్రగ్స్ రహిత సమాజం కోసం ముందడుగు వేస్తూ డ్రగ్స్‌పై దండయాత్ర అనే నినాదంతో 510 కిలోమీటర్ల సైకిల్‌యాత్రలో మూడవ రోజు పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో సైకిల్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఈ ర్యాలీలో ఆదిత్య కళాశాల విద్యార్థినీ విద్యార్థులు,జిడిటి స్కూల్ విద్యార్థులు పాల్గొన్న వారిపై పూలు



జల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. వారితో పాటు మేము కూడ 'సే నో టు డ్రగ్స్'అంటూ 30 మంది జిడిటి స్కూలు విద్యార్థులు సైకిలు తొక్కుతూ సైకిల్ యాత్రలో పాల్గొన్నారు.ఈ సైకిల్ యాత్రలో ఆదిత్య డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులకు అవగాహన కల్పించిన అనంతరం దర్శిపేట వద్ద ఎంఎల్ఏ గద్దె రామ్మోహన్ పాల్గొని ఈ ర్యాలీని సపోర్టు చేస్తూ సైకిల్ తొక్కారు. దర్శిపేట మీదుగా ఎన్ఎస్ఎం స్కూలుకు చేరుకుని అక్కడ విద్యార్థులకు నా జీవితం విలువైంది,నేను డ్రగ్స్‌కు నో చెబుతాను'డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈ యాత్ర పడవల రేవు వరకు సాగింది.ఈ కార్యక్రమంలో డిసిపి కృష్ణకాంత్ పటేల్,ఏడిసిపి మురళీకృష్ణ, ఏసిపి దామోదర్,పటమట సిఐ పవన్‌కిషోర్,టాస్క్‌ఫోర్సు టీం,ఈగల్ టీం,300 మంది ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు,జిఓటి స్కూలు విద్యార్థులు

## అజిత్ పవార్ అంత్యక్రియలకు హాజరైన మంత్రి నారా లోకేష్

**మంగళగిరి, జనవరి 29, ప్రభాతవార్త:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఉన్నారు.



## ఏఎన్‌యు పీజీ 1వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి29,ప్రభాతవార్త:** ఏఎన్‌యు పరిధిలో పీజీ సైన్స్, ఆర్ట్స్, ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు సిఇ ఆలపాటి శివప్రసాదరావు పేర్కొన్నారు. ఫిబ్రవరి 10 నుంచి జరగాల్సిన పరీక్షలు వాయిదా వేసి కొత్త షెడ్యూల్ ఇచ్చినట్లు వివరించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి జరుగుతాయని సూచించారు.

## భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు

**గంపలగూడెం, జనవరి 29, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి లక్ష తులసి పూజ, ఏకనామ పారాయణం చేశారు. గన్నవరం దేవాలయం తనిఖీ అధికారి కే అనురాధ, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## అపరిచిత వ్యక్తుల పట్ల బహుపరాక్

### - తాళం వేసి ఇళ్లే టార్గెట్‌గా ఒరిస్సా చత్తీస్‌గఢ్ యువకులు

**ఎ కొండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ (విజయవాడ) ఎస్వి రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఇటీవల కాలంలో ఒరిస్సా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి 25, 30 సంవత్సరాల వయస్సు కలిగిన అపరిచిత యువకులు ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న వ్యక్తుల వలే బియ్యం కావాలనే నెపంతో పగలు ఉదయం పూట గ్రామాల్లోకి వచ్చి తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడు తున్నట్లు సమాచారం ఉందని తిరువూరు సర్కిల్ పరిధిలోని ఎ కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్ముడు తెలిపారు. ఒరిస్సా చత్తీస్‌ఘడ్‌కు చెందిన వ్యక్తులు నడుచుకుంటూ వచ్చి అందనూ చూస్తుండగానే వీధుల్లో తిరుగుతూ తాళం వేసి ఇళ్లను టార్గెట్ చేస్తున్నారని ఎవరైనా అలాంటి వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే ఎ కొండూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం



అందించాలని అటువంటి అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసుకుని బైటకు వెళ్లే సమయాల్లో పొరుగింటి వారికి గమనిస్తుండమని చెప్పాలని సదరు సమాచారం పోలీస్‌స్టేషన్‌కు తెలియపర్చాలని అపరిచిత అనుమానస్పద వ్యక్తులు సంచరించినపుడు కొట్టడం గాయపర్చడం చేయరాదని వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందచేయాలని ఎస్సై గంధం మహాలక్ష్ముడు మండల ప్రాంత ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తెదేపా మండల ఎస్టీసెల్ అధ్యక్షునిగా గుగులోతు చందు నాయక్

**ఎ కొండూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు కుమ్మరికుంట్ల తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు గుగులోతు చందు నాయక్ ఎ కొండూరు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన విజయవాడ పార్లమెంట్ టిడిపి



అధికార ప్రతినిధి, తిరువూరు ఎఎంసి మాజీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డికి గుగులోతు చందునాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా వీరమ్మ తిరునాళ్ళ మహోత్సవం

**కంకిపాడు జనవరి29,ప్రభాతవార్త :** ఉయ్యూరు శ్రీపారుపూడి కనకచింతయ్య వీరమ్మతల్లి తిరునాళ్ళు ఘనంగా ప్రారంభ మయ్యాయి.ఉయ్యూరులో ఘనంగా ప్రారంభమైన వీరమ్మతల్లి తిరునాళ్ళు.ఉయ్యూరుటౌన్ పోలీస్‌స్టేషన్ నుండి ఆనవాయితీగా వస్తున్న సారె సమర్పించడం తొలిసారి దళితదంపతులు తొలిసారిగా సమర్పించడం చరిత్రలో ప్రథమం. కులమతాలకు అతీతంగా వీరమ్మతల్లికి వేలాదిగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మెట్టినింటి నుండి అమ్మవారి విగ్రహాన్ని మంత్రి పార్థసారథి చేతులమీదుగా బయటకు తీసుకురావడంతో తిరునాళ్ళ మహోత్సవం ప్రారంభమైంది.తిరునాళ్ళ ఉత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఉయ్యూరు పురవీధుల వెంబడి భక్తులకు దర్శనమిస్తూ అమ్మవారు పుట్టింటికి చేరుకుంటారు.అమ్మవారు భగవద్దర్శనం 15రోజులపాటు భక్తులకు దర్శనమిస్తారు.ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి పార్థసారథి మాట్లాడుతూ కోరినకోర్కెలు తీర్చే తల్లి



వీరమ్మతల్లి అంటూ కొనియాడారు.రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.అమ్మవారి దయతో ఈ ప్రాంత ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.పారుపూడి వంశస్థులు ఈ జాతర నిర్వహిస్తారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే ఆలయకమిటీతో మాట్లాడి అభివృద్ధి జరగడానికి ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ళు తో భక్తి వాతావరణంతో మార్మోగి పోయింది.పారుపూడి వంశస్థులు సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారని భక్తులకు,ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీతో చర్చించి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువనాయకులు బోడె వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.వీరమ్మతల్లి చల్లనిచూపు వలనే ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో,భోగభాగ్యాలతో వర్థిల్లుతున్నారని ఆయన కొనియాడారు.

## సమన్వయంతో వర్సిటీ అభివృద్ధికి తోడ్పడండి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి29 ,ప్రభాతవార్త:** ఉద్యోగులు, అధ్యాపకులు సమన్వయంతో విధులు నిర్వహించి యూనివర్సిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పొన్నూరు ఎంఎల్ఏ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. టిఎన్ఎస్ఎఫ్, టిఎన్‌టియుసి సంఘాలు విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. అనంతరం టిఎన్‌టియుసి, టిఎన్ఎస్ఎఫ్ ఉద్యోగులు, విద్యార్థుల ఆధ్వర్యంలో రూపొందించిన 2026 డైరీని గురువారం ఎంఎల్ఏ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్, టిఎన్‌టియుసి సమన్వయకర్త డా.యం.వెంకటరమణ, ఆచార్య కోడెల వెంకట్రావ్, టిఎన్‌టియుసి అధ్యక్షులు వి.విష్ణుప్రసాద్, నాయకులు వై.రాధాకృష్ణ, వికాస ప్రెసిడెంట్ ఎన్.ప్రసాద్, సెక్రటరి జె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నూతక్కి వెంకటేశ్వర్లు, డైలీవేజ్ యూనియన్ ప్రెసిడెంట్ ప్రభాకర్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడుబత్తుల హేమంత్‌కుమార్, నంబూరు కోటేశ్వరరావు, ఆరే గోపీ, దుర్గాప్రసాద్, మోహన్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రుసల్ నాన్‌ఫార్మ్మెటీరియల్స్‌తో తక్కువ ఖర్చుతో నిర్మాణాలు

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** తమ ఇంజనీరింగ్ విభాగం బొగ్గు ప్రాసెసింగ్ ఉప ఉత్పత్తుల నుండి స్వంతపేటెంట్ టెక్నాలజీతో రూపొందించిన నాన్‌ఫార్మ్మెటీరియల్స్ ను విడుదల చేసినట్లు అల్యూమినియం ఉత్పత్తిదారు రుసల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కొత్త మెటీరియల్స్ ఇన్‌స్టాలేషన్‌ను సులభతరం చేయటంతో పాటుగా, ఖర్చులను తగ్గిస్తుందన్నారు. సాంప్రదాయ స్లాబ్‌ల నిర్మాణ ఖర్చు ఇన్‌స్టాలేషన్ ఖర్చులు తగ్గుతాయన్నారు.

## ఏఎన్‌యు డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి29, ప్రభాతవార్త:** ఏఎన్‌యు పరిధిలో డిగ్రీ (యూజీ) కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్షల రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. గతేడాది నవంబరులో జరిగిన ఈ పరీక్షలకు 9515మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 5830మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఏసిఇ ఎ.వెంకటేశ్వర్లు రీవాల్యూయేషన్‌కు ఫిబ్రవరి 13వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పర్సనల్ వెరిఫికేషన్/రీవాల్యూయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.1640 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు, ఓఎస్‌డి ఆచార్య ఆర్‌విఎస్ఎస్ఎన్. రవికుమార్, సిటిఏ ఆచార్య జి.జ్ఞానేశ్వరరెడ్డి, ఏసిటిఏలు డా.పి.సుధాకర్, ఆచార్య ధనలక్ష్మీ, డా. జె.మాధవి, సిఇ ఆలపాటి శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## యువమహిళా క్రికెటర్లకు హిమాలయ తోడ్పాటు

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** యువతుల్లో దాగివున్న ప్రతిభను ప్రోత్సహిస్తూ యువమహిళా క్రికెటర్లకు తోడ్పాటు అందిస్తున్నామని హిమాలయ వెల్‌నెస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ అధికారులు రాజేష్ కృష్ణమూర్తి, రాగిణి హరిహరన్, అభిషేక్ ఆశత్‌లు తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా 1డేర్‌వుమన్ అకాడమిని ప్రారంభించారు. సాంకేతికత, విశ్వస నీయతతో తర్ఫీదునిచ్చి జాతీయ స్థాయిలో విజయాలు సాదించేలా కృషి




చేస్తామన్నారు. ఆసక్తులు తమను ఆన్‌లైన్‌ద్వారా సంప్రదించాలన్నారు.

## టౌన్ ప్లానింగ్ అసోసియేషన్‌కు చెందిన డైరీ ఆవిష్కరణ

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 29,ప్రభాతవార్త :** టౌన్ ప్లానింగ్ అసోసియేషన్‌కు చెందిన డైరీని టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో (జిఇట) డైరెక్టర్ బి.శ్రీనివాసులు,అడిషనల్ డైరెక్టర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఏపి స్టేట్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరరావు,జాయింట్ డైరెక్టర్ మహాలక్ష్మి దొర,డైరీ కమిటీ చైర్మన్ పి.నాయుడు,ఉపాధ్యక్షులు



అబ్దుల్ సత్తార్,ట్రెజరర్ శ్రీకృష్ణ,జోనల్ అధ్యక్షులు వసీం బేగ్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు,రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారులు,టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరిలో శాంసంగ్ గెలాక్సీ ఏ07 5జీ విడుదల

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** ఫిబ్రవరి మొదటి వారంలో గెలాక్సీ ఏ07 5జీని మార్కెట్లోకి విడుదల చేస్తామని శాంసంగ్ ప్రతినిధులు తెలిపారు. ఈ ఫోన్ ఆన్‌లైన్ వినోదం, సోషల్ మీడియా ద్వారా విజువల్ స్టోరీ టెల్లింగ్, రోజంతా వచ్చే బ్యాటరీ, నేటి తరం డిజిటల్ వినియోగదారుల కోసం ఐకానిక్ ట్రాక్ కెమెరా డెకో డిజైన్, 50ఎంపీ ఆటోఫోకస్ కెమెరా, 2ఎంపీ కెమెరా హైరిజల్యూషన్ డ్యూయల్ కెమెరా, 8ఎంపీ ఫ్రంట్ కెమెరా, తక్కువ నాయిస్‌తో స్పష్టమైన సెల్ఫీలు, వీడియోలను అందిస్తుందన్నారు.

## గంజాయి అమ్ముతున్న ఇరువురు వ్యక్తులు అరెస్టు

**గుంటూరు క్రైమ్, జనవరి29,ప్రభాతవార్త:** గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను పాత గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గుంటూరు జిల్లాలో గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో, పాత నేరస్తులపై నిఘా ఉంచి ముమ్మర తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీ చేశారు.ఎస్పీ ఆదేశాల మేరకు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో, పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తమ పరిధిలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచి, ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో గురువారం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్రాయెల్‌పేట రైల్వే ట్రాక్ ప్రక్కన గల ఖాళీ స్థలంలో గంజాయి అమ్మకం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలు... సయ్యద్ బాష చిన్న బాష శ్రీ/న బాష హుస్సేన్, వయస్సు 30 సంవత్సరాలు, 1వ లైను, ఇస్రాయెల్‌పేట, పాత గుంటూరు .గుంజి గోపి కృష్ణ గోపి శ్రీ/న ఆంజనేయులు, వయస్సు 30 సంవత్సరాలు, 12వ లైను, శారదా కాలనీ, గుంటూరు టౌన్ (ప్రస్తుతము భవానిపురం, విజయవాడలో నివాసం). నిందితులు గంజాయి సేవించే చెడు వ్యసనంతో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సీతానగరం 4వ లైన్ గంగానమ్మ గుడి దగ్గర నివాసముండే ముక్కోటి రాము వద్ద,అరకు ప్రాంతం నుండి గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్ముతుండగా పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో దాడి చేసి అరెస్ట్ చేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, P V SHAH, S/o Babulal, residing at C401, Sri Sai Apartment, Backside High School, Gollapudi, Vijayawada 521225, do hereby declare that the names P V SHAH and VASANTLAL B SHAH refer to one and the same person, which is myself. I have changed my name to VASANTLAL B SHAH for all future purposes as per the affidavit dated 08/11/2025 sworn before Notary SHAIK SHAFI. (Ro.No.40784)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ఘనంగా పేరూరుపాడు తిరునాళ్ల

బొల్లాపల్లి,జనవరి29,ప్రభాతవార్త: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నాగమునీంద్ర స్వామి తిరునాల మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు శ్రీనాగ మున్నీద్రస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో గుడి ఆధునీకరణ పనులను ఆయన



ప్రారంభించారు. జీవీ గారు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెరగాలని, పురాతన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని భక్తులకు,గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1న రవ్వారం శ్రీ కొండగురునాధ స్వామి తిరునాళ్ల



నూజెండ్ల,జనవరి29,ప్రభాతవార్త: మండలంలోని రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండ గురునాథ స్వామి తిరునాళ్ల వచ్చే నెల 1వ తేదీ ఆదివారం జరగనుంది. గురువారం వినుకొండ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.బ్రహ్మయ్య,ఐనవోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ బీ.వీ కృష్ణారావు కొండను సందర్శించి తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వినుకొండ,జనవరి29,ప్రభాతవార్త: భీష్మ ఏకాదశి పురస్కరించుకొని పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు శ్రావణకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష



తులసీదళాలతో పూజా కార్యక్రమం, విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రెటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు ,ట్రెజరర్ కాళ్ల రామకోటేశ్వరరావు, ఆలయ కమిటీసభ్యులు గుడిపాటి కోటేశ్వరరావు,మాదాల అనిల్, గుడిపాటి బాలసుబ్రహ్మణ్యం, సన్నిశెట్టి లక్ష్మీనారాయణ,అన్నా వీరబ్రహ్మం,అన్నా చిన్నసుబ్బారావు, మోటమర్రి నాగేశ్వరరావు,జీ.వీ మాధవరావు,మోటమర్రి నరసింహారావు,కూరపాటి అప్పిరెడ్డి,చితిరాల పుల్లారావు,ఆలయ సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ పట్ల భక్తుల తీవ్ర ఆగ్రహం

వినుకొండ,జనవరి29,ప్రభాతవార్త: కలియుగ దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు సిట్ విచారణలో స్పష్టం అవడం పట్ల భక్తులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వినుకొండ పట్టణంలోని శ్రీనివాసనగర్ నందు వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి



ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగడాన్ని భక్తులు మహా పాపంగా అభివర్ణిస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండవీడు ఉత్సవాలతో రాష్ట్ర ఖ్యాతి జాతీయస్థాయిలో ఇనుమడించాలి : ప్రత్తిపాటికి సీఎం సూచన

**..అంతర్జాతీయ నాటక మహోత్సవాల ప్రచార పత్రాలను ఆవిష్కరించిన ముఖ్య మంత్రి, ప్రత్తిపాటి**

యడ్లపాడు, జనవరి 29, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి కొండవీడు ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను వివరించిన ప్రత్తిపాటి పుల్లారావు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం, అభివృద్ధి నిధుల కేటాయింపుపై చొరవ చూపాలని సీఎంను కోరడం జరిగిందన్నారు. అనంతరం తెలుగునాటక పరిషత్తుల సమ్మేళన సంఘం యడ్లపాడు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ వారి సంయుక్త సారథ్యంలో జరిగే భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవాల ప్రచార పత్రాలను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన కొండవీడు కోట సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ రాష్ట్రం గర్వించేలా, ఏపీ ఖ్యాతి జాతీయస్థాయిలో ఇనుమడించేలా అంగరంగవైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు



సూచించారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం రాత్రి ముఖ్యమంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి కొండవీడు ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల గురించి తెలియచేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేసిన ముఖ్యమంత్రి, భారీసంఖ్యలో తరలివచ్చే పర్యాటకులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో నిర్వహణ ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారని ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు మార్గంలో చౌడవరం వద్ద రూ.220కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన టన్నెల్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలన్న విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. నాటకోత్సవాల ప్రచార పత్రాలు ఆవిష్కరించిన సీఎంతెలుగునాటక పరిషత్తుల సమ్మేళన సంఘం యడ్లపాడు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీ వారి సంయుక్త సారథ్యంలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు గుంటూరులో జరిగే భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం ప్రచార పత్రాలను ముఖ్యమంత్రి స్వయంగా ఆవిష్కరించారని ప్రత్తిపాటి తెలియచేశారు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగే నాటకోత్సవాలకు నిర్వాహకులు, తాను ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు ఆయన తెలిపారు. తెలుగునాటక పరిషత్తుల సంఘం నిర్వాహకులు ముత్తవరపు సురేశ్ బాబు సమాజశ్రేయస్సు, ప్రజాచైతన్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఏటా ఘనంగా నిర్వహించే నాటకమహోత్సవాల విశిష్టతను సీఎం కు వివరించారని, సురేశ్ కృషిని ముఖ్యమంత్రి ప్రశంసించారని ప్రత్తిపాటి తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## రహదారి భద్రత, ట్రాఫిక్‌పై అవగాహన ర్యాలీ

నరసరావుపేట క్రైమ్ , జనవరి 29 ప్రభాతవార్త :: స్థానిక కేసానుపల్లి లోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, రోటరీ క్లబ్ సంయుక్తంగా రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. "వరల్డ్ ఆటోమొబైల్ డే" వేడుకలను ఆటో మొబైల్ ఇంజనీరింగ్ అల్యూమ్ని పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శి కరీం, డైరెక్టర్ షరీఫ్ లు తెలియజేశారు. రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవగాహన ర్యాలీకి ముఖ్య అతిధులుగా యన్. శివనాగేశ్వరరావు (ఎం.వి.ఐ)




సిహెచ్.లోకనాథం( ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ) పల్నాడు .షేక్. కరీం మోహిద్దీన్ ( ప్రెసిడెంట్ రోటరీ క్లబ్) హాజరై ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం మనందరి భాధ్యతని, ట్రాఫిక్ రూల్స్‌ని పాటిస్తూ సేఫ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని పేర్కొన్నారు. కళాశాలలో జరిగిన "వరల్డ్ ఆటోమొబైల్ డే వేడుకల"లో ప్రధాన అతిధి యన్. శివనాగేశ్వరరావు ( ఎం.వి.ఐ) మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతంగా ఆటోమొబైల్ రంగం అగ్రగామిగా ఉందన్నా రు. అంతే కాకుండా ఎంతో మందికి ఉపాధి నిస్తుందని తెలిపారు. ఈ కోర్సు ను ఎంచుకున్న విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థితికి చేరాలని కోరారు. వరల్డ్ ఆటోమొబైల్ డే కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించామన్నా రు. షార్ట్ ఫిలిం, పోస్టర్ ప్రెజెంటేషన్ మరియు రోల్ ప్లే కేటగిరీలలో విజేతలకు బహుమతులు మరియు ప్రతిభను కనపరిచిన వారికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నాగమల్లేశ్వర రావు తెలిపారు. వరల్డ్ ఆటోమొబైల్ డే ముగింపు కార్యక్రమంలో విశిష్ట అతిధిగా సిహెచ్. మనీషా (ఏ.ఎం.వి.ఐ), కళాశాల చైర్మన్ షేక్. మీరావలి గా), మేనేజింగ్ డైరెక్టర్ డా. షేక్. మస్తాన్ షరీఫ్ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్. నజీమా, శ్రీ బి. మునీంధర్ రెడ్డి, సెక్రటరీ రోటరీ క్లబ్ నరసరావుపేట, ఇతర రోటేరియన్స్ అయిన షేక్. జిలానీ మాలిక్ , పి.డి.జి తాళ్ళ రాజశేఖర్ రెడ్డి , సుమిత్ర ఆటో మొబైల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిరసన: ఆర్డీవోకు వినతి

రొంపిచర్ల జనవరి 29 ప్రభాతవార్త: : రైతు భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం రైతులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి, ఆర్డీఓ మధులతకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎం సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముప్పాళ్ళ మండలం గొళ్ళపాడుకు చెందిన గురజాల కోటేశ్వరరావు అనే రైతుకు ములకలూరు రెవిన్యూ పరిధిలోని కేతముక్కల అగ్రహారంలో సర్వేనెంబర్ 703బి లో 94 సెంట్లు వ్యవసాయ భూమి ఉందన్నారు. కోటేశ్వరరావు భూమితో పాటుగా ఈ సర్వే నంబర్లోనే ఇతర రైతుల భూములు, ఎండోమెంట్ భూములు ఉన్నాయన్నారు. ఎండోమెంట్ కు సంబంధించిన రెండు ఎకరాల భూమి తగ్గిందని మొత్తంగా రైతులకు సంబంధించిన భూములను రిజిస్ట్రేషన్ జరగకుండా నిషేధిత 22 ఏ జాబితాలో చేర్చడం వలన రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కోటేశ్వరరావు తన భూమి అమ్ముకొని, రిజిస్ట్రేషన్ జరగక గత 5నెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించకుండా నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఎండోమెంట్, రెవెన్యూ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, రైతు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్డీఓకి మెమోరండం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటనాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, బాదుగున్నల కోటేశ్వరరావు, రైతులు గురజాల కోటేశ్వరరావు, శ్రీకాంత్, గురజాల కోటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్ విద్యార్థికి అభినందన

నకరికల్లు జనవరి 29 ప్రభాతవార్త :: రిపబ్లిక్ డే వేడుకలలో (అమరావతి నందు) భారత్ స్కౌట్స్ మరియు గైడ్స్ శంకర భారతిపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ నెల 10 వతారీఖు నుండి 25 వ తారఖు వరకు శిక్షణ పొంది జనవరి 26 న



జరిగిన ఉత్సవములో విద్యార్థి సాయినాథ్ పాల్గొన్నారు. వేడుకలలో కవాతులో ప్రతిభ చూపడం జరిగింది. పాల్గొన్న విద్యార్థి యద్దనపూడి సాయినాథ్ ను ఈ సందర్భంగా పాఠశాల ప్రధా నోపాధ్యా యని అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అడల్ట్ ఖిమాస్టర్ పార్వతి, పాఠశాల స్కౌట్ మాస్టర్,రిసోర్ట్ కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినం దించారు.

## గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం : విడదల రజని



యడ్లపాడు, జనవరి 29, ప్రభాతవార్త : యోజకవర్గంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బోయపాలెం, వంకాయలపాడు గ్రామాలలో మాజీ మంత్రి వర్యులు శ్రీమతి విడదల రజిని బుధవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టే విధంగా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని, గ్రామస్థాయి నుంచి ప్రజలతో బలమైన అనుబంధం పెంచుకోవాల్సి న అవసరం ఉందని తెలిపారు. కష్టకాలంలోనూ పార్టీకి కార్యకర్తలు అండగా నిలుస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన గ్రామ కమిటీలను ప్రకటించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్డేపల్లి నరసింహారావు, మండల గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి'

నరసరావుపేట, జనవరి 29 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టిన అఖిల భారత సమ్మెలో అన్ని వర్గాల




ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి పండించిన పంట గిట్టుబాటు ధర లేదన్నారు. కార్మిక చట్టాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, నిత్యవసర వస్తువులు ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి రంగయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, సిపిఐ మండల కార్యదర్శి రోడ్డ అంజిరెడ్డి, ఏఐటియూసీ ముసలయ్య, రమేష్ పాల్గొన్నారు.

## అంధుల జీవితాల్లో వెలుగుల నింపిన బ్రెయిలీ: ఎమ్మెల్యే

నరసరావుపేట, జనవరి 29 ప్రభాతవార్త : అందుల జీవితాల్లో లూయీ బ్రెయిలీ వెలుగులు నింపారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. స్థానిక లూయి బ్రెయిలి అంధుల పాఠశాలలో గురువారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం, లూయి బ్రెయిలి 217వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అరవింద బాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ, దృష్టి లోపం ఉన్నప్పటికి విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని లూయి బ్రెయిలి జీవితం తెలియజేస్తుందని, అతని జీవితం ఆదర్శమని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సహాయ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలిపారు. పట్టణంలోని లూయి బ్రెయిలీ అందుల పాఠశాలలో మోలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గోనుగుంట కోటేశ్వరరావు మాట్లాడుతూ, బ్రెయిలి లిపి ద్వారా అంధులకు జ్ఞాన ద్వారాలు తెరుచుకున్నాయని, ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా కూడా ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు చదువు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## యువకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలి

నరసరావుపేట క్రైమ్, జనవరి 29 ప్రభాతవార్త: : యువకులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 37 వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం నరసరావుపేటలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువకులే



ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది ఆందోళనకర పరిస్థితి అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ఉపయోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ నియంత్రణ పాటించాల్సి న అవసరం ఉందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. రహదారి భద్రత ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శివ నాగేశ్వరావు, ట్రాఫిక్ సీఐ లోకనాథం, రోడ్ సేఫ్టీ ఎన్జిఓ సంస్థ అధ్యక్షులు ఆర్. కనకదుర్గ పద్మజ, సభ్యులు బంగారయ్య, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 'కబడ్డీ, ఖోఖో తరహాలోనే సెపాక్ టక్రా క్రీడ '

రొంపిచర్ల, జనవరి 29 ప్రభాత వార్త ::సెపాక్ టక్రా క్రీడ మన సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖో ఖో తరహాలోనే ఎంతో వేగవంతమైన నైపుణ్యంతో కూడుకున్న క్రీడా అని ఆల్ ఇండియా సెపాక్ టక్రా ఫెడరేషన్ ప్రెసిడెంట్ మరియు ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ జి. శ్రీనివాసులు పేర్కొన్నారు. నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామంలోని ఎం.ఏ.ఎం గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ను జి. శ్రీనివాసులు సందర్శించారు. ఈ



సందర్భంగా కళాశాల అధినేత మేదరమెట్ల రామశేషగిరిరావుతో క్రీడల ప్రాముఖ్యత మరియు అంతర్జాతీయ స్థాయిలో సెపాక్ టక్రా క్రీడకు ఉన్న గుర్తింపుపై ప్రధానంగా చర్చించారు. ఆసియా దేశాల్లోనే కాకుండా, కామన్‌వెల్త్ దేశాల్లో మరియు అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాల్లో కూడా ఈ క్రీడకు విశేష ఆదరణ ఉందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి అంతర్జాతీయ క్రీడల పట్ల అవగాహన పెంచుకోవాల్సి న అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును మేదరమెట్ల రామశేషగిరిరావు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి సహకారం అందిస్తానని శేషగిరిరావు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే


నకరికల్లు,జనవరి 29 ప్రభాతవార్త: నరసరావుపేట మండలంలోని పెట్లూరు వారి పాలెం గ్రామం నందు గల ఏ ఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల నందు గురువారం రెండవ సంవత్సరం ఫార్మా డీ అభ్యసిస్తున్న విద్యార్థులు ఒకటవ సంవత్సరములో నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థిని విద్యార్థులకు స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు . శాంతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొదటి సంవత్సరం నుండే వారి యొక్క ఆశయాలకు అనుగుణంగా కళాశాలలోని ప్రతి ఒక్క



సౌకర్యాలను వినియోగించుకుంటూ పరిశోధనల పట్ల ఆసక్తి కనబరుస్తూ వారి యొక్క తల్లితండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణతో మెలగాలని తెలియజేశారు. కళాశాలలో మొదటి సంవత్సరం నుండి ఫార్మాడీ విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమమైన ఆసుపత్రుల నందు శిక్షణ తరగతుల కోసం పంపించడం జరుగుతుందని మరియు విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా అనేక పరిశోధన తరగతులు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం శిక్షణ తరగతులు విరివిగా చేపడతామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి భార్గవ భూషణ్ రావు మాట్లాడుతూ ఫార్మా డి వంటి ప్రొఫెషనల్ కోర్సుల నందు అడ్మిషన్ పొందడం విద్యార్థుల యొక్క అదృష్టంగా భావించాలని రాష్ట్రంలోనే అత్యుత్తమమైన ఏఎం రెడ్డి విద్యాసంస్థలను ఎంచుకోవడం ఎంతో శుభసూచకమని తెలియజేశారు. నూతనంగా ఫార్మా డి కోర్సు ను ఎంచుకున్న విద్యార్థులు తరగతి గదులకు తప్పనిసరిగా హాజరవుతూ అన్ని బోధన విషయాల పట్ల ఆసక్తి కనబరిస్తూ క్రమశిక్షణ గల విద్యార్థులుగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ ఏ పావని, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి విభాగాధిపతులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి - పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డా. రజినీ కుమారి

యడ్లపాడు, జనవరి 29, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19 నుండి 31 వరకు నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలలో భాగంగా పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ రజినీ కు మారి క్షేత్రస్థాయి పరిశీలనకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని వంకాయలపాడు, కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాలలో పర్యటించి జరుగుతున్న శిబిరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజినీ కుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ప్రోత్సహించే దిశగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి పశుసంవర్ధక శాఖ అందజేస్తున్న సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడం ఎంతో ముఖ్యమని, ఇందుకు సంబంధిత పశువైద్యాధికారులకు పశుపోషకులు పూర్తి సహకారం అందించాలన్నారు. అలాగే పశువైద్యులు ఇచ్చే సూచనల మేరకు సరైన పోషణ, నిర్వహణ చర్యలు చేపడితే పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడమే కాకుండా, పశుపోషకుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. పశుపోషకులు తమ పశువుల ఆరోగ్యం పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ, పశుసంవర్ధక శాఖ ద్వారా అందుతున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, కృత్రిమ గర్భధారణ, పశు ఆరోగ్య సలహాలు వంటి సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అలాగే ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అందజేస్తున్న సబ్సిడీ పథకాలు, పాడి అభివృద్ధి పథకాలు, పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలను



సద్వినియోగం చేసుకోవడం ద్వారా పశుపోషకులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని డాక్టర్ రజినీ కుమారి తెలిపారు. ఈ పశు ఆరోగ్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో పశువుల ఆరోగ్య పరిరక్షణకు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పశుపోషకుల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమాలు విజయవంతమవుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డిస్టిక్ యానిమల్ హస్బండ్రీ ఆఫీసర్ డాక్టర్ బి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా డిస్టిక్ యానిమల్ హస్బండ్రీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామారావు, యడ్లపాడు ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం నాగేశ్వరావు, చిలకలూరిపేట ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ, జగ్గాపురం పశువైద్యాధికారి బి కబిరెడ్డి, తిమ్మాపురం పశువైద్యాధికారిణి కలిషాబేగం, పారా సిబ్బంది, అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్లు, గోపాల్ మిత్రులు వి అనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చుక్క పాలు లేకుండా 60 లక్షల కిలోల కల్తీనెయ్యి ఎక్కడ నుంచి వచ్చింది? : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 29, ప్రభాతవార్త: చుక్కపాలు లేకుండా, దాదాపు 60 లక్షల కిలోల కల్తీనెయ్యి తయారీ, దానితో 20 కోట్లకు పైగా శ్రీవారి లడ్డూలు తయారుచేసి ఘోరమైన పాపానికి ఒడిగట్టింది చాలక..వైసీపీనేతలు ఇంకా నెయ్యి కల్తీ జరగలేదు.. జంతువుల కొవ్వు లేదని వాదించడం వారి అజ్ఞానానికి, దిగజారుడుతనానికి నిదర్శనం. సుప్రీంకోర్టు నియమించిన సిట్ విచారణలోని అంశాలపై వైసీపీనేతల వక్రభాష్యాలు వారికే చేటు చేస్తాయి. తమ నాయకుడి పాపాలు ప్రజలముందు ఉంచుతుందన్న దురుద్దేశం, దుగ్ధతోనే వైసీపీనేతలు సిట్ దర్యాప్తుకు వక్ర భాష్యాలు చెబుతున్నారు.



సిట్ విచారణ పూర్తికాకముందే జగన్ ముఠా తొందరపాటు చర్యలతో ముందరి కాళ్లకు బంధాలు వేసుకుంటోంది. పాలసేకరణ సామర్థం లేని సంస్థలు 60 లక్షల కిలోల నెయ్యిని ఎలా సరఫరా చేశాయో వైసీపీనేతలు చెప్పాలి. నచ్చిన వారికి నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ఎన్నోఏళ్ల నుంచి ఉన్న కఠినమైన టెండర్ నిబంధనలు వైసీపీప్రభుత్వం మార్చింది నిజం కాదా? కమీషన్లు ముట్టచెప్పే అనర్హులకు టెండర్లు కట్టబెట్టింది వాస్తవం కాదా? స్వామి వారి ప్రసాదాల్లో వినియోగించిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని ఎన్.డీ.డీ. బీ ఇచ్చిన నివేదికను సిట్ ధృవీకరించలేదా? పవిత్ర క్షేత్రంలో జరిగిన అపవిత్ర కార్యాల్లో జగన్.. నాటి టీటీడీ పాలకమండలి పాత్ర సుస్పష్టం కల్తీనెయ్యితో లడ్డూలు తయారు చేయించి, హిందువుల మనోభావాలతో ఆటలాడి. తనలోని మత విద్వేషాన్ని జగన్ సంతృప్తి పరుచుకున్నాడనేది పచ్చి నిజం అని అన్నారు వైసీపీనేతలు గుడిమెట్ల డ్రామాలు ఆపకుంటే ప్రజలు వారిని శాశ్వతంగా ఆ మెట్లకే పరిమితం చేస్తారు కల్తీనెయ్యిలో జంతుకొవ్వులేదని వైసీపీనేతలు అప్పుడే ఎలా చెబుతారు? తమ వాదనను బలపరిచే ఆధారాలుంటే వారు వాటిని సిట్ కు, న్యాయస్థానాలకు అందచేయకుండా.. అనుకూల మీడియాలో దుష్ప్రచారం చేయించడంలోని ఉద్దేశం ఏమిటి? వైసీపీ నేతలు గుడులు.. గుడిమెట్ల శుభ్రత డ్రామాలు ఆపకుంటే ప్రజలు వారిని శాశ్వతంగా ఆ మెట్లకే పరిమితం చేస్తారు. తిరుమల పవిత్రత, విశిష్టతను జగన్ మంటగలిపాడన్నది జగమెరిగిన సత్యం. స్వామి హెచ్చరికను బేఖాతరు చేస్తూ, ఇప్పటికీ తప్పు తెలుసుకోకుండా ప్రవరిస్తే.. వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ తెరమరుగు కావడం ఖాయం." అని మాజీమంత్రి ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ



చిలకలూరిపేట, జనవరి 29, ప్రభాతవార్త: పట్టణంలోని పురుషోత్తమపట్నం ప్రాథమిక, ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఆయన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఉర్దూ పుస్తకాలు, ఖురాన్ ప్రతులు అందచేశారు. ముస్లిం మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులకు పుస్తకాలు అందించిన అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, బేరింగ్ మోలాలి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, షేక్ కరిముల్లా, నిర్వాహకులు ఖాజా హుస్సేన్, షేక్ జానీ, షేక్ సుభాని (చోటు), మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణంలో లోపాలు సరిచేసి ప్రజల ప్రాణాలు కాపాడండి

చిలకలూరిపేట, జనవరి 29, ప్రభాతవార్త: జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో భాగంగా పసుమర్రు వద్ద నిర్మించిన బ్రిడ్జి నిర్మాణంలోని లోపాలు.. వాహనదారుల ప్రాణాలు హరిస్తున్నాయని,



సమస్య పరిష్కారంపై వెంటనే దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎన్.హెచ్.ఏ.ఐ విభాగాన్ని ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణం సరిగా లేనందున ఆ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పసుమర్రు గ్రామస్తులు ప్రత్తిపాటికి తెలియచేశారు. గురువారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్) నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని కోరారు. పసుమర్రు బ్రిడ్జి ఒక్కటే కాకుండా. నియోజకవర్గంలో నుంచి వెళ్లే జాతీయ రహదారి, బైపాస్ నిర్మాణంలో ఎక్కడెక్కడ లోపాలున్నాయో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటో గుర్తించి, వాటి పరిష్కారంపై వెంటనే దృష్టి పెట్టాలని ఆయన ఎన్.హెచ్.ఏ.ఐ వారికి సూచించారు. రోడ్లు, డ్రైనేజ్ లనిర్మాణానికి సంబంధించిన వచ్చిన వినతుల పరిష్కారంపై మున్సిపాలిటీ సిబ్బంది తక్షణమే దృష్టి పెట్టాలన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైందని కొన్ని వార్డుల ప్రజలు ప్రత్తిపాటికి తెలియచేశారు. సమస్యపై స్పందించిన ఆయన.. కుక్కల్ని సురక్షితంగా ఇతర ప్రాంతాలకు తరలించాలని, కుక్కకాట్లతో ప్రజలు ఇబ్బంది పడకుండా అవసరమైన ఇంజక్షన్లు, మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రధానాసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని, వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ప్రత్తిపాటి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రత్తిపాటి' సేవా కార్యక్రమాలకు సిఎం చంద్రబాబు కితాబు



చిలకలూరిపేట, జనవరి 29, ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న నేత, మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు. తాజాగా ఆయన ఆధ్వర్యంలో టి.ఎన్.టి.యు. సి.రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన కంచర్ల శ్రీనివాసరావు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్తిపాటి పుల్లారావు మూడు దశాబ్దాలుగా సాగిస్తున్న అప్రతిహతంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు.ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా ప్రస్థానం...ప్రత్తిపాటి పుల్లారావు కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, ఎన్నో సేవా కార్యక్రమాలు ఉచిత మెడికల్ క్యాంపులు,నిర్వహించి వేలాది మందికి గుండె,మోకాళ్ళ శస్త్ర చికిత్సలు చేయించటంతో పాటుగా లక్షలాదిమంది కళ్ళ ఆపరేషన్లు చేయించిన ఒక గొప్ప మానవతావాది 'సేవాతత్పరుడిగా' ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా గత 30 ఏళ్లుగా ఆయన చేస్తున్న కార్యక్రమాలు ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపాయి.కరోనా విపత్తు సమయంలో ప్రజలు అల్లాడుతుంటే, తన సొంత వనరులతో పేదలకు నిత్యావసరాలు, వైద్య సహాయం అందించి అండగా నిలిచారు ఇవే కాకుండా మన సంస్కృతి సంప్రదాయాలను,సాంస్కృతిక వినోదం ప్రజలకు మానసిక ఉల్లాసం కలిగించేందుకు ఈటీవీ, హెచ్ ఎమ్ టివి వంటి ప్రముఖ వేదికల ద్వారా వివిధ వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేసి, తన నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారని. ప్రత్తిపాటి పుల్లారావు పట్ల అభిమానం,తెలుగుదేశం పార్టీ నాయకత్వం పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసంతో ప్రభుత్వ ఉద్యోగానికి సైతం వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తున్నాను చంద్రబాబుకి వివరించారు. నాయకుడిపై అభిమానం కంచర్ల శ్రీనివాసరావు వ్యక్తిత్వం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించి తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మార్గ దర్శనం చేశారు.

## ఆర్యవైశ్యులు ఎస్సీ, ఎస్టీలను కలుపుకుని పయనించాలి

సత్తెనపల్లి, జనవరి 29, ప్రభాతవార్త: ఆర్య వైశ్యులు వ్యాపారంతో పాటు రాజకీయంగా కూడా బలోపేతం కావాలంటే ఎస్సీ, ఎస్టీ వర్గాలను కలుపుకొని ప్రయాణం చేస్తేనే అధికారం దిశగా పయనిస్తారని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణ పిలుపునిచ్చారు. విజయవాడ నుంచి పిడుగురాళ్ల వెళ్తూ మార్గం మధ్యలో గురువారం మధ్యాహ్నం సత్తెనపల్లిలో కాసేపు ఆగిన ఆయన ఆర్యవైశ్య నాయకులతో మాట్లాడారు. భూస్వామ్య పెత్తందారి నాయకుల పార్టీలలో వైశ్యులు పనిచేయటం వృథా ప్రయాసని రాజకీయంగా ఎదగాలంటే అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ లతో కలిసి వెళ్తేనే అధికారం దిశగా పయనిస్తారని ఆయన చెప్పారు.



ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలకు కూడా ఆయా వర్గాల వారే అండని వైశ్యులు కూడా ఎస్సీ ఎస్టీలతో కలసి రాజకీయంగా ఎదిగేందుకు విజ్ఞులైన వైశ్యులు ప్రయత్నించాలని ఆయన సూచించారు. త్వరలో పార్టీలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, వైశ్య ఐక్యవేదిక కమిటీ నిర్మాణం జరుగుతోందని ఆసక్తి కలిగిన వారు పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్ సెల్ నెంబర్ 9440740588 సంప్రదించాలని ఆయన సూచించారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తీసుకురావటానికి ప్రధాన పాత్ర పోషించింది ..రామ్ విలాస్ .. అని చెప్పారు. ఆ చట్టం రాక ముందు వచ్చిన తరువాత ఆయా వర్గాల్లో ఆత్మ ధైర్యం పెరిగిందన్నారు. అలాగే పాశ్వాన్ వలనే అగ్రవర్ణాల్లో పేదలకు ఈబీసీ కోటాలో పది శాతం రిజర్వేషన్ వచ్చిందని అన్నారు. అటు బహుజనులకు ఇటు అగ్రవర్ణ పేదలకు అండగా ఉంటున్న పార్టీ, నాయకుడు లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు, మంత్రివర్యులు చిరాగ్ పాశ్వాన్ అని చెప్పారు. తెలుగు రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారాయణను వాసవి అమ్మవారు, ఫిరోజీ ఋషింద్రుల వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య నాయకులు, పూలహారి భానోజీ లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్, నాయకులు కరుమంచి గంగరాజు వివిధ హోదాల్లో ఉన్న ఆర్యవైశ్య నాయకులు అతుకూరి నాగేశ్వరరావు, అన్నం బాలసుబ్రమణ్యం, దివ్వెల శ్రీనివాసరావు, పొతుగంటి రామకోటేశ్వరరావు, మద్ది వెంకటేశ్వర్లు, భవిరెడ్డి వెంకట సుబ్రహ్మణ్యం, దేవరపల్లి కాశీ, కొత్త లక్ష్మయ్య, చంద్రపాటి కోటి, చిల్లంచర్ల కళ్యాణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## భక్తుల మనోభావాలను గాయపరిచిన వైకాపా: ఎమ్మెల్యే 'యరపతినేని'

గురజాల, జనవరి 29 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపి హిందువుల మత విశ్వాసాలను, భక్తుల మనోభావాలను వైసీపీ తీవ్రంగా గాయపరిచిందని



గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం మాచవరం మండలం మోర్జంపాడులో కొలువైవున్న శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పూజారులు, భక్తులతో కలిసి పసుపునీళ్లతో శుద్ధి చేసి విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగినట్లు సిట్ నివేదిక ఇచ్చిందన్నారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డులో వినియోగించిన నెయ్యి మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యిలో 60 లక్షల కిలోల నెయ్యితో 20 కోట్ల లడ్డులు, 60 లక్షల కిలోల నెయ్యితో ఇతర ప్రసాదాలు తయారు చేసి రూ.250 కోట్ల తిరుమల ప్రసాదం ద్వారా వైసీపీ అవినీతికి పాల్పడిందన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తిరుమల లడ్డు కల్తీపై అనుమానం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. తిరుమల ప్రసాదంలో కల్తీ జరగలేదని చెప్పే వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ కోసం కోరున్టకు ఎందుకు వెళ్లారని, బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చేందుకు ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో టీటీడీ నిబంధనలకు తూట్లు పొడిచి కల్తీకి రహదారి ఏర్పాటు చేసుకొని విచిత్ర కంపెనీలతో ఎలాంటి విచారణ చేయకుండా అర్హత లేని కంపెనీలకు నెయ్యి టెండర్లు అప్పగించి రూ.235 కోట్ల స్వామి వారి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో హిందూ దేవుళ్లపై, పూజారులపై దాడులు చేశారన్నారు. వేంకటేశ్వరస్వామి మహా ప్రసాదాన్నే కల్తీ చేశారంటే ఈ దుర్మార్గులు తల్లి పాలను కూడా కల్తీ చేయకుండా ఉంటారా అని యరపతినేని విమర్శించారు.

## జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం

గురజాల, జనవరి 29 ప్రభాతవార్త : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక కోర్టులో గురువారం పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి న్యాయ వాదులు సహకరించాలని కోరారు. ఇరువర్గాలు రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.




ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, సెక్రటరీ చలమరాజు, న్యాయవాదులు షేక్ జానీబాషా, సూర్యరాజు, సీహెచ్ రామిరెడ్డి, హనుమంతురావు, కెవి నాగార్జున, లక్ష్మీ, శ్యామలాదేవి, చెన్నకేశవరావు, సురేష్, మస్తాన్, నాగలక్ష్మి, కర్రా చిన్న కోటేశ్వరరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

## పిన్నెల్లి సోదరుల విడుదల కోరుతూ గ్రామాల్లో ప్రత్యేక పూజలు

విజయపురిసౌత్, జనవరి 29 ప్రభాతవార్త: పిన్నెల్లి సోదరుల విడుదల కోసం పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయపురిసౌత్ గ్రామ అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తాళ్లపల్లి, ఏకోనాంపేట, నారాయణరెడ్డిపురం, కొప్పునూరు, భైరవునిపాడు గ్రామాల్లోని పలు ఆలయాల్లో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా అధ్యక్షురాలు లాకా వెంకటరమణ, ముస్లిం మైనార్టీ నాయకులు ఇస్మాయిల్, మత్స్యకారుల మాజీ ప్రెసిడెంట్



మునలయ్య, సుమన్, అప్పలస్వామి, కృష్ణారెడ్డి, సాగర్‌బాబు, మస్తాన్, మల్లె శ్రీను, రమేష్, మట్టపల్లి బ్రహ్మం, కేశవ, సునీల్, ఫణి, బంగారుచిట్టి, లక్ష్మీనారాయణ, జుబేర్, ఏకోనాంపేట మాజీ సర్పంచ్ పెద్ద మంత్రునాయక్, తాళ్లపల్లి మాజీ సర్పంచ్ జూకూరి వెంకట్రాయ్య, చిన మంత్రునాయక్, జింకల వెంకటేశ్వర్లు, తల్లా రామయ్య, తల్లా బ్రహ్మయ్య, బాణావత్ రాజునాయక్, స్వామినాయక్, యంద్ర గాలయ్య, ఈశ్వరయ్య, కొండ కృష్ణ, శేఖర్, చక్రి, అంజయ్య, పుట్టా బ్రహ్మయ్య, శ్రీనివాసరెడ్డి, హనిమిరెడ్డి, ఆకులపల్లి రమేష్, ఆకుపల్లి సామేలు, కలివెల మోషే, బొనిగె జయరావు, కలివెల కోటేశ్వరరావు (ఇంద్ర), కార్యకర్తలు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ ప్రసారం కల్తీపై సిట్ దర్యాప్తు నిగ్గుతేల్చింది: కన్నా

సత్తెనపల్లి, జనవరి 29, ప్రభాతవార్త: గతంలో మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తిరుపతిలో జరిగే కల్తీ లడ్డు వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేశామని,. నాడు మేము చెప్పినట్లు గానే.. నేడు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు నిగ్గ తేల్చిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నెయ్యిలో కల్తీ జరిగిందని, ఆ కల్తీ నెయ్యితోనే స్వామివారికి ప్రసాదాలు తయారు చేశారని శీఘ్ర దర్యాప్తు, ఛార్జ్ షీట్ ల ద్వారా బట్టబయలైందన్నారు. వైసీపీ



నేతలు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. దేవదేవుడి ప్రసాదం విషయంలో జరిగిన ఈ మహా కల్తీ గుట్టు రట్టయిందని, తాము ఏ తప్పూ చేయలేదు అని అన్న వైసీపీ నాయకుల ముఠా ఇప్పుడు ఏమంటారన్నారు. కనీసం చుక్క పాలు లేకుండా పూర్తిగా రసాయనాలతో నెయ్యిని తయారు చేసి కోట్లాది లడ్డూలు సరఫరా చేశారని, ఇలాంటి అభూత ఇన్నోవేషన్ కు వైసీపీ ముఠాకు నోబెల్ కెమిస్ట్రీ అవార్డు ఇవ్వాల్సిందే అని వ్యాఖ్యానించారు, వైసీపీ ఐదేళ్ళ పాలనలో మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా, అందులో 60 లక్షల కిలోలు కల్తీ నెయ్యితో 20.01 కోట్ల శ్రీవారి లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారుచేశారు.. మహాపాపం చేశారన్నారు. చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాల్లో 2019 నుంచి 2024 మధ్య ఐదేళ్లలో రూ.4.69 కోట్లు జమ కాగా అందులో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించారని,. ఎవరి ఖాతాలకు పంపారో తెలియజేయాలన్నారు. రాజకీయ దుర్బుద్ధితో మత విశ్వాసాలను రెచ్చగొట్టారని, ఇప్పటికైనా కల్తీగాళ్ళు తప్పు తెలుసుకుని స్వామివారిని క్షమాపణ అడిగితే బాగుంటుంది... లేకపోతే వాళ్ళ పాపానికి నిష్కృతి లేదని కన్నా వ్యాఖ్యానించారు.

## శ్రీ ఫిరోజి ఋషింధ్రుల బ్రహ్మోత్సవం

సత్తెనపల్లి, జనవరి 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని 6వ వార్డులో ఉన్న శ్రీ ఫిరోజి ఋషింద్రుల స్వామి వారి 137వ వార్షిక బ్రహ్మోత్సవముల కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల



సుధీర్ భార్గవ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా పట్టణ మండల గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఋషింధ్రుల ఆరాధన మహోత్సవాలు



సత్తెనపల్లి, జనవరి 29, ప్రభాతవార్త: పట్టణంలో ఋషింద్రుల 137 ఆరాధన మహోత్సవాలు ప్రారంభించారు. తొలిరోజు గురువారం విశేషాలంకరణలో ఫిరోజి ఋషింద్రులు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా సత్తనపల్లి పట్టణంలోని ప్రధాన వీధుల్లో స్వామివారి రథం ఊరేగింపు జరిపారు.

## కొండవీడు అభివృద్ధితో గ్రామాల అభివృద్ధి : ప్రత్తిపాటి



యడ్లపాడు, జనవరి 29, ప్రభాతవార్త : కొండవీడు కోటకు పూర్వ వైభవం వస్తే.. దాని చుట్టుపక్కలున్న అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఈ రెండు అంశాలు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని, అలానే సమీపగ్రామాల్లోని భూముల ధరలు పెరుగుతాయని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గ్రామస్థాయి నాయకత్వం ఎప్పుడూ ఒకే తాటిపై నిలవాలని, బహునాయకత్వంతో ప్రజలకు, గ్రామాలకు నష్టమే జరుగుతుందన్నారు. ప్రజలకోసం చేసే మంచిని అందరూ మనస్ఫూర్తిగా స్వాగతించాలి గానీ, అభిప్రాయబేధాలతో వ్యవహరించకూడదన్నారు. మండలం సొలస గ్రామం నుంచి నాదెండ్ల మండలం చిరుమామిళ్ల వరకు రూ 1.40 కోట్లతో వేయనున్న బీటీ రోడ్డుకు ప్రత్తిపాటి గురువారం శంకుస్థాపన చేశారు. అలానే సొలసలోని ఎంపీపీ పాఠశాల చుట్టూ రూ.15 లక్షలతో నిర్మించే ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చిరుమామిళ్ల వరకు వేసే బీటీ రోడ్డు మార్చినాటికి పూర్తయ్యేలా చూడాలని ప్రత్తిపాటి అధికారుల్ని ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరగడానికి వీల్లేదన్నారు. అనంతరం గ్రామస్తుల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్తా..నాయకుడు క్రమశిక్షణ, పట్టుదలతో ప్రజలకోసం పనిచేయాలని, ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటూ వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచే గ్రామ, మండలస్థాయి నాయకులు సమర్థవంతగా పనిచేస్తే ప్రజలు ఎప్పుడూ టీడీపీ పక్షానే ఉంటారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. నిజాయితీ, నిబద్ధతతో పాటు.. క్రమశిక్షణ పట్టుదలతో ప్రతి కార్యకర్త, నాయకుడు సుశిక్షితులైన సైనికుల్లా ప్రజలపక్షాన పనిచేయాలన్నారు. సొలస నాయకులైన వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు రామలక్ష్మణుల్లా గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నారని ప్రత్తిపాటి ప్రశంసించారు. సొలస గ్రామస్తులు కోరిన అన్నిరకాల అభివృద్ధి పనుల్ని కూటమిప్రభుత్వంలోనే పూర్తిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీ భవనం, మరో బ్రిడ్జి, రెండు డొంకల నిర్మాణ పనుల అంచనా వ్యయాలు తయారుచేయాలని ప్రత్తిపాటి గ్రామనాయకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, జవ్వాజి మదన్ మోహన్, కందిమల్ల రఘురామారావు, మద్దూరి శ్రీనివాస రెడ్డి, పోపూరి వెంకయ్య, ముద్దన నాగేశ్వరరావు, మద్దినేని శివరామకృష్ణ, పిచ్చి రెడ్డి, రామి రెడ్డి, ఏఈ బాలకుమార్, ఎంపీడీవో వి హెమలతాదేవి, తహశీల్దార్ విజయశ్రీ, అధికారులు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగవద్గీత అర్థ శతాబ్ది ఉత్సవాలు



మాచర్ల, జనవరి 29 ప్రభాతవార్త: భగవద్గీత అర్థ శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 23 నుంచి 28 వరకు ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు గీతా గురూజీ పందిరి శ్రీశైలం, కాశీ విశ్వనాథస్వాములు పేర్కొన్నారు. స్థానిక డీఎస్ఆర్ కల్యాణ మండపంలో సర్వజీవ శ్రేయస్సు సర్వలోక శాంతి కోసం గీతా తత్వ బ్రహ్మజ్ఞాన యజ్ఞం నిర్వహించామన్నారు. భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రేరణతో 8 గ్రంథాలు రచించినట్లు వివరించారు. ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. భగవద్గీత చదవడం వల్ల ప్రేమ, దయ, కరుణ, భక్తి, మనశ్శాంతి, సత్ ప్రవర్తన, సద్గుణాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార మండలి సభ్యులు ముప్పవరపు సీతాదేవి, గాంధీ, బీఎల్ చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాటి ప్రజానాయకుడు జూలకంటి నాగిరెడ్డి: వర్ధంతి కార్యక్రమంలో నేతలు

వెల్దుర్తి, జనవరి 29 ప్రభాతవార్త: పల్నాటి ప్రజా నాయకుడు, దార్శనికులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా తమ అడుగులు పడుతున్నాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం వెల్దుర్తిలో జరిగిన నాగిరెడ్డి వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాచర్ల



నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం తన తండ్రి నాగిరెడ్డి అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## హిందూ ధర్మంపై జగన్ సర్కార్ దాడి - ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం

వెల్దుర్తి, జనవరి 29 ప్రభాతవార్త: గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సనాతన హైందవ ధర్మానికి తీవ్ర విఘాతం కలిగిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఆయన ప్రధానంగా స్పందిస్తూ, కల్తీ, నకిలీ వస్తువుల సృష్టిలో జగన్ ప్రపంచస్థాయి గుర్తింపు పొందారని ఎద్దేవా చేశారు. నెయ్యికి బదులు కెమికల్స్ వాడి లడ్డూలు తయారు చేసి భక్తుల మనోభావాలతో ఆటలాడారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీ, దౌర్జన్యాలపై కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా పూర్తిస్థాయి విచారణ జరుపుతుందని స్పష్టం చేశారు. విచారణ భయంతోనే వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ కోసం పరుగులు తీస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి శవరాజకీయాలు పక్కనపెట్టి తాను చేసిన తప్పులను ఒప్పుకుని చట్టం ముందు లొంగిపోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## అక్రమ కేసులు సరికాదు: వైకాపా నాయకులు

### బెయిల్ రావాలంటూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కారంపూడి, జనవరి 29 ప్రభాతవార్త: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని కారంపూడి పట్టణ వైసీపీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య అన్నారు. గురువారం వైసీపీ నేతలు కారంపూడిలోని వీర్ల అంకాలమ్మ దేవాలయం, పేటసన్నెగండ్ల గ్రామ శివారులోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, ఒప్పిచర్లలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, చింతపల్లిలోని జనార్ధన స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన జంట హత్య కేసులో రామకృష్ణారెడ్డి,



వెంకటరామిరెడ్డిలకు ఎలాంటి సంబంధం లేకపోయినా కక్ష సాధింపు చర్యలతో కూటమి ప్రభుత్వం పకట్బంధీగా కేసులు పెట్టి జైలుపాలు చేశారన్నారు. నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, సీనియర్ నాయకులు షేక్ అక్బర్ జానీబాష, జడ్పీటీసీ షేక్ షఫీ, యూత్ మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, వేముల లింగయ్య, మర్రి శేషయ్య, గుండెబోయిన శివ, బొంగూరి నాగేశ్వరరావు, బత్తుల బైరాగి, పంగులూరి చిన్న వెంకట నరసయ్య, పంగులూరి రామకృష్ణయ్య, ఉన్నం శంకర్, వసంత కొండ, తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1న షిరిడిసాయి సత్యసాయి 20వ వార్షికోత్సవం



కారంపూడి, జనవరి 29 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలోని ఆర్యవైశ్య వీధిలోని శ్రీశిరిడీ సాయి సత్యసాయి మందిరం 20వ వార్షికోత్సవం ఫిబ్రవరి 1న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెచ్చా వరలక్ష్మణరావు, తుమ్మేపల్లి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. దేవాలయంలో సుప్రభాత సేవ, నగర సంకీర్తన, గణపతి పూజలు జరుగుతాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేయనున్నారు. సత్యసాయి బాబా 100వ జయంతి సందర్భంగా విద్యార్థులకు డ్యూటీ ఇన్ గాడ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. వార్షికోత్సవంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఘనంగా వడ్డవల్లి శ్రీవారి ఆలయ 21వ వార్షికోత్సవ వేడుకలు

సత్తెనపల్లి,జనవరి 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో కూరగాయలు మార్కెట్ వద్ద ఉన్న శ్రీ రామాలయంశ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 21వ వార్షికోత్సవ సందర్భంగా లక్ష తులసి దళాలతో పూజా కార్యక్రమా ప్రత్యేక అలంకరణ ఘనంగా నిర్వహించారు.. వడ్డవల్లి శ్రీవారిని లక్ష తులసి దళాలతో పూజించి శ్రీవారిని ప్రత్యేక అలంకరణ తిలకించేందుకు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయం కమిటీ మాట్లాడుతూ వడ్డవల్లి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి 21 వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం 6 వ రోజు ఉదయం 7 గంటలకు స్వామి వారికి అభిషేకాలు ఉంటాయని ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకుని ఘనంగా నిర్వహించే శ్రీవారి వార్షికోత్సవంలో పాల్గొని పార్తులు కాగలరు అని అన్నారు..



# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిజెపిని గెలిపించాలి

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, స్కాంల విషయంలో కాంగ్రెస్ - బిఆర్ఎస్ పార్టీల మధ్య తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహార శైలి ఒకే విధంగా కొనసాగుతు న్నాయన్న విషయం స్పష్టంగా కనిపిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

బిఆర్ఎస్ పాలనలో గొర్రెల పంపిణీ స్కాం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఆ స్కాంపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ జరగడం లేదు. నైని కోల్ బ్లాక్ విషయంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన అదే కాంట్రాక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని, కేవలం కాంట్రాక్టర్లు, మంత్రివర్గం మారాయి తప్ప కమిషన్ల విధానం మాత్రం అలాగే కొనసాగుతుందని, ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో కూడా నిజమైన విచారణ జరగడం లేదన్నారు. గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంల విషయంలో ఒకే ధోరణితో వ్యవహరిస్తున్నాయన్న విషయాన్ని ప్రజలు గమనించాలి. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాంలపై 100 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, కెసిఆర్‌ని జైలుకు పంపిస్తామని, అక్కడే డబుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తామని మాటలు చెప్పారు. కానీ ఇప్పుడు కేవలం సిట్ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ, ప్రధాన నిందితులను కాపాడుతున్నారు తప్ప ఏ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అన్నారు.

కాళేశ్వరం స్కాం సహా అన్ని అవినీతి కేసులపై తన వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదు అన్నారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం వంటి అన్ని అవినీతి కేసులపై సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా బిజెపి లేదని కొందరు, బిజెపి మత పార్టీ అని మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. బిజెపికి పెరుగుతున్న ప్రజాధరణను అడ్డుకోవడానికే కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు ఇలాంటి నాటకాలు చేస్తున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గతంలో 163 సర్పంచ్ స్థానాలు మాత్రమే గెలిచిన బిజెపి, ఇటీవలి ఎన్నికల్లో సుమారు వెయ్యి సర్పంచ్‌లు, పదివేల వార్డు మెంబర్లు, 1200 ఉపసర్పంచ్ స్థానాలను గెలుచుకుందన్నారు. బిఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీల దోపిడీ విధానం ఒకటే. ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒకేవిధంగా ఉన్నాయి.

అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి, బిజెపిని గెలిపించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి, ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, విఠల్, కప్పర ప్రసాద్, సునీతలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తున్న కాంగ్రెస్

### బిజెపి ముఖ్య అధికారప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారాయని బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇచ్చిన ఓటు తీర్పును బహిరంగంగా అపహాస్యం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో పాటు ఒకదాని తర్వాత ఒకదాన్ని కొట్టివేయడం ద్వారా ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తుందని మండిపడ్డారు. ఇది ప్రజల ఓటు విలువను నాశనం చేసే ప్రమాదకర ధోరణి అరిచ సుప్రీంకోర్టు ప్రకటనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. పదే పదే స్పీకర్‌కు గడువులు ఇవ్వడం, చివరికి ఇది చివరి అవకాశం అని హెచ్చరించడం ద్వారా, అత్యున్నత న్యాయస్థానం స్పీకర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు సూచించింది. ఇది తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రాజీవ్‌గాంధీ హయాంలో వచ్చిన యాంటీడిఫెక్షన్ చట్టాన్ని స్వయంగా ఉల్లంఘిస్తున్నారని, 1985లో 52వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ 12 మంది ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చింది. ఇప్పుడు స్వయంగా అధికారంలోకి వచ్చిన తర్వాత, 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ 10 మంది ఎమ్మెల్యేలు మేము ఇంకా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే' అని చెప్పడం, కానీ పార్టీ కోర్ కమిటీ సమావేశాలకు పిలవకపోవడం, అధికారిక కార్యక్రమాల్లో కనిపించకపోవడం, ప్రజలకు మభ్యపెట్టే చర్య మాత్రమే అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తమ పదవిని రాజీనామా చేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలి. ప్రజల ఓటు తీర్పు కోరాలన్నారు.

## మేడారం భక్తులకు ఆర్టీసీ మెరుగైన రవాణా సేవలు

### ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండేళ్లకొకసారి నిర్వహించే అతిపెద్ద గిరిజన జాతర మేడారానికి వెళ్లే భక్తుల కోసం ఆర్‌టిసి సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు పోటెత్తే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌టిసి ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక రవాణా ఏర్పాట్లతో సేవల్ని అందిస్తోంది. ఆర్‌టిసి సంస్థ ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలి సంస్థ వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి యంత్రాంగం చేప ట్టిన రవాణా సౌకర్య సేవల్ని గురువారం స్వయంగా పరిశీలించారు. ఉప్పల్ నుంచి మేడారం వెళ్లే దారిలోని కొన్ని ప్రధాన పాయింట్లను పర్యవేక్షి ంచారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల పిల్లల భద్రత కోసం ఉప్పల్ బస్టాప్, హన్మకొండ బస్టాండులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షి త కేంద్రాలలో పిల్లలకు గుర్తింపు ట్యాగులను వేస్తున్న విధానాన్ని పరిశీలించి.. స్వయంగా పిల్లలకు ట్యాగులు వేశారు. మేడారం వెళ్లే సమయంలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ఈ సురక్షి త చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. హన్మకొండ బస్టాండులో క్యూలైన్లను పరిశీలించి అక్కడ ప్రయాణికులతో మాట్లాడుతూ రవాణా సేవలను అడిగి తెలుసు కున్నారు. సౌకర్యవంతమైన రవాణా సేవలకై ఆర్‌టిసి తీసు కుంటున్న చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఎండీ నాగిరెడ్డితో పాటు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 14 లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజులు బకాయిలు 800 కోట్లు వెంటనే చెల్లించాలని, వంద బిసి కళాశాల హాస్టళ్లు, 119 బిసి గురుకులాలు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ చేస్తూ అనేకమంది విద్యార్థులు గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు బిసి నాయకుడు మోదీ రాందేవ్ నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నాలో ముఖ్యఅతిధిగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ య్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, ఫీజులు కట్టమని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై వత్తిడి చేస్తు న్నారని, హాల్ టిక్కెట్లు, సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, విదేశాల్లో చదువు కోవడానికి అవకాశం వచ్చినప్పటికి వారికి సర్టిఫికేట్లు లేక వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజుల బకాయిల, స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## స్ఫూర్తిదాయకం..'తెలుగుజాతికి భూషణాలు'

### తెలుగు వెలుగులను పరిచయం చేసిన ఉత్తమ గ్రంథం: వెంకయ్యనాయుడు



తెలుగుజాతికి భూషణాలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రమణాచారి, పద్మనాభయ్య, పార్వతీశం, రఘురామ్ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 29, ప్రభాతవార్త :** భారతదేశ అత్యున్నత పురస్కారాలైన భారతరత్న, పద్మ అవార్డులు పొందిన తెలుగువారి జీవిత సంగ్రహమే డా. రేవూరు అనంత పద్మనాభ రావు రచించిన తెలుగుజాతికి భూషణాలు గ్రంథ మని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ భూషణాల వివరాలు వార్తాపత్రికల్లో కొంత వరకు వచ్చినా వివరంగా రాదు కనుక ఈ గ్రంథం వారి జీవితాలు, వారు చేసిన మంచిపనుల గురించి విశ్లేషించిన తీరు అభినందనీ యమని, ఈ గ్రంథం ఎంతగానో ఉపయుక్తంగా, మార్గదర్శిగా, స్ఫూర్తిదాయకం గా ఉంటుందని, ప్రతీఒక్కరూ తప్పక చదివి తెలుసుకోవాలని, ఇతరులకు అందించాలని ఆయన సూచించారు. అనంత పద్మనాభరావు 80 యేళ్ల వయస్సులోని ఎన్నో అనుభవాలు, నేర్చుకున్న అంశాలు, పొందిన విజ్ఞానాన్ని ఇతరులతో పంచుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్న స్ఫూర్తిని తన రచనల ద్వారా చక్కగా పాటించారన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తుల నుండి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు.

నేటితరం సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల బారి నపడి విచక్షణ, విజ్ఞానాన్ని కోల్పోయి నానా అనర్థాలకు దారితీస్తున్న విషయం మనందరికీ విదితమేనని, ఈ తరుణంలో వీటిని సంస్కరించాల్సి న అవసరం ప్రభుత్వాలు, విజ్ఞానవంతులైన మనందరిపైనా ఉందని వెంకయ్యనాయుడు హితవు పలికారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేట్రస్ట్‌సంయుక్త ఆధ్వర్యంలోనబొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో గురువారంరాత్రి తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహా దారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన గ్రంథావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గౌరవ అతిథులు పద్మభూషణ్ కె.పద్మనాభయ్య, డా. ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్ డా. రేవూరు అనంతపద్మ నాభరావు అసీతిని పురస్కరించుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తెలుగుజాతికి భూషణాలు గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ముందుగా గ్రంథ రచయిత అనంతపద్మనాభ రావు, శోభాదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా. రేవూరు అనంతపద్మ నాభరావు సమగ్ర సాహిత్య పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ పర్యవేక్షణ లో థీసీస్ ప్రతిని వేదిక మీదున్న అతిథులకు గౌరీశంకర్ సమర్పించారు. అనంతరం కె.పద్మ నాభయ్య తదితరులు ప్రసంగించారు. అనంత పద్మనాభరావు తన స్పందనను తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలన్నీ జనాభా ప్రకారం సీట్లు ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఐఎఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, బైరి శేఖర్ తదితరులు

**జనరల్ స్థానాల్లోనూ బిసిలు పోటీ చేయాలి**

**బిసి ఇంటలెక్చువల్ ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు**

**బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజుగౌడ్**

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బిసి లకు జనాభా దామాషా ప్రకారం బిసిలకు 56శాతం స్థానాలు కేటాయించాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల ద్రోహి పార్టీలుగా చిత్రీకరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లోనూ ఈ పార్టీలకు బిసిలు ఓట్లు వేయొద్దని ప్రచారం చేస్తామని తెలిపారు. బిసిలు 56 శాతం ఉన్నారని లెక్కలు చెప్పడం, 42 శాతం రిజర్వే షన్లు ఇస్తామని హామీనివ్వడం తర్వాత ఇష్టానుసారంగా రిజర్వేషన్లు తగ్గించు కొంటూపోతే బిసి సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు. గురువారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి పొలిటికల్ ఫ్రంట్, బిసి ఇంటలెక్చువల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్.దుర్గయ్యగౌడ్ ఆధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఫ్రంట్ చైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, ఎలికట్టే విజయకుమార్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు.

ఒకవైపు తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద మేడారం జాతరకు ప్రజలంతా వెళ్తే మరోవైపు మున్సి పల్ ఎన్నికల నోటిఫికేషన్ 28 నాడే ఇచ్చి, 29 నుంచే నామినేషన్లు అనడం సరికాదన్నారు. సర్పంచ్ ఎన్నికల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లోనూ జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సి, ఎస్టిలను కలుపుకొని బిసిలు ముందుకెళ్లి, బహుజనవాదాన్ని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం అంటూ వందల కోట్లు ఖర్చుతో కులగణన చేసి లెక్కలను ఇంతవరకు బయట పెట్టలేదన్నారు.

గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిసిలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ మూడు పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో బిసిలు బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బాలరాజు గౌడ్ మాట్లాడుతూ అధికారంలో లేని రాష్ట్రాల్లో జనగణనలో కులగనన చేస్తామని మాట ఇచ్చి అధికారం చేపట్టగానే కులగన బీసీ కులగననపై లేనిపోని షరతులు పెడుతూ బిసి లను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మామ మోతె కృష్ణారెడ్డి ఆకస్మిక మృతి

**హైదరాబాద్ (మలక్‌పేట), జనవరి 29, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీ మణి కావ్య తండ్రి మోతె కృష్ణారెడ్డి(86) గుండెపోటుతో గురువారం కన్ను మూ శారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయన ఉద్యోగరీత్యా నగరానికి వచ్చి మలక్‌పేట పల్టాన్‌లో స్థిర పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ ప్రింటింగ్ ప్రెస్‌లో సీనియర్ లీడర్‌గా పనిచేసి 1995లో పదవీ విరమణ చేశారు. రెండు రోజుల క్రితం హైదర్‌గూడా అపోలో హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 11.53 గంటలకు గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. కృష్ణారెడ్డికి భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలు విజయభారతి, కావ్య, కుమారుడు శ్రీనివాసరెడ్డి ముగ్గురు సంతానం ఉన్నారు. శుక్రవారం ఉద యం 11 గంటలకు అంబర్‌పేట స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిం చనున్నట్లు కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మోతె కృష్ణారెడ్డి (ఫైల్)

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. ఫిర్యాదుల కోసం టిఇ-పోల్ యాప్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 29:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం టిఈ-పోల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్య లుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే టిఎస్ఈసీ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించేందుకు అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## సింగరేణికి 'బేకన్ ఆఫ్ హోప్' అవార్డు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** సామాజిక భాధ్యత కార్యక్రమాలకు గాను సింగరేణికి బీకన్ ఆఫ్ హోప్ అనే అవార్డును పొందింది. సింగరేణి సంస్థ గత ఐదేళ్ల కాలంలో కొత్తగూడెం జిల్లాలో 15 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి ప్రజోపయోగమైన అనేక పనులను చేపట్టింది. భద్రాచలం ట్రైబల్ భవన్ లో జరిగిన సీఎస్ఆర్ సమిట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ అవార్డును సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ జి.వెంకట కిరణ్ కుమార్, సీఎస్ఆర్ అధికాగట్టు స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సేవలను కలెక్టర్ ప్రశంసించారు. ఈ జిల్లాలో అత్యధిక సీఎస్ఆర్ పనులు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సంస్థకు బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా సింగరేణి సంస్థ అన్ని జిల్లాల్లోనూ కోట్లాదిరూపాయలు వెచ్చించి కనీస మోలిక సదుపాయాల కల్పనకు మరియు విద్యా, వైద్యాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కోసం 5న చలో ఢిల్లీ

### పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ మిన హాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు గురువారం ఆవిష్కరించాయి. గురువారం పిఆర్‌టియు టిఎస్ కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ గోడపత్రిక(పోస్టర్)ను విడుదల చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనం నిలిపివేసి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలనే పలు డిమాండ్లతో జాతీయ ఉపాధ్యాయ ఫెడరేషన్ల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉపాధ్యా యులు అందరూ ఫిబ్రవరి 5న ఉదయం 10 గంటలకు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవాలని సూచించారు. జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పార్లమెంట్‌సభ్యులు, వివిధ జాతీయ సంఘాల నాయకులు పాల్గొంటార న్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్ఐ ప్రధాన కార్య దర్శి చావ రవి, ఎఐఎస్టిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి సదానందం గౌడ్, పిఆర్‌టియు టిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి దామోదర్ రెడ్డి, ఎస్ బిక్షం గౌడ్, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, పిటిఎ టిజి అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి, డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి, పిటిఎ టిజి అధ్యక్షుడు కె మల్లికార్జున రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, టిఆర్టిఎఫ్ అధ్యక్షుడు కటకం రమేష్, ఎఐటిఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజీబ్, ముంతాజ్ అలీ పాల్గొన్నారు.

# 12,751 గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ విస్తరణ



గురువారం సచివాలయంలో విభాగాల వారీగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు

## ఇంధన, వైద్య, పరిశ్రమలు, మైన్స్, ఐటీలపై సిఎస్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 29:** ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంధన శాఖ సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సి న చర్యలపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సిఎస్ ఆదేశించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సిఎస్‌కు వివరించారు. ఇగవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదిం చిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్‌నగర్, పరిగిలో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతిపై సిఎస్ సమీక్షి ంచారు.

వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో వరంగల్, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, న్యూఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాల్లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్యశాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్‌ఎస్ పథకం, వైద్యపరికరాల సరఫరా తదితర అంశాలపై సిఎస్ సమీక్షి ంచారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సిఎస్ ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిహెచ్ఎంసి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.

నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసిలకు సంబంధించిన సమావేశంలో ఐటీఈసీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సిఎస్‌కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈగవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీల్లో టిఫైబర్ విస్తరణపై సమీక్ష చేశారు. రాష్ట్రాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం,యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు.

30-1Pg 9_30-1Pg5.qxd 29/Jan/26 10:15 PM Page 1



# భారత్ ఆర్థికవృద్ధి 6.8 నుంచి 7.2%




## 'సవాళ్లు ఎదురైనా ఆగని వృద్ధివేగం

## పార్లమెంటులో ఆర్థికమంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే!

**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత్ స్థూలదేశీయోత్పత్తి వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.8 నుంచి 7.2శాతంవరకూ ఉంటుందని పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఆర్థికవ్యవస్థ పటిష్టమైన వృద్ధితో ఉందని, ఓపక్క సవాళ్లు, సుంకాలు, ప్రపంచదేశాల్లో అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ వృద్ధి వేగవంతంగా ఉందని సర్వేలో ఉటంకించారు. ద్రవ్యోల్బణం చరిత్రాత్మక కనిష్టస్థాయిలను నమోదుచేస్తోందని, విదేశీ జమలు కూడా పెరుగుతున్నాయని, ప్రైవేటు పెట్టుబడులు కూడా మార్గదర్శకంగా వస్తున్నట్లు సర్వేలో వెల్లడించారు. కుటుంబీకులు, సంస్థలు, బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టీలు పటిష్టంగా మారాయని, ప్రభుత్వ పెట్టుబడులు కూడా కార్యకలాపాలువ ఎంచేవిధంగా ఉన్నాయి. వినియోగం డిమాండ్ మరింత పెరుగుతోందని, ప్రైవేటు ఇన్వెస్టుమెంట్ దోరణులు మెరుగుపడుతున్నాయని ప్రస్తావించింది. మద్యకాలికంగాను, వార్షిక పద్ధతిలోచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని, దశలవారీగా వృద్ధి మరింత వేగవంతం అవుతుందని ప్రపంచ స్థాయిలో అనిశ్చితి పెరిగినా భారత్‌లో మాత్రం శక్తివంతంగా ఉందన్నారు. గడచిన కొన్నేళ్లుగా జరుగుతున్న సంస్కరణలు కార్పొరేట్, ఆర్థికరంగ బ్యాలెన్స్ షీట్లను పెంచిందన్నారు. పన్ను యంత్రాంగంలో మరింతగా పారదర్శకత రావడం, లీకేజిలు అరికట్టడానికి దోహదం చేసిందని తెలుస్తోంది. మధ్యకాలికంగాచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. ప్రపంచ వాణిజ్య వాతావరణానికి తోడు అమెరికా సుంకాల తంత్రం కూడా భారత్‌పై అంతగా పనిచేయలేదని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని సర్వేలో పొందుపరిచారు. దీనితో అన్ని అపోహలు తొలగిపోతాయని, ప్రపంచ వాణిజ్యరంగంలో భారత్ తిరుగులేనిస్థానంతో దూసుకుపోతుందన్నారు. ప్రస్తుతం అమెరికాతో జరకు గుతున్న సంప్రదింపులు మరింత వేగవంతం అయ్యాయని, ఎదురవుతున్న రిస్కులు పరిష్కరించుకోగలిగిన స్థాయిలోనే ఉన్నట్లు ఆర్థిక సర్వేలో ఉటంకించారు. ప్రభుత్వ విధివిధానాలతో అన్ని సవాళ్లను అధిగమించే స్థాయిలోమనదగ్గర బఫర్‌నిల్వ ఉంటుందనిప్రధాన ఆర్థికసలహాదారు వి అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక, బహుపాక్షిక వాణిజ్య ఒప్పందాలు, ఇండియా ఈయూ ట్రేడ్ డీల్ వంటివి భారత్‌ఆర్థికవృద్ధికి ఎంతో కీలకంగా మారతాయన్నారు. భారత్ ఎగుమతులకు అతి తక్కువ సుంకాలు ఇపుడుప్రపంచదేశాల్లో ఉంటాయని దీనివల్ల ఎగుమతి మార్కెట్లలో భారత్ వాటా మరింతపెరుగుతుందని చెప్పుకొచ్చారు. ఇక భారత్‌లోప్రతిభా నిపుణులకు కొదవలేదని, ప్రతిభావంతుల నైపుణ్యాలను వినియోగించుకోవడంతోపాటు భారత కార్పొరేట్‌రంగంలోను, ఐటి రంగంలో కృత్రిమమేధకు తగినంతగా ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఎఐ లీడర్‌గా భారత్ ఎదిగేస్థాయికి మనం వెళుతున్నట్లు ఆర్థికసర్వేలో వెల్లడించారు. ముందు సమన్వయం, ఆ తర్వాత సామర్థ్యం పెంపు అన్న బాటలో వెళుతున్నదని, అయితే ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను గౌరవిస్తూనే వ్యవస్థలు, సంస్థలు మార్కెట్లతో ఎఐని సమన్వయం చేసేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌నిలిచిందని ఎఐ విప్లవంతో మరింతగా మార్పులు చోటుచేసుకుంటాయని, ఎఐ రంగంలో గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదుగుతుందన్నారు. ఎంపికచేసిన రంగాలు, చిన్న, ఓపెన్ వైట్ మోడళ్ల వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కృషి జరుగుతోందన్నారు. బ్యాంకులు, వ్యవస్థలు, సంస్థలు, కుటుంబీకుల ఆదాయవనరులు సుసంపన్నంగా ఉన్నాయని, ప్రభుత్వ పెట్టుబడులు మరింతగా ప్రోత్సాహకరంగా ఉన్నాయని వివరించింది. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ కూడా పెరుగుతూ వస్తోందని, బయటినుంచి వచ్చే సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వ విధానాలున్నాయని, అందువల్లనే ఆర్థికవృద్ధి సత్వర వేగవంతం అవుతుందన్నారు.

రానున్న సంవత్సరంలో కన్స్యూమర్‌ప్రైస్ ఇండెక్స్ సిరీస్ ద్రవ్యోల్బణ అధ్యయనంపై ప్రభావం చూపిస్తాయని, ధరల మదింపునకు దోహదం చేస్తుందన్నారు.





### మహారాష్ట్ర పరిణామాలు

## డిసిఎంగా సునేత్ర పవార్!

### అజిత్ పవార్ స్థానంలో నియమించే అవకాశం

**ముంబయి,జనవరి 29:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో పవర్ గేమ్ మొదలైంది. ఎన్సీపీకి తదుపరి అధినేత ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు, అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం కలిసిపోతాయనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం పదవి కోసం పార్టీ నామినేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎన్సీపీ నేత, మహారాష్ట్ర ఎఫ్‌డీఏ మంత్రి నర్హరి జిర్వాల్ గురువారం మాట్లాడుతూ సునేత్ర పవార్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మరోవైపు, ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్ బల్, ధనంజయ్ ముండే, సునీల్ తట్కరేలు సునేత్ర పవార్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణంతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం నుంచి సునేత్రా పవార్‌ను పోటీలో దింపాలని ఎన్సీపీ భావిస్తోంది. ఇక పార్టీ కార్యక్రమాలను నడిపించడానికి ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ ముందుంటారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇదే విధంగా శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు కలిసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల, ఈ రెండు కూటములు కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశాయి. అజిత్ పవార్ ఎన్సీపీ రాష్ట్రంలో బిజెపి శివసేనతో కలిసి మహాయుతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. ప్రస్తుతం సునేత్రా పవార్ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. సునేత్రకు డిప్యూటి సిఎం పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌వద్దకు ఎన్సీపీ అజిత్‌వర్గం నేతలు మంత్రులు రాయబారం నడుపుతున్నారు. అలాగే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న ప్రఫుల్‌పటేల్ ఇకపై పార్టీకి పూర్తి కాలం బాధ్యతలునిర్వర్తించేవిదంగ ఆజిత్ వర్గం నేతలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈలోపు ఎన్సీపీలోని రెండు వర్గాలు ఒక్కటయ్యే ఛాన్స్ కూడా ఎ క్కువగా కనిపిస్తోంది. ఈ కోణంలోకూడా చర్చలు కొనసాగుతున్నట్లు పార్టీనేతలు చెపుతున్నారు.

## మితిమీరిన వినియోగంతో ధరలు పెరగనున్న యూరియా

### డిబిటితో రైతుల నష్టం భర్తీ :ఆర్థిక సర్వే

**న్యూఢిల్లీ,జనవరి 29:** వ్యవసాయరంగంలో విరివిగా వినియోగించే యూరియా ధరల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తుందని, దేశవ్యాప్తంగా రిటైల్ ధరల్లో కొంత వృద్ధి ఉంటుందని,అయితే ఆమొత్తం బ్యాంకు ఖాతాలకు ఎకరాకు స్పష్టమైన మొత్తం చొప్పున నేరుగా జమచేస్తారని ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఈ వ్యవస్థ కారణంగానే ధరల్లో పెరుగుదల కనిపించినా డిబిటద్వారా నేరుగా రైతులకు జమచేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, తద్వారా రైతుల్లో కొనుగోలుశక్తికూడా పెరుగుతుందని అన్నారు. అలాగేనైట్రెజెన్ ఎరువుల ధరలు కూడా మార్పులున్నప్పటికీ రైతులకు అందుబాటులోనే ఉంటుందని సర్వేలో పొందుపరిచారు. భారత వ్యవసాయరంగంలో కొన్ని అధునాతన ఒకడలు వల్ల సవాళ్లనుంచి అధిగమించగలుగుతారన్నారు. ఉత్పాదకత, ఆదాయవనరుల పెంపుపై ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సరిపడా లేని మార్కెటింగ్; స్టోరేజి మౌలికవనరులు, నాణ్యతా పరమైన ఇన్‌పుట్‌లకు పరిమితంగానే లభించడం, పెట్టుబడులు తక్కువస్థాయిలో ఉండటం, ఉన్నత ప్రమాణాలతో సేవలు అందుబాటులోకి రావాలిసన అవసరాన్ని నొక్కిచెప్పారు. పౌష్టిక ఎరువులు ఇతర ఎరువులకంటే కారుచౌకధరలకు అందుబాటులోకిరావాలని, భూప్రమాణాలు, సారవంతంగా నేలలు మార్చుకునేందుకు నిర్దిష్టప్రమాణాలతో శాస్త్రీయ విదానంలోఎరువుల వినియోగంపై చైతన్యపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.అయితే ఇందుకు ఎరువుల ధరలపై నిత్యం పర్యవేక్షణ కొనసాగాల్సి ఉంటుందని ఆర్థికసర్వేలో సూచించారు.



ఎరువుల కొనుగోలు వ్యయాన్ని రైతుల ఆదాయవనరులకు మద్దతిచ్చే రాబడులకు దూరంగా ఉంచాలని, వ్యవసాయ సంబంధిత వనరులపై కొరతను తీర్చాలని సర్వేలో సూచించారు. నైట్రోజెన్ వినియోగం ఇప్పటికే రైతుల్లో అవగాహణ పెరిగిందని, తక్కువ ధరలకు కొనుగోలుచేసినా పూర్తిసబ్సిడీ వారి ఖాతాలకు చేరుతుందన్న అవగాహణ రైతులకుండటం విశేషమన్నారు. భూపరీక్షలు, నానో యూరియా, ద్రవరూప ఎరువులు, సేంద్రీయ వ్యవసాయ సవరణలు వంటివి విస్తృతంగా అమలులోకి రావాలని సూచించింది. అలాగే డిజిటల్ వ్యవసాయ మౌలికవనరులు మరింతగా సంస్కరించుకోవాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతులకోసం ప్రత్యేక వ్యవసాయ వ్యవస్థను సృష్టించాలని, అద్దెమార్కెట్లకోసం సమయపాలిత సర్దుబాట్లను స్పష్టంచేయాల్సి ఉంటుందని ఈ కౌలువ్యవస్థ ప్రయోజనాలను అమలుకు ముందు విస్తృత స్థాయిలో సవరణలు అవసరమన్నారు. యూరియాను మితిమీరి వినియోగం కూడా అనర్థదాయకమని, రిటైల్ యూరియా ధరలు దశాబ్దకాలంగా పెరగలేదని, 2026లో సుమారు రూ.1.91 లక్షలకోట్లుగా ఉంటుందని, బడ్జెట్ అంచనాల్లో రూ.1.67 లక్షలకోట్లుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుత ఆరినతకసంవత్సరంలో యూరియా వినియోగం 40 మిలియన్ టన్నులుగా ఉందని, మరింతగా డిమాండ్ వచ్చిందని ఆర్థికసర్వేలో పొందుపరిచారు. వ్యవసాయ అనుబంధ సేవలు 2026లో 3.1శాతంపెరుగుతాయని అంచనా వేసారు. దీర్ఘకాలిక సగటు 4.5శాతంగా ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం అంచనా వేసింది. జంతు సంపద, మత్స్యశాఖలపరంగా కూడా ఐదునుంచి 6శాతం వృద్ధి ఉంటుందని వనయవసాయ జివిఎ మరింతగా వృద్ధిలోకి వస్తుందని తెలిపారు. రబీ నాట్లు ముమ్మరంగా పెరిగాయని, వాణిజ్యం, వ్యవసాయ రంగానికి ఇటీవలికాలంలో అనేక మార్పులు వచ్చాయని, వ్యవసాయరంగానికిగాను 2.17శాతం వృద్ధి ఉంటుందన్నారు.



## ప్రధాని మోడీతో దేవెగౌడ భేటీ

**- దేశాభివృద్ధితో పలు కీలక అంశాలపై చర్చ**

**బెంగళూరు, జనవరి 29 (ఐఏఎన్ఎస్):** మాజీ ప్రధాని, జెడి(ఎస్) అధినేత హెచ్.డి. దేవెగౌడ గురువారం ప్రధాని నరేంద్ర మోడీని కలిసి చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "హెచ్.డి. దేవెగౌడతో అద్భుతమైన సమావేశం జరిగింది. కీలక సమస్యలపై ఆయనకున్న అకుంటిత దీక్ష్ట ప్రశంసనీయం. భారతదేశ అభివృద్ధి పట్ల ఆయనకున్న అభిరుచి కూడా అంతే ప్రశంసనీయం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) కూడా ఈ విషయమై కన్నడ భాషలో ఒక పోస్టును పెట్టింది. ఈ పరిణామం కర్ణాటక రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేవెగౌడ, ఆయన కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి తమ స్వస్థలమైన హాసన్‌లో భారీ ర్యాలీ నిర్వహించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కొలంబియాలో కుప్పకూలిన విమానం..

### ఎంపి సహా 15 మంది మృతి




**లండన్, జనవరి 29:** కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ సటెనాకు చెందిన ఒక చిన్న విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త, ఎంపి డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకాన్యాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఫిబ్రవరి 27న ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటన

**- రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రతపై చర్చలు**



**న్యూఢిల్లీ, జనవరి 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఇజ్రాయెల్‌ను సందర్శించాలని ఇప్పటికే ప్రధాని మోడిని ఆ దేశం ఆహ్వానం పంపింది. రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రత, ఉగ్రవాద నిరోధక వంటి రంగాలలో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం పర్యటన లక్ష్యం. మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల ప్రారంభంలో చర్చలు జరిపారు, రెండు వైపులా ఉగ్రవాదంపై సున్నాసహన వైఖరిని పునరుద్ఘాటించినప్పటికీ, 2 నెలల్లో రెండవది. గాజా శాంతి ప్రణాళిక అమలు, పురోగతి గురించి నెతన్యాహు భారత పక్షానికి వివరించారు, అయితే ఈ ప్రాంతంలో న్యాయమైన, శాశ్వత శాంతి కోసం భారతదేశం స్థిరమైన మద్దతును పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే.

## ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ



**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పార్టీ అగ్రనాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్న క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలతో ఆయన భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో దాదాపు 30 నిమిషాల పాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. దీనికి ముందు థరూర్‌ను రాహుల్‌తో భేటీ గురించి విలేకరులు ప్రశ్నించగా అది జరగాల్సినప్పుడు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తన సొంత పార్టీ నాయకుడిని కలవడంలో అంత ప్రాధాన్యం ఏముంటుంది అని వ్యాఖ్యానించారు. సమావేశం అనంతరం థరూర్ మాట్లాడుతూ మా మధ్య చాలా సానుకూలమైన చర్చలు జరిగాయి. అంతా బాగుంది. అందరం ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని విలేకరులతో అన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. దీనికి అనేక విషయాలపై ఆత్మీకంగా, సానుకూలంగా చర్చించినందుకు ఖర్గే, రాహుల్‌గాంధీలకు ధన్యవాదాలు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని రాసుకొచ్చారు. గతేడాది ఆపరేషన్ సిందూర్ తర్వాత దౌత్యపరమైన సంబంధాలపై థరూర్ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించడం కూడా విమర్శలకు దారి తీసింది. పార్టీతో తనకు కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నాయని, అయితే పార్లమెంటులో పార్టీ నియమావళిని ఎప్పుడూ ఉల్లంఘించలేదని ఇటీవల థరూర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో తాజా భేటీ జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## వీధికుక్కల కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

**- వారంలోపు లిఖిత పూర్వక వాదనలు దాఖలు చేయండి**

**- కేంద్ర, రాష్ట్రాలకు త్రిసభ్య ధర్మాసనం ఆదేశం**

**న్యూఢిల్లీ, జనవరి 29:** వీధికుక్కల కేసులో అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన వాదనలు విన్న ఒక రోజు తర్వాత, సుప్రీంకోర్టు గురువారం వీధి కుక్కల కేసులో తన తీర్పును రిజర్వ్ చేసింది. కుక్కల ప్రేమికులు, కుక్క కాటు సంఘటనల బాధితులు, జంతు హక్కుల కార్యకర్తలు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తరపున హాజరైన న్యాయవాదులు సహా అన్ని వాటాదారుల వాదనలను వివరంగా విన్న తర్వాత కోర్టు విచారణను ముగించింది. విచారణ పూర్తయిన తర్వాత, సుప్రీంకోర్టు ఈ విషయంలో తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని పార్టీలు ఒక వారంలోపు తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. వీధి కుక్కలను క్రిమిరహితం చేయడానికి, కుక్కల పౌండ్లను ఏర్పాటు చేయడానికి, విద్య, ఇతర సంస్థల క్యాంపస్‌ల నుండి కుక్కలను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో అనేక రాష్ట్రాలు విఫలం.

## సంక్షిప్తంగా..

### ఇజ్రాయెల్ ప్రధాని ఫోన్‌కు రెడ్‌టేప్!



**టెల్‌అవీవ్,జనవరి 29:** ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తాను వినియోగిస్తున్న ఫోను వెనుకభాగంలోని కెమేరా ఒక రెడ్‌టేప్‌తో సీల్‌వేసి ఉన్న విడియో ఇపుడు నెట్‌లో వైరల్ అయింది. సోషల్‌మీడియాలో ఇందుకు సంబంధించి అనేక ఫోటోలు విడియోలువ ఐరల్ అయ్యాయి. ఇజ్రాయెల్‌పార్లమెంట్ నెస్సెట్ అండర్‌గ్రౌండ్ పార్కింగ్ వద్దనెతన్యాహు తన లగ్జరీ కారు వెనక నిలబడి ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడుతుండటం కనిపించింది. ఆయన కెమేరా లెన్సులు, ఫోన్ సెన్సార్లు మొత్తం ఒక దట్టమైన రెడ్‌టేప్‌తో కప్పి ఉన్నట్లు గుర్తించారు. తన ఫోన్‌ను సురక్షితంగా వాడాలనుకుంటే మరో ఫోన్ వాడతారని, ఇలా రెడ్‌టేప్‌లు ఎందుకు వస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అమెరికా ఔట్‌లెట్ హైప్‌ఫ్రెష్ ఈ రెడ్‌టేప్‌పై వివరణ ఇస్తూ నెతన్యాహు ఫోన్‌కు వేసిన రెడ్‌టేప్ ట్యాంపర్ కాకుండా ఉండే సీల్ అని హైసెక్యూరిటీ ప్రాంతాల్లో ఇదొక ప్రత్యేక స్టిక్కర్ అని వీటిని తరచూ వినియోగిస్తారని తెలిపింది.

### అనుమానాస్పద స్థితిలో సాధ్వి ప్రేమ్‌బైసా మృతి!



**జైపూర్;జనవరి 29:** రాజస్థాన్‌లో హిందూ మతప్రచారక్ బోధకురాలు సాధ్వి ప్రేమ్‌బైసా మరణం ఇపుడు రాజకీయాల్లో దుమారం రేపింది. ఆర్‌ఎల్‌పి నేత జాట్ శక్తివంతమైన నేత హనుమాన్ బేనివాల్ సిబిఐ దర్యాప్తుజరిపించాలని, ఆమె మరణం మిస్టరీని ఛేదించాలని డిమాండ్ చేయడంతో ఇపుడు మరింత ప్రచారంలోకి వచ్చింది. ప్రేమ్‌బైసాను జోద్‌పూర్‌లోని ఒక ్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బోరనాదా ఆశ్రమ్‌నుంచి ఆమె తండ్రి వీరమ్‌నాథ్ మరో సహాయకుని సాయంతో తీసుకురాగానే వైద్యులు ఆమె చనిపోయిందని ధృవీకరించారు. వైద్యుడు డాక్టర్‌ప్రవీణ్‌జైన్ మాట్లాడుతూ ఆమెను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలుచేసినా ప్రయత్నంలేదని, ఆమె శరీరంలో అసలు కదలికలు లేవని అన్నారు. ఆమెకు జ్వరం వచ్చిందని తండ్రి తెలిపారని, కాంపౌండర్, హెల్‌నతకేర్ నిపుణుడిని ఆశ్రమానికి పిలిపించినట్లు చెప్పారు.

### సైబర్ నేరాల మాఫియా.. 11 మందికి మరణశిక్ష అమలు



**బ్యాంకాక్, జనవరి 29:** 100 కోట్ల డాలర్లకుపైగా సైబర్ మోసాల ర్యాకెట్ నిర్వహించిన 11 మంది మైన్మార్‌కు చెందిన కుటుంబ క్రైమ్ సిండికేట్‌కు చైనా మరణశిక్ష విధించింది. వెన్‌ఝౌ సిటీ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు ఈ మరణశిక్షను గురువారం అమలుచేసింది. వెంఝౌసిటీ న్యాయస్థానం గత ఏడాది సెప్టెంబరులో 11 మందిని దోషులుగా తేల్చి అందరికీ మరణశిక్ష విధించింది. కుటుంబసభ్యుల అప్పీలును ఇటీవల తిరస్కరించి మరణశిక్ష అమలుచేయాలని ఆదేశించింది. ఈ మొత్తం 11 మందిని 2023 నవంబరులోనే అదుపులోకి తీసుకుని చైనా అధికారులు విచారించారు. సరిహద్దుప్రాంతాల్లో నిఘా పెంచి మైన్మార్‌తో పరస్పరం టెక్ సమాచారం పంచుకుంటూ కుంభకోణాలను కట్టడిచేయగలిగింది. ఈ 11 మందిలోమింగ్ గౌపింగ్; మింగ్‌ఝెన్‌ఝెన్‌లు కూడా ఉన్నారు. వీరే ఈ సైబర్‌క్రైమ్, గ్యాంబ్లిక్ కార్యకలాపాలకు కీలకమని కోర్టు నిర్ధారించింది.

### ఖమేనీని తొలగిస్తే అధికారం ఎవరికో!: మార్కొ రుబియో

**వాషింగ్టన్,జనవరి 29:** పశ్చిమాసియాలో అమెరికా యుద్ధనౌకల మొహరింపుక్రమంలో ఇరాన్‌పై ఏక్షణంలో అయినా దాడిజరగవచ్చన్న భయాందోళనలు పెరిగాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్కొ రుబియో మాట్లాడుతూ ఇరాన్ సుప్రీం లీడర్ అయుతొల్లా ఆలిఖమైనీని తలొగిస్తే అధికారి ఎవరిచేతుల్లోకి వెళుతుందో ఎవరికీ తెలియదన్నారు. సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ముందు ఇచ్చిన వాంగ్మూలంలో రుబియో ఈ వ్యాఖ్యలుచేసారు. ఇరాన్‌లో పాలన మార్పు తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నలకు రుబియో బదులిస్తూ అది ఒక బహిరంగప్రశ్న. ఎవరు అధికారంచేపడతారో ఎవరికీ తెలియదు. ఇరాన్ పాలన ఖమైనీ ఇస్లామిక్ రివొల్యూషనరీగార్డ్‌కార్ప్స్ తోపాటు ఎన్నికైన వ్యక్తులమధ్య విభజించి ఉంది. వారంతా చివరికి ఖమేనీ ఆదేశాలతోనే నడుచుకుంటారని అన్నారు.సుప్రీం లీడర్ పాలన పడిపోతే అక్కడ తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నకు జవాబు కష్టమేనన్నారు.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా సాగాలి - ఇసికి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 29:** తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీంకోర్టు గురువారం జోక్యం చేసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, సజావుగా సాగేలా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. ఈ మేరకు డిఎంకె దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు వెలువరించింది. ఏప్రిల్‌లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల జరగనుండగా.. ఎస్‌ఐఆర్ పేరుతో భారీగా ఓటర్లను తొలగించారని డిఎంకెకు చెందిన ఆర్‌ఎస్ భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్రంలోని ఎస్ఐఆర్ అనంతరం 97 లక్షల ఓట్లను తొలగించారు.. మొత్తం ఓటర్లలో దాదాపు 88 శాతం మంది అంటే 1.72 కోట్ల మంది ఓటర్లను "తార్కిక వ్యత్యాసాలు" పేరుతో జాబితాను తొలగించారని ఆయన ఆరోపించారు. పశ్చిమ్ బెంగాల్, కేరళలోనూ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సమగ్ర సవరణలకు సంబంధించిన ఫిర్యాదులను కూడా విచారిస్తున్న సర్వోన్నత న్యాయస్థానం.. ప్రభుత్వ కార్యాలయాలలో తార్కిక వ్యత్యాసాల జాబితాలోని ఓటర్ల పూర్తి జాబితాను ప్రచురించాలని, పేర్లు లేనివారు 10 రోజుల్లోపు సంబంధిత పత్రాలను సమర్పించడానికి అనుమతించాలని ఇసిని ఆదేశించింది. 'ప్రతి కలెక్టర్ ఇసి జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, ఎస్ఐఆర్ సజావుగా నిర్వహించడానికి సిబ్బందిని నియమించాలని తాము ఆదేశిస్తున్నాం" అని కోర్టు పేర్కొంది. అలాగే, శాంతిభద్రతల సమస్య లేకుండా ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిజిపి, పోలీస్ కమిషనర్లకు సూచించింది. ఎస్ఐఆర్ ఎక్కడ జరుగుతున్నా ఇసి ఈ ఆదేశాలకు కట్టుబడి ఉంటుందని తాము ఆశిస్తున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



# జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు

**గుంటూరు క్రైమ్, జనవరి29,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు సూచనలతో, దీగిది గుంటూరు, వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ చి. సింగయ్య , లీజు, గుంటూరు, వెస్ట్ ట్రాఫిక్ ఎస్ఐ నజీర్ సాహెబ్, ట్రాఫిక్ సిబ్బంది గురువారం లీగీతీ సెంటర్ వద్ద జాతీయ రహదారి భద్రతా మహోత్స వాలు,ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ కాలేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చి. సింగయ్య మాట్లాడుతూ "రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలి. మొబైల్ ఫోన్ వాడుతూ వాహనాలు నడపడం ప్రమాదాలకు దారి తీస్తుంది. మైనర్లు వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించాలి," అని తెలిపారు. విద్యార్థులు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు సులభంగా అర్థమయ్యే విధంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీటుబెల్ట్ అవసరం, మొబైల్ వాడకంతో వచ్చే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత వంటి అంశాలపై వివరించారు. **విద్యార్థులు,ప్రజలకు ఇచ్చిన ముఖ్య సూచనలు :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి,సీటుబెల్ట్ వినియోగించాలి, వాహనం నడుపుతూ మొబైల్ ఉపయోగించరాదు, మైనర్లు వాహనాలు నడపరాదు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి, రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని విద్యార్థులకు, ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించారు.




# ఉర్దూ పాఠశాలను తనిఖీ చేసిన ఉర్దూ ఉప తనిఖీ అధికారి ఎండి కాసిం

**గుంటూరు విద్య జనవరి 29 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని చౌత్ర సెంటర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు తల్లిదండ్రులు మరియు గ్రామస్తులసహకారంతో తమక్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న విద్యార్థులందరూ పాఠశాలలో చేరే విధంగా ఇప్పటినుండి ప్రణాళికను తయారు చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో చదవటం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు పొందవచ్చని తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్తు ఉందని,ఉర్దూ భాష నేర్చుకోవటం ద్వారా ప్రపంచం లోని ఏ దేశంలోనైనా వెళ్లేందుకు వీలు కలుగుతుందని అందువల్ల ప్రతి ఒక్కరు ఉర్దూ భాష నేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు ఈ సందర్భంగా పాఠశాలలోని అందరు విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నసీమ బేగం ఉపాధ్యాయులు జవ్వుల్ల ఖాన్, హబీబున్నిసా బేగం, బచ్చాబేగం మరియు సాజిదాఖానం తదితరులు పాల్గొన్నారు.



# పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**పెదనందిపాడు జనవరి 29 (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం గుంటూరు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖధికారి, డాక్టర్. ఎ. శ్రావణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిత పీహెచ్ సి లో అందుచున్న ఓపి సేవలు పరిశీలించారు. అలాగే ప్రతి రోగి వివరాలు సంబంధిత ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డు లో తప్పనిసరిగా పొందుపరిచే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో తప్పనిసరిగా కాన్పులు జరపవలెనని ఆదేశాలు జారీచేసారు. క్షేత్ర స్థాయిలో అమలు జరుగు చున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో సాధించిన ప్రగతి గురించి సమీక్షించారు. ఈ సమీక్ష లో పెదనందిపాడు మండల వైద్యాధికారి డాక్టర్. ఎస్. నందకుమార్ , సి హెచ్ ఓ ఎస్.ఆర్ ప్రసాద స్వామి, హెచ్ ఈ షేక్ సుజ, సిబ్బంది చెన్నయ్య, స్టాఫ్ నర్స్ షర్మిల, యూడిసి జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# మహాత్మా పూలే జయంతి నాడే స్మృతి వనం శంకుస్థాపన : కేసన శంకరరావు

**మంగళగిరి, జనవరి 29, ప్రభాతవార్త :** అమరావతిలో"మహాత్మ జ్యోతిబా పూలే స్మృతి వనం"నిర్మించనున్నట్లు వారి జయంతి ఏప్రిల్ 11న,సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొనడాన్ని హర్షిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల విజయవాడ గొల్లపూడి లోని బీసీ భవన్ లో బీసీల సమస్యలపై,పలు బీసీ సంఘాల నాయకులతో మంత్రి సవిత జరిపిన"బీసీ సదస్సు" లో తమ సంఘం తరఫున 23 ప్రధాన డిమాండ్లను వివరిస్తూ మెమోరాండం ఇచ్చామన్నారు. మా విజ్ఞాపన మేరకు మహాత్మా జ్యోతిబాపూలే స్మృతి వనం ఏర్పాటు గురించి సవితమ్మ స్పందన పై సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. తాము కోరినట్లు 28 జిల్లా కేంద్రాలలో"మహాత్మా పూలే బీసీ భవనాలు" నిర్మిస్తామని,బీసీ స్టడీ సర్కిళ్లు లేని జిల్లాలలో తప్పక ప్రభుత్వమే అన్ని హంగులతోపక్కా భవనాలు నిర్మిస్తామని తెల్పడాన్ని బీసీ సమాజం హర్షిస్తుందన్నారు. బీసీలు ఆత్మగౌరవంతో మన గలిగేలా రక్షణ చట్టంతో పాటు, బీసీ మరియు బీసీ కుల ఆర్థిక సంస్థల సహకారంతో పలు పథకాలు అమలు చేస్తున్న బడుగు బలహీన వర్గాల బాగు కోరుకునేది కూటమి ప్రభుత్వమే అన్న ఆమె మాటలు అక్షర సత్యాలన్నారు. అమరావతిలో ఐదు ఎకరములలో ప్రత్యేక బీసీ స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేస్తున్నామని, స్టడీ సర్కిళ్లు లేని జిల్లాలలో కూడా తప్పక ఏర్పాటు చేస్తామనడం సంతోషదాయకమన్నారు.



బీసీ యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలంటే సివిల్ సర్వీసెస్ మెగా డీఎస్సీ కోసం మరిన్ని ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఈసారి జనగణనతో పాటు"డెడికేషన్ కమిషన్"ద్వారా సమగ్రంగా కులగణన చేయించి, బీసీల లెక్కలు కచ్చితంగా తేల్చుతామన్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. బీసీల గణనతో సరిపెట్టక, సామాజికఆర్థిక రాజకీయ రంగాలన్నింటిలో రాయితీలు రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు అమలుపరచి, బీసీల సాధికారితకు రాష్ట్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

# హరే కృష్ణ గోకుల క్షేత్రంలో హరినామ జపయజ్ఞం

**మంగళగిరి, జనవరి 29, ప్రభాతవార్త:** భీష్మ ఏకాదశి అనే శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, గురువారం హరే కృష్ణ గోకుల క్షేత్రంలో భక్తి భావంతో కూడిన హరినామ జప యజ్ఞం ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమంలో వేలాది మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రేయస్సు, సంక్షేమం కోసం భక్తులు ఐక్యంగా 50 లక్షల పవిత్ర నామాల జపాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణమంతా మహా మంత్ర ధ్వనులతో మార్మోగింది: హరే



కృష్ణ, హరే కృష్ణ, కృష్ణ కృష్ణ, హరే హరే,హరే రామ, హరే రామ, రామ రామ, హరే హరే."ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని శాంతి, ఆధ్యాత్మిక ఉద్ధరణ కోసం జప యజ్ఞం చేశారు. ఈ హరినామ జప యజ్ఞం భీష్మ ఏకాదశి యొక్క అసలైన ఆత్మస్వరూపాన్ని ప్రతిబింబిస్తూ భక్తి, ఐక్యత మరియు నిస్వార్థ సేవ భావాలను ప్రతిఫలింపజేసింది. ఇలాంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించి, రాష్ట్ర ప్రజలకు దైవ అనుగ్రహాలను ప్రసాదిస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం సమస్త లోక కల్యాణం, శాంతి కోసం చేసిన ప్రార్థనలతో ముగిసింది.

# రోటరీ క్లబ్ వారి వృత్తి సేవ పురస్కార అవార్డులు అందజేత

**పెదనందిపాడు జనవరి 29 (ప్రభాతవార్త)** రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు వారు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలు రంగాల్లో శ్రద్ధ బాధ్యత నైపుణ్యం లతో విశిష్ట సేవలు అందిస్తున్న ఐదుగురు




వ్యక్తులను రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీర రాఘవయ్య. పెదనందిపాడు క్లబ్ అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు. కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు. రోటరీ రీజినల్ చైర్మన్ ఒకేషనల్ సర్వీసెస్ పోపూరి లక్ష్మీ ృనారాయణ. క్లబ్ సభ్యులు .వై రమణయ్య. నాళం పున్నారావు. పలు రంగాల ప్రముఖులు పోపూరి వెంకటప్పయ్య. బండారు రామారావు. పోపూరి రవి. చెన్నుపాటి సురేంద్ర. పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరమ్మ తదితరులు. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీర రాఘవయ్య మాట్లాడుతూ. ప్రతి ఏడాది జనవరిలో తమ రోటరీ క్లబ్ ల ద్వారా వివిధ రంగాల్లో సేవలు అందించే వ్యక్తులను గౌరవించడం సాంప్రదాయంగా వస్తుందని. నేడు పెదనందిపాడు లో పారిశ్రామిక రంగంతో పాటు స్థానిక సాయి మందిర్ లో 25 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమా లు నిర్వహిస్తూ. పెదనందిపాడు నుండి షిరిడి కి నడుచుకుంటూ వెళ్లి బాబా ఆశీస్సు లు పొందిన అరవపల్లి రామసుబ్బారావు ను. దాదాపు 30 మందికి పైగా తన రక్తదానంతో సేవలందించిన బొల్లాపల్లి బాజీ బాబును. అన్నపర్రు అభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న డెవలప్మెంట్ అధికారి అబ్బూరి అపర్ణను. స్వర్ణకార రంగంలో పలువురి అభిమానం సాధించిన పాటోజీ పూర్ణాచారిని. పత్రికా రంగంలో 1987 నుండి పనిచేస్తూ పలువురు పత్రికా ప్రముఖుల ఆశీస్సు లతో పాటు ప్రస్తుతం వార్తా విలేకరిగా పనిచేస్తున్న వి. నమశ్శివయ్య లను. తమ క్లబ్ తరఫున రోటరీ సేవా పురస్కార్ అవార్డులతో పాటు పట్టు శాలువులతో ఘనంగా సత్కరించటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తన ఆధీనంలోని వంద రోటరీ క్లబ్బుల సేవా కార్యక్రమాలలో పెదనందిపాడు రోటరీ క్లబ్ కు మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులను వారు ప్రశంసించారు.

# విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించిన డిఇఓ

**గుంటూరు విద్య జనవరి 29 ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా గుంటూరు రూరల్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంకిరెడ్డిపాలెం మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంగళాయపాలెం లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు ను, వారి సామర్థ్యాలను పరిశీలించి 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల ప్రణాళికను పరిశీలించి విద్యార్థులు రాసిన పరీక్షలను పరిశీలించి ఆన్లైన్లో హాజరు ఏ విధంగా ఉందో ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు పాఠశాలకు రాని విద్యార్థులవివరాలను తెలుసుకొని వారి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలని అన్నారు ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలని, హాజరు



శాతం తక్కువైతే తల్లికి వందనం ఇబ్బంది అవుతుంది కాబట్టి విద్యార్థులతల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఈ విషయమును తెలియజేయాలని అన్నారు 10వ తరగతి విద్యార్థులను గ్రేడులుగా విభజించి వారిపైప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను అభినందించారు ఆయా పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అందిస్తున్న అల్పాహారము గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# హెల్త్ వెల్నెస్ సెంటర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

**గుంటూరు విద్య జనవరి 29 ప్రభాతవార్త :** మెజారిటీ ప్రజల ఆమోదం లేకుండా ఫోర్జరీ సంతకాలతో పంచాయితీ తీర్మానాన్ని ఆమోదింపజేసిన చిలుమురు కార్యదర్శి, సంతకాలు చేసిన సర్పంచ్ , ఎంపీటీసీ వారి అను యాయిలపై తగిన విచారణ జరిపి శాఖాపరమైన క్రమశిక్షణా



చర్యలు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలనీ, "ఆదిజ బావ కన్వెన్షన్ హాలు" నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసిన స్థలంలో అక్రమంగా చేపడుతున్న "హెల్త్ వెల్నెస్ సెంటర్ ( ఆరోగ్య కేంద్రం )" నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలనీ కోరుతూగుంటూరు జిల్లా పంచాయితీ అధికారి కి, ఇన్చార్జి గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కి వినతి పత్రాలు అందజేశామని, గుంటూరు జిల్లా కలెక్టర్ ( టపాల సెక్షన్) నందు అర్జీ ను అందజేశామని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ న్యాయవాది నాగరాజు మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల వంశీ, కోడూరు అరవింద్ పాల్గొన్నారు.

# ఎన్జీవో హోమ్ నిర్మాణానికి స్థలం మంజూరు చేయండి

**వట్టిచెరుకూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో హోమ్ నిర్మాణానికి ప్రత్తిపాడు మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం మంజూరు చేయాలని ప్రత్తిపాడు తాలూకా యూనిట్ సభ్యులు స్థానిక తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో శివపార్వతి లను కలిసి అర్జీ ఇవ్వడం జరిగిందని ప్రత్తిపాడు తాలూకా యూనిట్ అధ్యక్షులు కె. శేషగిరిరాజు గురువారం తెలిపారు. ఎన్జీవో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తహసిల్దార్, ఎంపీడీవో చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్జీవో



అడుగులు వేస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేయబోమని, సానుకూల దృక్పథంతో డిమాండ్ల సాధనకు చిత్తశుద్ధితో కృషిచేస్తామన్నారు. 75 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు నిలిచిందని వివరించారు. నేడు ఉద్యోగులు పొందుతున్న ప్రతి సౌకర్యం సాధించడం వెనుక ఎన్జీవో అవిరళ కృషే కారణమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఎన్నో అలుపెరగని పోరాటాలు చేయడం జరిగిందని, ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఎన్జీవో సంఘం చేపట్టిన ప్రతి కార్యక్రమం, డిమాండ్ల సాధన పోరాటాలతో ఎన్నో విజయాలు సాధించిందని పేర్కొన్నారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన సంఘం ఎన్జీవోస్ అన్నారు. ఈ సంఘంలో ఎంతోమంది అగ్రనాయకులుగా ఎదిగారని.. ఇందుకు కారణం వారు ఉద్యోగులకు అందించిన సేవల్లో అంకితభావం చూపడమేనన్నారు. గత ప్రభుత్వంలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం దశలవారీగా పరిష్కరించేందుకు ముందుకు రావడం ఆశాజనకమని వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు యూనిట్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు కె.శేషగిరి రాజు, జి.పాల్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు టి. మహేష్, ఎస్కె మహమ్మద్, సిహెచ్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పెదనందిపాడు సాయిబాబాకు వెండి కిరీటం బహూకరణ

**పెదనందిపాడు జనవరి 29 (ప్రభాతవార్త)** పెదనందిపాడు సాయి మందిర్ లోని సాయిబాబా విగ్రహానికి చీరాలకు చెందిన దాతలు ఆలూరి శ్రీనివాస్ విజయ్ చంద్ర దంపతులు. 1,20,000 విలువ చేసి వెండి కిరీటాన్ని గురువారం అందజేశారు ఈ కార్యక్రమంలో కూతురు యార్లగడ్డ మన్విత చంద్ర అల్లుడు కృష్ణ



చైతన్య బాబు. కొడుకు సుజిత్ కోడలు యామినీలు పాల్గొనగా వెండి కిరీటం అందుకున్న సాయి మందిర్ కమిటీ సెక్రటరీ అరవపల్లి రామ సుబ్బారావు. బిరుదు రాజు లక్ష ్మణ రాజు. మదమంచి అనంత్ కుమార్ .సాయి మందిర్ అర్చకులు గౌతం పాండేలు దాతలను సాయిబాబా ప్రతిమలతో ఘనంగా సత్కరించారు.

## నేడు ప్రతిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని జన్మదిన వేడుకలు

**వట్టిచెరుకూరు, జనవరి 29, ప్రభాతవార్త :** ప్రతిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నేతలు అన్నిఏర్పాట్లు చేసినట్లు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి నాదెండ్ల రామచంద్రయ్య గురువారం తెలిపారు. గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు బైపాస్ వద్దనున్న వైసీపీ పార్టీ కార్యాలయంలో నేటి ఉదయం గం. 10లకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముందుగా ఏటుకూరు బైపాస్ వద్దనున్న హనుమాన్ ఆలయం వద్ద నుండి భారీ ర్యాలీగా బలసాని కిరణ్ కుమార్ ని వేదిక వద్దకు తీసుకొని రావటం జరుగుతుందని వివరించారు. కావున వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో స్టార్టప్‌లకు మార్కెటింగ్ స్ట్రాటజీలపై వర్క్‌షాప్

**గుంటూరు విద్య జనవరి 29 ప్రభాతవార్త :** టెక్నాలజీ ఆధారంగా వ్యాపార రంగంలో విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీమతి వెలగపూడి కృష్ణ కుమారి పిలుపునిచ్చారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్.వి.ఆర్ జె.సి .సి.ఈ ఎస్.టి.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో



"ప్రాడక్ట్ కాస్ట్ ఎఫెక్టివ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఫర్ స్టార్టప్స్" అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, స్టార్టప్స్‌కు అవసరమైన మార్కెటింగ్ ప్లానింగ్, ప్రైసింగ్ స్ట్రాటజీ, కస్టమర్ అప్రోచ్, బ్రాండింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ ఉదాహరణలతో అవగాహన కల్పిస్తూ, వ్యాపార రంగంలో వివిధ సాంకేతిక అంశాల పాత్రను వివరించి, కొత్త ఆలోచనలతో ముందుకు సాగితే విజయాలు సులభంగా సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలని, "స్వర్ణాంధ్ర2047" విజన్ లక్ష్య సాధనకు యువ పారిశ్రామికవేత్తలు కీలక పాత్ర పోషించాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీ మోహన్ మరియు డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు పరిశ్రమలలో సమస్యలను గుర్తించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించే విధంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మరియు స్టార్టప్స్ వైపు ప్రోత్సహిస్తూ నిపుణులచే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, డా. ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, డా. శోభా, డా. ఆలపర్తి ముద్దు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యు లైబ్రరీకి ఉర్దూ బుక్స్ వితరణ

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి29, ప్రభాతవార్త:** ఉర్దూ సాహిత్య అకాడమీ అవార్డీ డాక్టర్ సిద్దిఖ్ నవాబ్ సాహెర్ ఏఎన్‌యులోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ గ్రంథాలయానికి తను రచించిన బుక్స్‌ను దానం చేశారు. గుంటూరుకు చెందిన ఆమె ముంబైలో స్థిరపడ్డారు. మాతృభూమిపై మమకారంతో తను రాసిన 6 ఉర్దూ బుక్స్



వర్సిటీకి అందజేశారు. వర్సిటీకి వచ్చి ఆమె రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారి సమక్షంలో గ్రంథాలయాధికారి ఆచార్య కోడెల వెంకట్రావ్‌కు బుక్స్‌ను అందజేశారు. రెక్టార్, రిజిస్ట్రార్లు మాట్లాడుతూ సిద్ధిఖ్‌ను అభినందించి సాహిత్య అకాడమీ అవార్డు సాధించడం అంటే ఉన్నత సాహిత్య పరిజ్ఞానం ఉండాలని అవార్డుకు వన్నె తెచ్చారన్నారు. సిద్దిఖ్ రాసిన పుస్తకాలు వర్సిటీకి అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో మరికొన్ని పుస్తకాలు ((రిఫరెన్స్‌లు) అందజేస్తానని సిద్ధిఖ్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో బషీర్ అహ్మద్, పాల్గొన్నారు.

# బాలల పార్లమెంట్ ప్రమాణ స్వీకారం

**తాడేపల్లి, జనవరి 29,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెనుమాక గ్రామంలో దేవుని మందిరం చర్చి దగ్గర బాలల రక్షణ,హక్కుల ప్రచారం కోసం బాలల పార్లమెంట్ ఏర్పాటు,బలోపేతం అనే ఉద్దేశ్యంతో చైతన్య బాలల పార్లమెంట్ సభ్యులకు బాధ్యతలు,విధుల గురించి వివరిస్తూ ఎన్నికైన పార్లమెంట్ మంత్రుల చేత ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాల బాలికలు చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అలాగే సమాజం పట్ల,సమాజంలోని సమస్యలను గుర్తించి,స్థానిక అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి వాటికి పరిష్కార మార్గాలు




కనుగొనే విధంగా చైతన్య బాలల పార్లమెంట్ పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నామని దీంతో నేటి బాలలుగా ఉన్న వీరు రేపటి పౌరులుగా ఎదుగుతారన్నారు. మహిళా పోలీసు అరుణీమ,నాగమణి లు మాట్లాడుతూ సైబర్ క్రైమ్,బాల్యవివాహాల వలన కలిగే నష్టాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 52మంది బాలబాలికలు,గ్రామ సచివాలయ సిబ్బంది,హెల్త్ డిపార్ట్‌మెంట్,గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు, పి.అనిల్‌కుమార్, ఎన్.నాగమణి,జె.ఇశ్రాయేల్,స్థానిక అంగన్‌వాడీ,ఆషా వర్కర్స్,తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యాన్సర్ కారకం

**తాడేపల్లి, జనవరి 29,ప్రభాతవార్త :** ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వలన



క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కెఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ ఆఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్,ఏఐ అండ్ డిఎస్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం దుగ్గిరాల మండలంలోని గొడవర్రు గ్రామంలో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ జీవితంలో ఒక భాగమై పోయిందని,వేడివేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ సంచుల్లో పార్సిల్ చేయడం వలన ఆ వేడికి ప్లాస్టిక్ కరిగి మైక్రో ప్లాస్టిక్ కణాలు శరీరంలోనికి చేరి క్యాన్సర్ కారకాలుగా మారుతాయని వాలంటీర్లు అవగాహన కల్పించినట్లు హెచ్‌ఓడి డాక్టర్ ప్రభాకర్ సూచించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి.సురేష్,వాలంటీర్లను యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ,ప్రొ విసీలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖర్‌రావు,డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్,ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.

# ఆరోగ్య,శారీరక దృఢత్వం పై అవగాహన

**తాడేపల్లి, జనవరి 29,ప్రభాతవార్త :** కెఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ ఆక్టివిటిస్ (సిఇఎ),కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సిఎస్‌ఈ--2) విభాగంతో కలసి "స్వస్త్య (హెల్త్ అండ్ ఫిట్నెస్)" అనే ఆరోగ్య--శారీరక దృఢత్వ అవగాహన కార్యక్రమాన్ని మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలోని ఎం.పి.పి.పాఠశాల్లో నిర్వహించారు. విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. చిన్న వయస్సులోనే మంచి అలవాట్లు అలవర్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. సిఈఏ విద్యార్థి వాలంటీర్లు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సూచనలు,శుభ్రత ప్రాముఖ్యత,శక్తి పొదుపు అలవాట్లపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సిఎస్‌ఈ - 2 విభాగాధిపతి డాక్టర్ తిరుపతి రెడ్డి,సీఈఏ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ నాగమణి,సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి,సీఈఏ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ,ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖర్‌రావు,రిజిస్ట్రార్ కె.సుబ్బారావు,విద్యార్థులు విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్‌ఎస్ ప్రసాద్,విద్యార్థుల విభాగం అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లా ఖానన తదితరులు సిఈఏ,సీఎస్‌ఈ-2 విభాగాల అధ్యాపకులు,విద్యార్థి వాలంటీర్లను అభినందించారు.

# యువతకు ఉపాధి కల్పిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది

## ఎమ్మెల్యే రామాంజనేయులు

**వట్టిచెరుకూరు, జనవరి 29, ప్రభాతవార్త :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తే రాష్ట్రం, దేశం అన్నివిధాల అభివృద్ధి చెందుతాయని దీనిని సియం చంద్రబాబు నాయుడు నమ్ముతారని, ఆయన ఆలోచనలో భాగంగానే ఈ మెగా విజిట్ జాబ్ మేళాను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా మాజీ కలెక్టర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని విజ్ఞానపాడు గ్రామ పరిధిలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా విజిట్ జాబ్ మేళాను




నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...మన రాష్ట్రం వెనకబడి ఉంది కానీ మన అదృష్టం సీఎంగా చంద్రబాబు నాయుడు ఉన్నారని తెలిపారు. అప్పట్లో విజన్ 2020 అంటే నవ్వారు, కానీ ఇప్పుడు ఐటీ కంపెనీలో మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. దేశంలో రెండు పెద్ద నగరాలు హైదరాబాద్, అమరావతి నిర్మించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందని వివరించారు. మెగా విజిట్ జాబ్ మేళాలో జాయ్ లూకాస్, వరుణ్ మోటార్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో, సెవెన్ హిల్స్ ఫార్మసీ, జయభేరి ఆటోమేటిక్ ప్రైవేట్ లిమిటెడ్, బిగ్ బాస్కెట్, మాస్టర్ మైండ్స్, ఫ్లిప్ కార్ట్, ఎవైజ్ ఆగ్రో లిమిటెడ్, పేటీఎం సర్వీస్ లతోపాటు మరో 22 కంపెనీలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ అభ్యర్థులు భారీగా తరలివచ్చి 766 మంది నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోగా, 250 మంది ఆఫ్‌లైన్ ద్వారా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో కేవలం ఐటీ వాళ్లకే కాకుండా 10వ తరగతి చదువుకున్న వారికి కూడా జాబ్ రావాలని కోరారు. నియోజక పరిధిలో ప్రతి యువతకు జాబు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ జాబ్ మేళాను చేపట్టడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువతకు ఇది మంచి అవకాశమని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి అమోఘమని, రాష్ట్రంలోనే ఐటీ ఉద్యోగులు ఉండాలని ఆనాడే భావించి హెచ్ సి ఎల్ ను ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. దీనితో పాటు అనేక ఐటీ కంపెనీలను కూడా రాష్ట్రానికి తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఇప్పుడు జాబ్ రాలేదని బాధపడాల్సిన పనిలేదని, మరల ఇటువంటి మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఇది మూడవ మెగా జాబ్ మేళా అని, గత ఏడాది మే నెలలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోనూ, డిసెంబర్ మాసంలో నల్లపాడు ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలోనూ మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ఉద్యోగాలలో చేరిన వారికి ప్రారంభంలో కొంచెం కష్టంగానే ఉంటుందని, కొంతకాలం జరిగిన తర్వాత అదే కంపెనీలో మంచి వేతనంతో జీవితములో స్థిరపడే అవకాశం ఉంటుందని వివరించారు. వివిధ కంపెనీలలో ఎంపికైన 323 మంది అభ్యర్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ ఇలాంటి మెగా జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ యువకులు తమ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కూడా వినియోగించుకుని తమ ప్రతిభను మెరుగుపరుచు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కోయ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, సీడాప్ జేడీఎం ఎలిజా, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండా సంజీవరావు, ప్రత్తిపాడు నియోజకవర్గం స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్లు బి.రవికుమార్, ఏ.రామకృష్ణారెడ్డి, మండల టిడిపి ప్రస్తుత, మాజీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు, మన్నవ పూర్ణచంద్రరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, చింతలపల్లిపాడు, లేమల్లెపాడు సొసైటీ అధ్యక్షులు అత్తోట బాలకృష్ణ, పాతూరి కృష్ణారావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు నార్నె బాబు, గోగినేని కళ్యాణ్ చక్రవర్తి, గుంటుపల్లి కిరణ్ కుమార్, నాగిరెడ్డి నాగరాజు, పరిటాల హరిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు, తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మోరంపూడి గ్రామంలో ఉన్నత భారత్ అభియాన్

మంగళగిరి, జనవరి 29, ప్రభాతవార్త : మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమం దుగ్గిరాల మండలంలో రెండవ రోజు మోరంపూడి గ్రామంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఉన్నత భారత్ అభయాన్ సెల్ సమన్వయంతో, కళాశాల జాతీయ సేవా పథకం బృందం మద్దతుతో నిర్వహించారు. ఉన్నత భారత్ అభియాన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. రేఖా నరేష్ బాబు ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. విద్యార్థులు నిర్వహించబోయే సర్వేను సమర్థవంతంగా చేపట్టడానికి అవసరమైన సూచనలు అందించారు. మోరంపూడి గ్రామ కార్యదర్శి జి శ్రీకాంత్ విద్యార్థులకు సర్వే మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ గ్రామసర్వే ప్రారంభ కార్యక్రమానికి గ్రామ టిడిపి నాయకులు గొర్నెని అనిల్, గొరికపూడి సత్యం, జంపాల హరిబాబు, శ్రీపతి కిషోర్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సర్వే మార్గదర్శకాలుతో ప్రారంభమై, ఆరోగ్య, పరిశుభ్రత, పశుసంపద , సస్టైనబుల్ అగ్రికల్చర్ సిస్టం, రూరల్ ఎనర్జీ సిస్టం, ప్రభుత్వ పథకాలు, గ్రామ సమస్యలపై పలు అంశాలతో కూడిన ఇంటింటి సర్వేని పూర్తి చేశారు. అదేవిదంగా ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని బాల బాలికలకు పరిసరాల




పరిశుభ్రత, ఆరోగ్యము, జీవిత లక్ష్యాలు అనే అంశాలపై అవగాహన కల్పించినందుకు పాఠశాల హెచ్ఎం వి హరి లక్ష్మి కుమారి నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కే ప్రియ ప్రశాంతి, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ కే మోహన, కే రాధాకృష్ణ, పి సాయి స్నిగ్ధ , డి ప్రజు, ఏ గీతా రత్నశ్రీ, ఏ రవితేజ ఎం హరి నాథ్ పాల్గొని స్టూడెంట్ టీమ్స్ కు బాధ్యత వహించారు. అదేవిధంగా దుగ్గిరాల ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, తదితరులు ఉన్నత భారత అభియాన్ విద్యార్థులను, వారి బృందానికి అభినందనలు తెలిపారు.

# జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించండి : మాజీ కేంద్రమంత్రి జెడి.శీలం

తెనాలి టౌన్ జనవరి29(ప్రభాతవార్త): ఇటీవల కేంద్రప్రభుత్వం, గ్రామీణ ప్రజలకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు పరచి వి.బి.జి.రామ్.జీ అను నూతన చట్టాన్ని తీసుకువచ్చి గ్రామీణ కార్మికులకు పని హక్కును దూరం చేయు విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, మాజీ కేంద్రమంత్రి జెడి. శీలం డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు, పట్టణంలోగురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి జెడి. శీలం మాట్లాడుతూ, 2005వ సంవత్సరంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వామపక్షాల సహకారంతో, గ్రామీణ ప్రాంత ప్రజలకు పని హక్కును కల్పించడం మరియు వలసల నివారణ కొరకు ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరియు యుపిఏ చైర్మన్ శ్రీమతి సోనియా గాంధీ ఆధ్వర్యంలో, కేంద్రప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకు వచ్చిందని, ఈ చట్టాన్ని మొదటిగా ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మరియు శ్రీమతి సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రారంభమైనదని, ఈ చట్టం నిధులతో, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, మరియు సిమెంట్ రోడ్లు లాంటి అనేక అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే మని తీర్మానించడం జరిగిందని, ఆవిధంగానే గత 20 సంవత్సరాలుగా గ్రామీణ లకు పని కల్పిస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇటీవల బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి, విబిజి రాంజీ గా మార్చి గ్రామీణ కార్మికులకు పని హక్కును దూరం చేసిందని, గత చట్టంలో నిధులు 100 శాతాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేదని కానీ ఇప్పటి ఈ నూతన చట్టం వల్ల కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం గా నిర్ణయించి ప్రజా వ్యతిరేకమైన చట్టాన్ని




తీసుకొచ్చిందని, ఈ నూతన చట్టం వలన రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా రాష్ట్రాలు ఆర్థికంగా దెబ్బతింటాయన్నారు. కావున ఉపాధిహామీ చట్టం కార్డుదారులు గ్రామీణ ప్రజలు ఈ నూతన చట్టాన్ని వ్యతిరేకించటానికి కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవ వలసినదిగా ఆయన సూచించారు. అనంతరం తెనాలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టంలో గ్రామీణ కార్మికులకు పనిచేయటానికి ఎటువంటి హామీ లేదని, పనులన్నీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయని, కనీస వేతనానికి చట్టపరమైన హక్కు లేదని, అంతేకాకుండా కూలీలకు సహాయ పడటానికి ఎవరు ఉండరని, రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించినప్పుడు మాత్రమే పనిచేయాలని, అంతే కాకుండా గ్రామ సభల ద్వారా నిర్ణయించవలసిన పనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కాంట్రాక్టర్లు నిర్ణయిస్తారని, ఆర్థికంగా అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్రాలపై అధికంగా ఆర్థిక భారం పడుతుందని, గతంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు వ్యవసాయ కార్మికులకు పని దొరుకుతుందని కానీ ఇప్పటి నూతన చట్ట ప్రకారం యంత్రాల ద్వారా కూడా పనిచేయ వచ్చునని, కార్మికులను బానిసలుగా మార్చే ఈ నూతన చట్టాన్ని వ్యతిరేకించాలని డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. అనంతరం మార్కెట్ సెంటర్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి స్థానిక వ్యాపారులకు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు జెడి శీలం, డిసిసి అధ్యక్షులు యన్నం సుధీర్, సిపిఎం నాయకులు బాబు ప్రసాద్, ఎం. సాంబశివరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్ రావు, గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ యన్నంశెట్టి శివరామకృష్ణ ప్రసాద్, తెనాలి టౌన్ ఉపాధ్యక్షులు గుర్రపు ద్వారకా శ్రీనివాస్, పి. శివకుమార్, భీమా రమేష్, పి. స్టీవెన్ బాబు, శంకర్ రావు, కె. కోటేశ్వరరావు, యస్. సుబ్బారావు, మాధవరావు, కృష్ణ, వీరాస్వామి, పూలేరామ్ సుబ్బారావు, శ్రీను, మల్లిఖార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులను అధోగతి పాలు చేసిన వైకాపా ప్రభుత్వం

## చింతపల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ

**వట్టిచెరుకూరు, జనవరి 29, ప్రభాతవార్త:** జగన్ ప్రభుత్వం పాడి పరిశ్రమను, పాడి రైతులను అధోగతి పాలు చేసిందని చింతలపల్లిపాడు సొసైటీ అధ్యక్షులు అత్తోట బాలకృష్ణ విమర్శించారు. మండలంలోని కుర్నూతల గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు బాలకృష్ణ పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ..పశువులలో సంభవించే గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. సంతానోత్పత్తికి ఉపయోగించని పాడి పశువులను పశు వైద్యుల సూచనలతో వైద్యం చేయించి సంతానానికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పశుసంవర్ధక శాఖపై దృష్టి సారించి ఆగిన పథకాలను పునరుద్ధరించిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.150 కోట్ల పశువుల ఇన్సూరెన్స్ బకాయిలను వైకాపా ప్రభుత్వం నిలిపివేస్తే, కూటమి ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం పశువులకు మూడేళ్ల ఇన్సూరెన్స్ తో పాటు 50శాతం సబ్సిడీపై రైతులకు దాణా అందిస్తున్నారు. గతంలో ఫోన్ చేస్తే పశువుల అంబులెన్స్ వచ్చేవిధానం ఉండేదని, దీంతో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో పశువుల అంబులెన్స్ వాహనాలను 104 తరహాలో ప్రభుత్వం మార్పు చేసిందని గుర్తు చేశారు. ఇవి రోజుకు ఒక గ్రామానికి వెళ్లి ఉదయం నుండి రాత్రి వరకు సేవలు అందిస్తాయని చెప్పారు. రైతుల ఆర్థిక పురోభివృద్ధి పశువుల ఆరోగ్యంపైనా ఆధారపడి ఉంటుందని, పాడి పశువులకు సరైన సమయంలో వైద్యం అందించాలని సూచించారు. ఈ పశు వైద్య శిబిరంలో 34 గేదెలు, 40 దూడలకు నట్టల నివారణ మందు, 13 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 60 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ చేయడం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో పశు వైద్యాధికారి భవ్యశాంతి, వీఎల్‌వో బి.నాగేశ్వరరావు, వీ పి. శ్రీనివాసరావు, ఏహెచ్‌ఏలు ఖాదర్, సతీష్, ఓఎస్ పుష్ప, పశు యజమానులు పాల్గొన్నారు. అనంతరం పశు యజమానులకు ఉచిత మందులు అందించారు.

# పోలియో రహిత భవిష్యత్తును నిర్మిద్దాం

తాడేపల్లి, జనవరి 29, ప్రభాతవార్త : దేశ భవిష్యత్తు బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉందని, పిల్లలను ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధుల్లో పోలియో ఒకటని, ఈ వైరస్ కారణంగా పిల్లల్లో శాశ్వత వైకల్యం కలిగే ప్రమాదం



ఉందని, సమాజం కృషితోనే పోలియో రహిత భవిష్యత్తును నిర్మించగలమని కెఎల్ యూనివర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. సరైన సమయంలో పోలియో డ్రాప్స్ మరియు టీకాలు అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామంలో ఎన్ఎస్ఎస్,సీఎస్ఐటి విభాగం ఆధ్వర్యంలో వాలంటీర్లు గ్రూపులుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా ప్రభుత్వం చేపడుతున్న జాతీయ పోలియో నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో పోలియో డ్రాప్స్,టీకా వేయించాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎన్.ప్రవీణ అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లలకు పుట్టిన వెంటనే 6వారాలు, 10వారాలు, 14వారాలు, 16-24నెలల మధ్య డ్రాప్స్, టీకాలు ఇప్పించాలని టీకాల ప్రాధాన్యతను గుర్తించాలని, ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని వైద్యులు స్పష్టం చేస్తున్నారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి వివరించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన పి.సురేష్, వాలంటీర్లను యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ విసిలుల డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖర్‌రావు, డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

# నేడు దేవాలయం శుద్ధి కార్యక్రమం

**భట్టి ప్రోలు(రేపల్లె), జనవరి 29, ప్రభాతవార్త:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు సంస్థలు వాస్తవాలు బయటపెట్టినందున అపచారానికి సంబంధించి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు దేవాలయ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు



తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దేవాలయ శుద్ధి కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి జరిగిన అపచారాన్ని మన్నించమంటూ కోరుతూ గోవింద నామాలతో శాంతి ప్రదర్శన జరుగుతుందన్నారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని సాయిబాబా చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. లడ్డూ వ్యవహారం పూర్వాపరాల గురించి భక్తులకు తెలియజేస్తామని ఆయన వెల్లడించారు. కోట్లాది రూపాయల అవినీతి వ్యవహారాన్ని వివరిస్తామని ఆయన చెప్పారు. తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

## రైతు సంఘం ఆటో ప్రచారం

**కాకుమాను జనవరి 28(ప్రభాతవార్త ):** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగాన్ని ఇబ్బంది పెట్టే చర్యలకు వ్యతిరేకంగా జనవరి 29 నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు గుంటూరులో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు పిలుపునిచ్చారు. బుధవారం కాకుమాను



మండల గ్రామాలలో సమావేశాలను జయప్రదం చేయాలని ఆటో మైక్ ప్రచారం, కరపత్రాల పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మండల పరిధి కొమ్మూరు, గార్లపాడు, పెద్దివారిపాలెం, కాకుమాను, కొండపాటూరు, బి కే పాలెం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటశివరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టాక 15 సంవత్సరాల కాలంలో రైతాంగ వ్యతిరేక విధానాలను తీసుకువచ్చిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులను మోసం చేస్తుందని ఆయన అన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారా దత్తం చేస్తూ, వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేసిందన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు గుంటూరులో జరిగే సెమినార్లో రైతాంగ సమస్యలపై చర్చించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు వెంటనే చేపట్టి పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. నల్లమడ వాగు ముంపు నివారణకు నిధులు కేటాయించి వాగు కట్టలు బలోపేతం చేయాలన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేసేందుకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కందుల శ్రీనివాసరావు, దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కరిముల్లా సాయం అందరికి స్ఫూర్తిదాయకం

**నగరం, జనవరి29, ప్రభతవార్త:** దాతల సాయం అందరికి సూర్తి దాయకం, ఎదుటివారి కష్టాలు చూసి చలించి వారి కష్టాలను తీర్చే ప్రతి ఒక్కరూ దేవుడి ప్రతిరూపలే అని చినమట్లపూడి ప్రజలు అంటున్నారు. నగరం టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షులు షేక్ కరిముల్లా ఎదుటివారికి కష్టం వస్తే తానే ముందుండి వారి కష్టాన్ని తీర్చే గొప్పవ్యక్తి, ప్రతి ఒక్కరు ఇతనిలా ఆలోచిస్తే కష్టాలు వచ్చిన ఎవరూ బాదపడరు. ఇటీవల చినమట్లపూడికి చెందిన అబ్దుల్ బుడా ఇంట్లో గ్యాస్‌లీక్ తో ఇంట్లో వస్తువులు పూర్తిగా కాలిపోగా ఆ కుటుంబానికి



ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల చందోలు పిట్టలవానిపాలెం రహదారి మధ్యలో చినమట్లపూడి గ్రామానికి చెందిన జాన్‌సేద చనిపోగా ఆ కుటుంబానికి షేక్ కరిముల్లా ,టీడీపీ కార్యకర్తలతో కలిసి 85వేల రూపాయలు ,మట్లపూడి ఆర్మీ గ్రూపు ఆధ్వర్యంలో 50వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు.

# అలరించిన పౌరాణిక పద్య నాటకాలు

**గుంటూరు కల్చరల్, జనవరి 29, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో సంస్థ 32వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ నిర్వహణలో పౌరాణిక పద్య నాటక సన్నివేశ ప్రదర్శన జరిగింది. మొదటిగా గయోపాఖ్యానం లోని సన్నివేశాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణుడిగా డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, అర్జునుడిగా ఉల్లంగుల బ్రహ్మయ్య, రెండోది శ్రీకృష్ణ రాయబారం పడకసీను సన్నివేశాన్ని ప్రదర్శించారు.



శ్రీకృష్ణుడిగా గుర్రపుశాల శ్రీనివాస్, సుయోధనుడిగా అట్ల రామకృష్ణారెడ్డి, అర్జునుడిగా బ్రహ్మయ్యలు పౌరాణిక పద్యాలతో ఆహుతులను అలరించారు. అనంతరం బొల్లేపల్లి సత్యానారాయణ, ఆలయ పాలకమండలి కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, డాక్టర్ ప్రభుదాస్ దంపతులను, కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొర్రా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ ప్రభుదాస్ శ్రీకృష్ణుడి పాత్రలో పూర్తిగా లీనమై చక్కటి ప్రదర్శన ఇచ్చారన్నారు.

# జిఎంసి సమావేశ మందిరానికి నడింపల్లి నరసింహారావు పేరు పెట్టడం ఆనంద దాయకం

గుంటూరు కల్చరల్, జనవరి 29, ప్రభాతవార్త : **ప్రముఖ స్వాతంత్ర్య** సమరయోధుడు, గుంటూరు కేసరిగా దేశ నాయకులందరూ పిలుపుకునే గుంటూరు మున్సిపల్ చైర్మన్ నడింపల్లి నరసింహారావు పేరు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరానికి పెట్టడం పట్ల అవగాహన సంస్థ సభ్యుల సమావేశం హర్షం ప్రకటించారు. సమావేశంలో రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి




అవధానుల హరి మాట్లాడుతూ గుంటూరు కేసరి నడింపల్లి నరసింహారావు పేరును గుంటూరు మున్సిపల్ సమావేశ మందిరానికి పెట్టాలని 2005లో అప్పటి మేయర్ చుక్కా యేసురత్నం ఆధ్వర్యంలో తీర్మానం చేసిందని దాని అమలు ఇన్నాళ్ళకు సాధ్యమవడం సంతోషం గా ఉందన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆరోజుల్లో "నడింపల్లి" అంటే జాతీయ నాయకులందరికీ అభిమానమని గుంటూరు మున్సిపల్ భవనంపై బ్రిటిష్ జెండాను తీసివేసి జాతీయ జెండాను ఎగురవేసిన ధైర్యశాలి నడింపల్లి అన్నారు. త్వరలో ఏర్పడబోతున్న శంకర్‌విలాస్ బ్రిడ్జికి కూడా నడింపల్లి పేరే పెట్టాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు పి.ఎస్.మూర్తి, ఆర్ .వి.సింగరయ్య తదితరులు ప్రసంగించారు.

# రోడ్లు వేయించిన మంచి మనిషి కరిముల్లా

**నగరం, జనవరి29, ప్రభాతవార్త:** ప్రజల ఇబ్బందలను తెలుసుకుని రోడ్లుకు మరమత్తులు చేసిన మంచి మనిషి కరిముల్లా అని గ్రామ ప్రజలు అంటున్నారు. రాష్టా రెవెన్యూశాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సారథ్యంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ చోరవతో రోడ్డుకు మరమత్తులు చేయించినట్లు షేక్ కరిముల్లా అన్నారు. సిరిపూడి అమ్మవారి ఆర్చివద్ద రేపల్లె నుంచి బాపట్ల వెళ్ళే రహదారిలో గుంతలు ఏర్పడి పెదమట్లపూడి, చినమట్లపూడి గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేయవలసి వస్తుందని ,ఒడ్డు ట్రాక్టర్లు పడిపోయే పరిస్థితి నెలకొందని



గమనించి కరిముల్లా ఔదార్యంతో గుంటలు పూర్తిగా పూడ్చి సరిచేసి రోడ్డు వేసిన ఘనత కరిముల్లాదే అన్నారు. ప్రజలకు అన్ని విధాల సాయం చేస్తున్నారని గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజావారధిలో వినతిపత్రాలు స్వీకరణ

**తాడేపల్లి, జనవరి 29, ప్రభాతవార్త :** దుగ్గిరాల ప్రజల సమస్యలు నారా లోకేష్‌దృష్టికి తీసుకెళ్తానని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం స్థానిక బాధితులకు హామీ ఇచ్చారు. దుగ్గిరాల శివాలయం సెంటర్ వద్ద ప్రజావారధి నిర్వహించి సమస్యల గురించి వినతిపత్రాలు స్వీకరించారు. గ్రామస్థులు తీసుకొచ్చిన సమస్యలు ప్రభుత్వంచే పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో పోకూరి కవిత, షేక్ రజాక్ పాల్గొన్నారు.



# నెలకోసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలి

**కొల్లిపర, జనవరి 29, ప్రభాతవార్త:** బి.పి, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా విధిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి నీహ చెప్పారు. గురువారం మండల పరిధిలోని అన్నవరంలో వైద్యాధికారులు చంద్రన్న సంచార చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యపరంగా తగిన సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నీహ మాట్లాడుతూ



బి.పి, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా ప్రకారం ప్రతి రోజూ మందులను వాడుకోవాలన్నారు. గ్రామాలలో నిర్వహించే మెడకల్ క్యాంపును పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జానీబేగమ్, ఏఎన్ఎం సునీత, డిఇవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, రోజ్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

# పాసు పుస్తకాల సమస్యలపై గ్రామ సచివాలయాలలో అర్జీలు ఇవ్వాలి : ఎమ్మార్వో హేన ప్రియ

**పెదనందిపాడు జనవరి 29 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలము లోని పుసులూరు, పాలపర్రు, జీ.జి పాలెం, అన్నపర్రు, కొప్పర్రు, కట్రపాడు, వరగాని, మరియు పెదనందిపాడు గ్రామాలకి సంబంధించి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం వారిచే పట్టాదారు పాసు పుస్తకములు జారీ చేయబడును అని. కావున పైన తెలిపిన గ్రామాల యొక్క సంబంధిత రైతులు వారియొక్క పాసు పుస్తకములలో ఏవన్నా తప్పులు ఉన్న లేదా ఏవన్నా వివరములు అనగా విస్తీర్ణము, పేరు, సంబంధీకుల పేరు, కులం, ఫోటో, లింగం, ఫోను నంబరు, ఆధార్ నంబరు, విస్తీర్ణము, మైనర్ గార్డియన్ వంటి వివరములు సరి చేసుకోదలచినా , ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామ సచివాలయానికి సందర్శించి అర్జీ దాఖలు పరచుకోవలసినదిగా మండల తహశీల్దార్ ఎస్. హేన ప్రియ నేడు ఒక ప్రకటనలో కోరారు .

30-1pg 12 VJA_30-1pg10.qxd 29/Jan/26 10:18 PM Page 1



## మహిళల జాతీయ కబడ్డీలో
# తెలంగాణ, హర్యానా విజయం
### ఆంధ్రా, బీహార్, గోవా ఓటమి



**న్యూఢిల్లీ:** 72వ మహిళల సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2026లో ఇండియన్ రైల్వేస్, తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్ విజయంతో ప్రత్యేకంగా నిలవగా, ఆంధ్ర, బీహార్, హర్యానా జట్లు ఓటమిపాలయ్యాయి. బాలయోగి స్టేడియంలో గురువారం జరిగిన పోటీల్లో ఇండియన్ రైల్వేస్ రెండు పెద్ద విజయాలతో పూల్ ఎ పై ఆధిపత్యం చెలాయించింది. రాజస్థాన్, తెలంగాణ పూల్ సి లో ఆకట్టుకోగా, గుజరాత్ ఒడిశాను ఓడించి కఠినమైన మ్యాచ్‌లో విజయం సాధించింది. రైల్వేస్ పూల్ ఎ లో ఆధిక్యంలో ఉంది. తొలుత జమ్మూ కాశ్మీర్‌ను 88-12 తేడాతో ఓడించి, ఆ తర్వాత ఢిల్లీపై 54-21 తేడాతో విజయం సాధించిన రైల్వేస్ జట్టు గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. పూల్ బిలో ఉత్తరప్రదేశ్ మిశ్రమ ఫలితాలను సాధించింది. తొలుత అస్సాంను 37-27తో ఓడించి, ఆ తర్వాత షెడ్యూల్‌లో హిమాచల్ ప్రదేశ్ చేతిలో 34-21తో ఓడిపోయింది. దీంతో ఈ విభాగం సమతుల్యంగా ఉండి, ఈ దశలో పాల్గొన్న మూడు జట్లకు అర్హత అవకాశాలు ఉన్నాయి. అలాగే పూల్ సి లో తెలంగాణ పుదుచ్చేరిని 50-16తో ఓడించి బలంగా ప్రారంభించింది. రాజస్థాన్ అదే ప్రత్యర్థులపై మరింత ముందుకు వెళ్లి 76-12 విజయాన్ని నమోదు చేసింది. పూల్ డి లో గోవా జార్ఖండ్‌పై 74-20 స్కోరుతో విజయం సాధించినప్పటికీ గోవా ఆ ఫామ్‌ను తదుపరి మ్యాచ్‌లో కొనసాగించలేకపోయింది. హర్యానా అదే గ్రూప్‌లో గోవాపై 52-26 తేడాతో విజయం సాధించి ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని పెంచుకుంది. పూల్ ఇ లో విదర్భపై 57-20 మహారాష్ట్ర, పూల్ ఎఫ్ లో పంజాబ్ బీహార్‌పై 39-31 గెలుపొందాయి. గుజరాత్ పూల్ జి లో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో ఒడిశాను 29-26తో ఓడించింది. ఇక పూల్ హెచ్‌లో మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌పై 48-23తో విజయం సాధించింది.

## ప్రపంచ స్నూకర్‌లో..
# సత్తా చాటిన ఇష్ప్రీత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్నూకర్ టూర్ ఈవెంట్ అయిన జర్మన్ మాస్టర్స్‌లో భారతదేశానికి చెందిన ఇష్ప్రీత్ చద్దా తన సత్తా చాటాడు. తనకన్నా ఉన్నత ర్యాంక్ పొందిన ఆటగాళ్లపై అతడు అద్భుత విజయాలు నమోదు చేశాడు. గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 65వ స్థానంలో ఉన్న ఇష్ప్రీత్ తన ప్రత్యర్థి నుండి గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన క్రిస్ వాకెలిన్‌తో జరిగిన హోరా హోరీ పోటీలో 5-4 తేడాతో విజయంతో చద్దా ఈ టోర్నమెంట్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ప్రపంచ 14వ ర్యాంకర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాడు 1-3 తేడాతో వెనుకబడ్డాడు. కానీ తదుపరి రౌండ్‌కు చేరుకోవడానికి తిరిగి పుంజుకున్నాడు. తరువాత, అతను ప్రపంచ 20వ ర్యాంకర్ ఎలియట్ స్లెస్సర్‌తో తలపడ్డాడు. ఈ పోటీలో స్లెస్సర్ ను 5-3 తేడాతో ఓడించి మూడవ రౌండ్‌లోకి ఇష్ప్రీత్ ప్రవేశించాడు. తదుపరి ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చద్దా ప్రపంచ 3వ ర్యాంకర్ నీల్ రాబర్ట్‌సన్ లేదా, ప్రపంచ 27వ ర్యాంకర్ పాంగ్ జుంక్సుతో తలపడతాడు. నిరాశపరిచే సీజన్ తర్వాత ప్రపంచ స్నూకర్ టూర్‌లో మనుగడ కోసం పోరాడుతున్న చద్దాకు ఈ విజయాలు కీలకమైన సమయంలో వచ్చాయి.

## థాయిలాండ్ మాస్టర్స్‌లో..
# అన్మోల్, కిరణ్, మిధున్ విజయం



**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన కిరణ్ జార్జ్, మిథున్ మంజునాథ్ విజయం నమోదు చేయగా, మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖర్బ్ గెలుపొందగా, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ఓటమిపాలయ్యారు. ఏడో సీడ్ కిరణ్ జార్జ్ ఇండోనేషియాకు చెందిన షోలేహ్ ఐడిల్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ఓడించాడు. జార్జ్ ప్రారంభం నుండే ర్యాలీలను నియంత్రిస్తూ ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా 21-15, 21-9 తేడాతో విజయాన్ని సాధించాడు. మరోవైపు, ప్రపంచ 60వ ర్యాంకర్ మిథున్ మంజునాథ్ మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో డెన్మార్క్‌కు చెందిన ఎనిమిదో సీడ్ మాగ్నస్ జోహన్నెసెన్‌ను ఓడించాడు. మంజునాథ్ మొదటి గేమ్‌ను సునాయాసంగా ఎదుర్కొని రెండవ గేమ్‌ను చేజార్చుకున్నాడు. కానీ దాదాపు గంటసేపు కోర్టులో ఆడిన తర్వాత 21-12, 9-21, 21-17 తేడాతో విజయాన్ని సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో తరుణ్ మన్నెపల్లి 22-20, 21-17 తేడాతో థాయిలాండ్‌కు చెందిన కాంటాఫోన్ వాంగ్‌చరోయెన్‌ను ఓడించాడు. అయితే, ప్రారంభ రౌండ్‌లో పలువురు భారత షట్లర్లు ఓడిపోయారు. ప్రియాంషు రాజవత్ మూడు గేమ్‌లలో కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్ చేతిలో తృటిలో ఓడిపోగా, మన్రాజ్ సింగ్, ఎస్ శంకర్ ముత్తుసామి సుబ్రమణియన్ వరుసగా మూడు గేమ్‌ల పరాజయాలను చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల డ్రాలో, రైజింగ్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ 21-12, 21-12 తేడాతో హాంకాంగ్‌కు చెందిన లో సిన్ యాన్ హ్యాపీపై అద్భుతమైన విజయం సాధించింది. ఇక తస్నీమ్ మీర్, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ప్రారంభంలోనే నిష్క్రమించగా, శ్రీయాన్షి వాలిశెట్టి, ఇషారాణి బారువా ముందుకు సాగారు.



## ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో..
# అగ్ర స్థానంలో హర్యానా
### 6-3 తేడాతో యుపిపై విజయం

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 లీగ్ దశలో హర్యానా థండర్స్ జట్టు ఐదవ బౌట్‌లో విజయం సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఉత్తరప్రదేశ్ డామినేటర్స్‌పై 6-3 తేడాతో హర్యానా విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 76 కిలోల మహిళల పోటీలో, కాజల్ ధోచాక్ 3-3తో ముగిసిన హోరాహోరీ పోరులో మాన్సి లాథర్‌ను ఓడించింది. పురుషుల బౌట్‌లో (57 కిలోలు) కూడా ఈ ఊపు కొనసాగింది. అంకుష్ చంద్రం, రాహుల్ దేస్వాల్ 4-4తో నిలిచారు. అంకుష్ స్కోరింగ్ హర్యానా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. కిలోల మహిళల బౌట్‌లో (57) తప్స్య గహ్లావత్ ద్వారా యుపిడామినేటర్లు ధీటుగా స్పందించారు. ప్రారంభ మ్యాచ్‌ల లో తప్స్య పవర్ మినిట్‌లో రెండు నిర్ణయాత్మక టేక్‌డౌన్‌లను సాధించి 10-3తో ఆధిక్యతతో గెలుపొంది లోటును తగ్గించింది. ఆ తర్వాత పురుషుల విభాగంలో (65) విశాల్ కాళి రామన్ తుమూర్ ఓచిర్ తుల్గాపై పుష్‌అవుట్ ద్వారా 9-6 విజయాన్ని సాధించడంతో టై సమమైంది. మార్వ్యా మహిళల బౌట్‌లో (53) హర్యానా కెప్టెన్ యుయి సుసాకి ద్వారా తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. మాజీ ఒలింపిక్ ఛాంపియన్ బహుళ టర్న్అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌లను సద్వినియోగం చేసుకుని 8-0 ఆధిక్యాన్ని సాధించింది, ఆంటిమ్ పంఘల్ సుసాకిపై ప్రారంభ పీరియడ్‌లో చివరి దశలో పాయింట్లు సాధించిన మొదటి రెజ్లర్‌గా నిలిచింది. రెండవ పీరియడ్ 8-3 విజయాన్ని నమోదు చేసి హర్యానాను 3-2తో ముందంజలో ఉంచింది.

ఆట

# హాట్ టాపిక్‌గా బ్యాటింగ్ లైనప్
### టి20 వరల్డ్ కప్‌లో మెంటలెక్కించే టీమ్స్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 సమీపిస్తున్న వేళ ఈసారి పలు జట్లు పవర్ హిట్టర్లతోపాటు, స్టేబుల్ బ్యాట్స్‌మన్లతో బలమైన బ్యాటింగ్ లైనప్స్ సిద్ధం చేసుకున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లు బలమైన బ్యాటింగ్ లైనప్స్‌తో టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. భారత బ్యాటింగ్ యూనిట్ యువత, సీనియర్లతో బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆరంభంలో వేగంగా రన్స్‌చేయగల సత్తాఉండగా, సూర్య కుమార్ యాదవ్, తిలక్ వర్మ మిడిల్ ఓవర్లలో మ్యాచ్‌ను పూర్తిగా తిప్పగలరు. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్‌గా కీలకంగా మారనుండగా, రింకూ సింగ్, శివమ్ దూబే డెత్ ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకు పడే సామర్థ్యం ఉండగా, సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా స్థిరత్వాన్ని అందిస్తాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ విభాగం పవర్ హౌస్‌లా ఉంది. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వేగంగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించగలిగి ఉండగా, మ్యాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, మార్కస్ స్టోయినిస్ లాంటి పవర్ హిట్టర్లు చివరి ఓవర్లలో మ్యాచ్‌ను క్షణాల్లో ఫినిష్‌చేయగరు. కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్ కూడా బ్యాటింగ్‌కు మరింత బలాన్ని అందించగలరు. ఆసీస్ జట్టులోని ప్రతిఒక్కరు డేంజరస్ బ్యాటర్లే. పటిష్ట బ్యాటింగ్‌లైనప్ ఆసీస్ కలిగి ఉంది. న్యూజిలాండ్ బ్యాటింగ్ యూనిట్ క్రమశిక్షణ, స్థిరత్వానికి మారుపేరు. ఫిన్ అలెన్, డెవన్ కాన్వే లాంటి ఓపెనర్లు వేగంగా రన్స్ చేస్తూ, స్కోర్ బోర్డును పరుగెత్తిస్తారు. డారిల్ మిచెల్, గ్లెన్‌ఫిలిప్స్, రచిన్‌రవీంద్ర మధ్య ఓవర్లలో జట్టును ఆదుకునే సత్తా ఉండగా, టీమ్ సీఫర్ట్, నిషామ్ ఫినిషర్లుగా కీలక పాత్ర పోషిస్తారు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ యూనిట్ యువ, సీనియర్ల అనుభవాన్ని కలిగి ఉంది. ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగలడు. డేవిడ్ మిల్లర్ లాంటి అనుభవజ్ఞుడు ఫినిషర్‌గా కీలకంగా ఉండగా, స్టబ్స్, బ్రెవిస్, రికెల్టన్ లాంటి యువ ఆటగాళ్లు స్పీడైన రన్స్ రాబట్టే సత్తా ఉన్న వారు. ఇక క్వింటన్ డికాక్ ఓపెనర్‌గా జట్టుకు భారీ ఆరంభాలు అందించే సత్తాఉంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్ పూర్తిగా దూకుడుగా ఉంటుంది. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, బెన్ డకెట్ లాంటి బ్యాట్స్‌మన్స్ పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను ప్రత్యర్థుల నుంచి దూరంచేయగలరు. హ్యారీ బ్రూక్, విల్ జాక్స్, సామ్ కరన్ లాంటి ఆటగాళ్లు మధ్య, చివరిఓవర్లలో కీలకంగా మారగలరు. టామ్ బాంటన్ మ్యాచ్‌ను క్షణాల్లో ముగించగడు. ఇంగ్లాండ్ జట్టు బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగి ఉంది. పాకిస్థాన్ బ్యాటింగ్ యూనిట్లో క్లాస్, టెక్నిక్ ఎక్కువగా కనిపిస్తుంది. బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్ లాంటి ఆటగాళ్ల పెద్ద ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యంతో ఉన్నారు. యువ ప్లేయర్స్ సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘాలు ధాటిగా ఆడుతారు. నవాజ్, ఉస్మాన్ లాంటి ఆటగాళ్లు మిడిల్ ఆర్డర్లో కీలకంగా ఉంటారు. పవర్ హిట్టింగ్, లోతైన బ్యాటింగ్, మ్యాచ్ విన్నింగ్ సామర్థ్యం దృష్ట్యా ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లాండ్ జట్లు అత్యంత బలమైన బ్యాటింగ్ యూనిట్లుగా కనిపిస్తున్నాయి.



# ఈక్విటీలకు ఆర్థికసర్వే దన్ను

**ముంబయి,జనవరి 29:** దేశీయ ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు గురువారం స్వల్పలాభాలతో ముగిసాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే ప్రభావం కూడా ఈక్విటీలపై ఉంది. అలాగే ఇంట్రాడేలో ఉన్న కనిష్ఠంనుంచి కోలుకున్నాయి. నెలవారీ ఎఫ్‌అండ్‌ఓ కాంట్రాక్టులు ముగుస్తుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్‌చేసారు. ఆర్థికవృద్ధి 7.2శాతంవరకూ ఉంటుందన్న ఆర్థికసర్వే నివేదికలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు కూడా పెంచడం కలిసొచ్చింది. కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి ఒకటవ తేదీ ప్రవేశపెడుతున్న తరుణంలో మార్కెట్లు సత్వరమే రికవరీ అయినట్లు తెలుస్తోంది. బిఎస్ఇ సెన్సెక్స్ 221.69 పాయింట్లుపెరిగి 82,566.37 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ కూడా 76.15 పాయింట్లుపెరిగి 25,418.90 పాయింట్లవద్దకు చేరుకుంది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.26శాతం, నిఫ్టీ 1.48శాతంపెరిగింది. ఎల్ అండ్‌టి 3.66శాతం, యాక్సిస్‌బ్యాంకు 3.32 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.2శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10 శాతం, పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.19శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 1706 కంపెనీలు షేర్లుపెరిగితే 2533 షేర్లు క్షీణత ఎదుర్కొన్నాయి. 159 కంపెనీలు మాత్రం స్థిరంగాకొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.98 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచ్లు ఫిబ్రవరి ఐదునాటికి 5.29శాతం క్షీణించి 1.74,650గా నిలిచింది. అమెరికా పదేళ్ల బాండ్లు రిటర్నులు 0.09శాతం పెరిగి 4.255గా నిలిచింది. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్‌ముడిచమురు మార్చినెల సెటిల్‌మెంట్ అయింది 1.40సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 69.80 డాలర్లుగా నడించింది. నిఫ్టీలోమెటల్‌సూచీ 3.07శాతంపెరిగింది. హిందూస్థాన్‌కాపర్ 20శాతం, ఎల్‌అండ్‌టి 3.66శాతం, బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ 10శాతం ఇక్లెర్క్స్ సేవలు 5.80శాతం చొప్పున పెరిగాయి. ఇక కెనరాబ్యాంక్ మాత్రం 4.75శాతం క్షీణించింది. ఎస్‌బిఐ కార్డ్స్ సేవలు 1.82శాతం క్షీణించింది.

హెరిటేజ్‌ఫుడ్స్ కూడా 8.60శాతం క్షీణించింది. గ్లాండ్‌ఫార్మా 6.75శాతం షేర్లు పెరిగినట్లు తేలింది. ఎఎస్‌కె ఆటోమోటివ్ కూడా 3.33శాతంపెరిగింది. గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ కూడా ట్రేడింగ్‌లో 2.52శాతం లాభపడినట్లు గణాంకాలు చెపుతున్నాయి.

## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




వాణిజ్యం



## 61% పెరిగిన వేదాంత నికరలాభాలు

**ముంబయి,జనవరి 29:** మైనింగ్ దిగ్గజ సంస్థ వేదాం త గురువారం 61శాతం నికరలాభాల్లో వృద్ధినమోదుచేసింది. డిసెంబరు చివరినాటికి మూడునెలలకుగాను రూ.5710 కోట్లు ఆర్జించినట్లు బిఎస్ఇకి నివేదించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.3547 కోట్లు ఆర్జించింది కంపెనీ రాబడులు కూడా 36.9శాతం పెరిగి 23,369 కోట్లు ఆర్జించింది. అదే గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో 17,603 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ గతంలో ఎన్నడూలేనంతగా ఎబిడిటా మార్జిన్ పెంచుకుందని, రూ.15,171 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. వార్షిక వృద్ధి 34శాతం ఉందని త్రైమాసికం వారీగా 31శాతం ఉన్నట్లు వివరించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 629 బేసిస్‌పాయింట్లుపెంచుకుంది. అంటే 41శాతంపెరిగినట్లు వివరించింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా మాట్లాడుతూ కంపెనీ ఎబిడిటా మార్జిన్ గతంలో ఎన్నడూలేనంతగా పెంచుకోగలిగామని వివరించారు. అల్యూమినియం విభాగంలో ఎబిడిటా మార్జిన్ టన్నుకు 1268 డాలర్లుపెరిగిందని, అల్యూమినా, అల్యూమినియం ఉత్పత్తికి ఎంతో మేలు చేసిందన్నారు. జింక్ ఇండియా కూడా త్రైమాసికంలో రూ.6064 కోట్లు ఎబిడిటాసాధించిందని తెలిపారు. ఇక వెండి వెలికితీత కూడా 44శాతం పెరిగి లాభదాయకతను పెంచిందని, ఇంజక్ ఇంటర్నేషనల్‌కూడా 28శాం వార్షిక ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసిందని తెలిపింది.



## భారీగా పెరిగిన స్విగ్గీ నష్టాలు
### మూడోత్రైమాసికంలో రూ.1065 కోట్లు నష్టం

**ముంబయి,జనవరి 29:** ఆహార ఉత్పత్తుల పంపిణీ సంస్థ స్విగ్గీ తన మూడో త్రైమాసికంలెఓ రూ.1065 కోట్ల నష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.799 కోట్ల నష్టం కంటే భారీగాపెరిగింది. కంపెనీ రాబడులు 53.9శాతంపెరిగి 6149 కోట్లుగా ఉన్నాయి. ఇదే గత ఏడాదిమూడో త్రైమాసికంలో 3993కోట్లనుంచి గణనీయంగాపెంచుకోగలిగింది. నెవారీ లావాదేవీలు సగటున 36.8శాతం పెరిగినట్లు వెల్లడించింది. మొత్తం 24.3 మిలియన్ లావాదేవీలు జరిగాయని, 5.9శాతం వృద్ధిని సాధించామన్నారు. బి2సి సర్దుబాటు రాబడులు ఎబిడిటా మార్జిన్ 16 బేసిస్‌పాయింట్లు క్షీణించింది. వార్షిక వృద్ధితో చూస్తే 3.5శాతంగా ఉంది. ఫుడ్ డెలివరీ విభాగంలో స్థూల ఆర్డర్లు 205.శాతంపెరిగిరూ.8959 కోట్లుగా ఉన్నాయని తెలిపింది.నెలవారీగా కస్టమర్లు 22శాతంపెరిగి 18.1 మిలియన్లకు చేరినట్లు వివరించిన సంస్థ ఇన్‌స్టామార్ట్‌లో 103.2 వాతం వృద్ధిని సాధించి 7938 కోట్ల విలువైన లావాదేవీలు నిర్వహించినట్లు తెలి పింది. 40శాతం వృద్ధితో 746 కోట్లుపెరి గిందని తెలిపింది మొత్తం 34 డార్క్ స్టోర్స్ ఈ త్రైమాసికంలోప్రారంభించామని, మొత్తం 1136 డార్ట్‌స్టోర్స్ నిచేస్తున్నట్లు దీనివల్ల మార్జిన్‌కూడా 2.5వాతం మెరుగుపడిందన్నారు.స్విగ్గీషేర్లు 1.1శాతం పెరిగి రూ. 327.40లుగా బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి.

## దేశంలో డీమాట్ ఖాతాలు 12 కోట్లు

**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత క్యాపిటల్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం కొత్త రికార్డులు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు కేవలం 9 నెలల కాలంలోనే దేశవ్యాప్తంగా ఏకంగా 2.35 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు తెరుచుకున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 ఈ కీలక గణాంకాలను వెల్లడించింది. ఆర్థిక విషయాలపై ప్రజల్లో అవగాహన పెరగడం, మార్కెట్లపై నమ్మకం ఇనుమడించడమే ఇందుకు ప్రధాన కారణమని సర్వే పేర్కొంది. 2025 సెప్టెంబర్ నాటికే దేశంలో మొత్తం ప్రత్యేక డీమ్యాట్ మదుపర్ల సంఖ్య 12 కోట్లు దాటింది. వీరిలో దాదాపు నాలుగో వంతు మహిళలు ఉన్నారు. పెట్టుబడులు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కావడం లేదు. డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్లలో ఉన్న 5.9 కోట్ల మంది మదుపర్లలో 3.5 కోట్ల మంది టైర్‌వన్, టైర్2యేతర నగరాలు, పట్టణాల నుంచే ఉండటం ఈ మార్పునకు నిదర్శనం. ప్రజలు తమ పొదుపును సంప్రదాయ మార్గాల నుంచి ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లిస్తున్నారని సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్‌ల ద్వారా పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2017లో నెలకు సగటున రూ. 4,000 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు, ఈ ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 28,000 కోట్లకు పైగా పెరిగాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి ఉన్నప్పటికీ, బలమైన దేశీయ మదుపర్ల మద్దతు, ప్రభుత్వ విధానాలతో భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా రాణించాయి. ఈ కాలంలో నిఫ్టీ 11.1 శాతం, సెన్సెక్స్ 10.1 శాతం చొప్పున లాభపడ్డాయి. గతేడాదితో పోలిస్తే ఐపీఓల సంఖ్య 20 శాతం పెరగ్గా, ఎస్ఎంఈ విభాగంలో 217 కంపెనీలు రూ. 9,600 కోట్లకు పైగా నిధులు సమీకరించాయని సర్వే వివరించింది.





## క్షీణించిన టాటామోటార్స్ నికరలాభం

**ముంబయి,జనవరి 29:** టాటామోటార్స్ మూడో త్రైమాసిక నికరలాభాలు గణనీయంగా తగ్గాయి. రూ.705 కోట్లు ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన 1355 కోట్ల నికరలాభంతో పోలిస్తే 48శాతం క్షీణించింది. టాటామోటార్స్ ఇపుడు కేవలం వాణిజ్య వాహనాల విభాగానికి మాత్రమే పరిమితం అయింది. ప్యాసింజర్ వాహన బిజినెస్‌ను గత అక్టోబరులో నే విడదీయడంతో ఇపుడు కమర్షియల్ వాహన సెగ్మెంట్‌కే పరిమితం అయింది. రాబడులు 16శాతం పెరిగి 21,847 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ మార్జిన్లు 12.60శాతం మెరుగుపడినట్లు సంస్థ వెల్లడించింది. అదే గత ఏడాది మూడో త్రైమాసికంలో 12.07శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. జిఎస్టీ హేతుబద్ధీకరణ, పండుగల సీజన్‌లో కొంతమేర కలిసొచ్చిందని ఎండి సిఇఒ గిరీష్ వాఘ్ తెలిపారు. ప్రస్తుతం భావితరం ట్రక్కులు 17 రకాలు విడుదల చేసామని, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి అధునాతన ఫీచర్లతో ఈ ట్రక్కులుఉన్నట్లు తెలిపారు. వాణిజ్య వాహనాల హోల్‌సేల్ బిజినెస్ పటిష్టమైన వృద్ధి ఉందని, 20శాతం పెరిగి వార్షిక వృద్ధితో 1,16,800 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. దేశీయంగా కూడా 18శాతం పెరిగాయని, ఎగుమతులు 70శాతంపెరిగినట్లు కంపెనీ వివరించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 30 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 12.5శాతంగా ఉంది. డీమెర్జర్ స్టాంప్‌డ్యూటీ రూ.902 కోట్లు, అనుకోనివిధంగా వచ్చిన తక్షణ వ్యయం 1,643కోట్లు, కొత్త లేబర్‌కోడ్లకు 603 కోట్లు, ఇక వివిధ ఆస్తుల స్వాధీనం ప్రక్రియకోసం మరో 82 కోట్లు వ్యయం జరిగిందని, నికరలాభాలపై ప్రభావంచూపించినట్లు తెలిపారు.



## యేడాది మొత్తం ఈక్విటీల్లో ఎఫ్ఐఐల విత్‌డ్రాలే ఎక్కువ

**న్యూడిల్లీ,జనవరి 29:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లనుంచి ఎక్కువశాతం విత్‌డ్రాలకే ప్రాధాన్యతనిచ్చినట్లు ఆర్థికసర్వేలో వెల్లడి అయింది. ఈ ఆర్థికసంవత్సరంలో ఎఫ్‌పిఐలు రూ.16,500 కోట్లు విత్‌డ్రాచేసినట్లు తేలింది. అయితే ఎఫ్‌పిఐలపరంగా ఈక్విటీలనుంచి తరలిపోయినా డెట్‌రంగంలో పెరిగినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ డిసెంబరు మాసంలో ఎఫ్‌పిఐలు ఎక్కువగా భారతీయ ఈక్విటీలనుంచి తరలివెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. గ్లోబల్ రిస్క్ పెరగడం, అమెరికా బాండ్ల రాబడులు పెరగడం, వాణిజ్యం, విధివిధానాల్లో అనిశ్చితి, రూపాయి క్షీణత వంటివి కారణం అయినట్లు తెలుస్తోంది. పదేళ్ల భారత్, యుఎస్ ప్రభుత్వ బాండ్ల రాబడులు 165 బేసిస్‌పాయింట్లు తగ్గాయి. ఆ తర్వాత 250 బేసిస్‌పాయింట్లకు పెరిగాయి. డిసెంబరులో భారతీయ రాబడులు పెరిగితే అమెరికా డాలర్ క్షీణించింది. విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాలు పెంచితే దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెంచారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు నికరంగా ఎక్కువ స్థాయిలో కొనుగోళ్లుజరిపాయి. దీనివల్ల ఎఫ్‌పిఐల విక్రయ నష్టాలనున భర్తీచేసినట్లయింది.



రెండోత్రైమాసికంలో ఎన్ఎస్ఇలో లిస్ట్ అయిన ఈక్విటీల విలువల్లో 18.3 శాతం దేశీయ ఇన్వె స్టర్లు కొనుగోళ్లు ఉన్నట్లు తేలింది. అలాగే 16.7శాతం ఎఫ్ఐఐల వాటాలున్నట్లు తేలింది.దేశీయంగా మూచువల్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు ఎఫ్‌పిఐల పరంగాచూస్తే 81.4 లక్షల కోట్లుగాఉన్నాయి.మార్చి 2025 నాటికి 10.4 శాతంపెరిగాయి. దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడుల పరంగా కీలకంగా కొనసాగారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీల్లోనే ఎక్కువ పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్ల విత్‌డ్రాల సమయంలో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టు బడులు పెంచినట్లు తేలింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14